www.velthuru.com RNI TEL TEL/ 2019 / 78609 గురువారం

# వెలుతురు

రంగారెడ్డి। 18, ఏప్రిల్ 2024 తెలుగు దిన పత్రిక

సంపుటి: 5 సంచిక: 329, పేజీలు: 12, వెల: రూ.5/-

## కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్‌గా సీఎం రేవంత్‌రెడ్డి

- కేరళలో రెండ్రోజుల పాటు ప్రచారం

హైదరాబాద్,ఏప్రిల్17(వెలుతురు): కాంగ్రెస్ పార్టీ నేషనల్ స్టార్ క్యాంపెయినర్‌గా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వ్యవహరించనున్నారు. ఎన్నికల ప్రచారానికి రావాలని 7 రాష్ట్రాల పీసీసీల నుంచి రేవంత్‌కు ఆహ్వానం వచ్చింది. ఇందులో ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర,కేరళతో పాటు తమిళనాడు, బీహార్ ,గుజరాత్ రాష్ట్రాలు ఉన్నాయి. ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి ప్రచార షెడ్యూల్ ఖరారైంది. కేరళలో రెండు రోజులు రేవంత్ ప్రచారం చేయనున్నారు. రాహుల్ గాంధీ పోటీ చేస్తున్న వయనాడ్‌తో పాటు కేసీ వేణు గోపాల్ పోటీ చేస్తున్న అలప్పుజ సెగ్మెంట్లలో క్యాంపెయిన్ చేయనున్నారు. మరో వైపు ఏప్రిల్ 19 నుంచి వచ్చేనెల 11 వరకు రాష్ట్రంలో సీఎం రేవంత్ సుడిగాలి పర్యటన చేయనున్నారు రేవంత్. 50 సభలు, 15 రోడ్ షోలలో పాల్గొనున్నారు.



## అయోధ్యలో అద్భుత ఘట్టం
# ఆవిష్కరణ

- బాలరాముడి నుదిటిపై సూర్య తిలకం
- బాల రాముడికి దివ్య అభిషేకం నిర్వహణ
- దేశవిదేశాల నుంచి పోటెత్తిన భక్తులు

అయోధ్య,ఏప్రిల్17(వెలుతురు): ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య ఆలయంలో ఈసారి శ్రీరామనవమి వేడుకలు అంబరాన్నంటాయి. శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరిగిన తర్వాత తొలి నవమి ఇదే కావడంతో అంగరంగ వైభవంగా ఉత్సవాలు నిర్వహించారు. స్వామి దర్శనం కోసం దేశవిదేశాల నుంచి భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా ఆలయంలో అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. బాలరాముడి నుదిటిపై కన్పించిన 'సూర్య





తిలకం తో భక్తజనం పరవశించిపోయింది. అధునాతన సాంకేతికత సాయంతో సూర్యకిరణాలు గర్భగుడి లోని రాముడి విగ్రహం నుదుటిపై తిలకం వలే 58 మిల్లీమీటర్ల పరిమాణంలో కొన్ని నిమిషాల పాటు ప్రసరించాయి. మూడో అంతస్తు నుంచి గర్భగుడిలోని బాలరాముడి విగ్రహం నుదుటిపై సూర్యకిరణాలు ప్రసరించేలా అయోధ్య ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పరిమిత సంఖ్యలో పైపులు, కుంభాకార, పుటాకార కటకాలతో ఒక వ్యవస్థను రూపొందించారు. ఆలయ శిఖర భాగంలో సూర్యకాంతి గ్రహించేందుకు ఒక పరికరాన్ని ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి పైపులోపలికి కాంతి ప్రసరించి తిలకంగా కన్పించింది. బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్(ఐఐఏ) శాస్త్రవేత్తలు, పరిశోధకుల సాయంతో కేంద్ర భవన నిర్మాణ పరిశోధన సంస్థ(సీబీఆర్ఐ) శాస్త్రవేత్తలు ఆలయాన్ని ప్రత్యేకంగా నిర్మించారు. ప్రతి శ్రీరామ నవమి రోజున శ్రీరాముడి విగ్రహంపై ఈ తిలకం దిద్దేలా ఏర్పాట్లు చేశారు. అయితే, ఏటా సూర్యకిరణాలు అక్కడే ఎలా పడతాయి? వాతావరణంలో మార్పులు వస్తుంటాయి కదా? గ్రహాల పరిభ్రమణం, సమయం ఒకేలా ఉంటుందా? అన్న ప్రశ్నలు తెరపైకి వచ్చాయి.

మిగతా.. 2లో



## అంగరంగ వైభవంగా సీతారాముల
# కళ్యాణోత్సవం..

- ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించిన సిఎస్
- హాజరైన మంత్రులు భట్టి, పొంగులేటి, పలువురు విఐపిలు
- కళ్యాణోత్సవానికి బారీగా తరలివచ్చిన భక్తులు
- నేడు స్వామివారి పట్టాభిషేక మహోత్సవం

భద్రాచలం,ఏప్రిల్17(వెలుతురు): భద్రాద్రిలో శ్రీరామనవమి శోభ సంతరించుకుంది. శ్రీరామ నవమి భద్రాచల క్షేత్రంలో బుధవారం సీతారాముల కల్యాణం నేత్రపర్వంగా సాగింది. కళ్యాణోత్సవానికి భక్తుల బారీగా హాజరయ్యారు. భద్రాచల పుణ్యక్షేత్రంలో శ్రీసీతారాముల కళ్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. శుభ మూహూర్త సమయాన సీతమ్మ మెడలో రామయ్య పుస్తె కట్టడంతో కళ్యాణ క్రతువు పూర్తయ్యింది. మిథులా స్టేడియంలోని మండపంలో సీతారాముల కళ్యాణ మహోత్సవం ఎంతో వైభవంగా జరిగింది. ఉదయం రామాలయంలో మూలవరులకు మొదట కళ్యాణం జరిగింది. ఆపై ఉత్సవమూర్తులను ఆలయం నుంచి మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా మిథులా కళ్యాణ మండపానికి తీసుకొచ్చారు. సీతారాముల కళ్యాణోత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకులు నిర్వహించారు. ఉదయం 10:30 గంటలకు కళ్యాణోత్సవం ప్రారంభం అవగా.. అభిజిత్ లగ్నంలో సీతారామయ్యలకు రుత్వికులు జీలకర్ర బెల్లం పెట్టారు. ఆపై సీతమ్మ మెడలో రామయ్య మాంగళ్యధారణ చేశారు. తరువాత తలంబ్రాల కార్యక్రమం జరిగింది. అనంతరం జరిగే కార్యక్రమాలను అర్చకులు సంప్రదాయ బద్ధంగా పూర్తి చేశారు. ఈ వేడుకల్లో భాగంగా స్వామిఅమ్మవార్లకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి పట్టువస్త్రాలను సమర్పించారు. కల్యాణం సందర్భంగా సీతారామచంద్రస్వామి వారలకు ప్రభుత్వం తరపున రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

మిగతా.. 2లో

## రాష్ట్రంలో పెరుగనున్న
# ఉష్ణోగ్రతలు

- వడగాలులు వీచే అవకాశం ఉంది
- పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిక

హైదరాబాద్,ఏప్రిల్17(వెలుతురు): తెలంగాణ రాష్ట్రంలో కింది స్థాయి గాలులు దక్షిణ, ఆగ్నేయ దిశ నుంచి వీస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. 2 రోజులు తెలంగాణ రాష్టంలో కొన్ని జిల్లాలలో అక్కడ అక్కడ గరిష్ట ఉష్ణోగ్రత్తలు క్రమేణా 2 నుంచి 3 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు పెరిగే అవకాశం ఉందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో కొన్ని జిల్లాలలో అక్కడక్కడ వడగాలులు వీచే అవకాశం ఉందని అంచనా వేశారు. కొమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట జిల్లాల్లో




అక్కడక్కడ వేడిగాలులు వీచే అవకాశం ఉంది. ఈ ప్రాంతాల్లో ఎల్లో అలర్ట్ జారీ చేశారు. హైదరాబాద్ లో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు వరుసగా 40 డిగ్రీలు, 27 డిగ్రీలుగా ఉండే అవకాశం ఉంది. ఉపరితల గాలులు గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో నైరుతి దిశగా ఉండే అవకాశం ఉంది. నిన్న గరిష్ఠ ఉష్ణోగ్రత 39.1 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 27.1 డిగ్రీలుగా నమోదైంది. 39 శాతంగా గాలిలో తేమ శాతం నమోదైంది. రాయలసీమ మీద ఉన్న ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 1.5 కిలో మీటర్ల ఎత్తులో ఉంది. ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణలో దక్షిణ దిశగా గాలులు వీస్తున్నాయి. ఈ వాతావరణ ప్రభావంతో ఉత్తర కోస్తాంధ్ర, యానం ప్రాంతాల్లో వాతావరణం

మిగతా.. 2లో


## అవినీతికి ఛాంపియన్ ప్రధాని మోడీ

- ఎలక్టోరల్ బాండ్లే ఇందుకు నిదర్శనం
- ఘాటు విమర్శలు చేసిన రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ,ఏప్రిల్17(వెలుతురు): ప్రధాని నరేంద్ర మోదీ అవినీతికి ఛాంపియన్ అని కాంగ్రెస్ ముఖ్య నేత రాహుల్ గాంధీ ఘాటు వ్యాఖ్యలు చేశారు. రద్దు చేసిన ఎలక్టోరల్ బాండ్ల పథకంపై ప్రధాని మోదీ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై స్పందించిన రాహుల్ గాంధీ,ఇది ప్రపంచంలోనే అతిపెద్ద దోపిడీ పథకం అని ఆరోపించారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్‌తో కలిసి రాహుల్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రధాని మోదీ ఇచ్చిన ఇంటర్వ్యూ స్క్రిప్ట్ అని విమర్శించారు. పారదర్శకత కోసం ఎన్నికల బాండ్లను తీసుకొచ్చామని ప్రధాని మోదీ చెప్పారు. అదే నిజమైతే ఆ వ్యవస్థను సుప్రీంకోర్టు ఎందుకు రద్దు చేసిందని ప్రశ్నించారు. 'ఇది ప్రపంచంలోనే అతిపెద్ద దోపిడీ పథకం. దేశంలోని వ్యాపారవేత్తలందరూ దీన్ని అర్థం చేసుకున్నారు. ప్రధానమంత్రి ఎంత స్పష్టత ఇవ్వాలనుకున్నా దాని వల్ల ఎటువంటి ఉపయోగం లేదు. ఎందుకంటే ప్రధాని అవినీతికి నాయకుడని దేశం మొత్తానికి తెలుసు' అని రాహుల్ గాంధీ రాహుల్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని ఈ ఏడాది ప్రారంభంలో సుప్రీంకోర్టు రద్దు చేసింది. ఈ పథకంపై స్పందించిన మోదీ ప్రతిపక్షాలు అసత్యాలను ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. రాజకీయాల్లో నల్లధనాన్ని అరికట్టడమే లక్ష్యంగా ఈ పథకాన్ని రూపొందించినట్లు ప్రధాని తెలిపారు. దర్యాప్తు సంస్థల ద్వారా ఎలక్టోరల్ బాండ్లను కొనుగోలు చేసిన 16



కంపెనీలు ఇచ్చిన మొత్తం విరాళాలలో కేవలం 37 శాతం మాత్రమే బీజేపీకి, మిగతా 63 శాతం ప్రతిపక్ష పార్టీలకు చేరాయని మోదీ వివరించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తున్నాయని రాహుల్ గాంధీ ఆరోపించారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య వ్యవస్థను నాశనం చేసేందుకు ఒకవైపు ఆర్ఎస్ఎస్, బీజేపీ ప్రయత్నిస్తున్నాయి. మరోవైపు ఇండియా కూటమి, కాంగ్రెస్ పార్టీలు రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ప్రయత్నిస్తున్నాయని రాహుల్ చెప్పారు. ఈ ఎన్నికలలో నిరుద్యోగం అతిపెద్ద సమస్య కాగా రెండో సమస్యగా ద్రవ్యోల్బణం ఉందన్నారు. కానీ ఈ సమస్యలపై ప్రధాని గానీ, బీజేపీ గానీ మాట్లాడడం లేదని విమర్శించారు.




## సిఎం రేవంత్‌పై అనుచిత వ్యాఖ్యలు


- కెసిఆర్‌కు ఇసి నోటీసులు జారీ

హైదరాబాద్,ఏప్రిల్17(వెలుతురు): సిఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కారణంగా బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఎన్నికల కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని ఈ మేరకు నోటీసులు ఇచ్చింది. సిరిసిల్లలో సీఎం రేవంత్ రెడ్డి పై చేసిన వ్యాఖ్యలలపై నోటిసులు జారీ చేసింది. కాంగ్రెస్ నేతలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నోటీసులు ఇచ్చింది. గురువారం 18వ తేదీ లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. గురువారం ఉదయం 11 గంటలలోగా కేసీఆర్ వివరణ ఇవ్వాల్సి ఉంది. ఈ మేరకు బుధవారం ఈసీ నోటీసులు ఇచ్చింది. సిరిసిల్ల సభలో సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు

మిగతా.. 2లో

## జాబిల్లిపై కాలుపెట్టే వరకు ప్రయత్నాలు

- తదుపరి పరిశోధనలు కొనసాగిస్తూనే ఉంటాం
- ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ వెల్లడి



అహ్మదాబాద్,ఏప్రిల్17(వెలుతురు): అందని ద్రాక్షగా ఉన్న చందమామ దక్షిణ ధ్రువంపైకి విజయవంతంగా ల్యాండర్‌ను దింపి అంతరిక్ష రంగంలో సరికొత్త చరిత్రను లిఖించింది భారత్. ఈ ప్రయోగం గురించి తాజాగా దేశ అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ మరోసారి స్పందించారు. భవిష్యత్తుల్లోనూ మరిన్ని జాబిల్లి యాత్రలు చేపడతామని చెప్పారు. అహ్మదాబాద్‌లో ఆస్ట్రోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా నిర్వహించిన కార్యక్రమంలో ఇస్రో ఛైర్మన్ పాల్గొన్నారు. ఈసందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. 'చంద్రయాన్-3 విజయవంతమైంది. దాన్నుంచి డేటాను సేకరించి శాస్త్రీయ అధ్యయనం చేస్తున్నాం. ఇక, జాబిల్లిపై భారతీయుడు అడుగుపెట్టేంతవరకు చంద్రయాన్ సిరీస్‌లను కొనసాగించాలని అనుకుంటున్నాం. అంతకంటే ముందు ఇంకా చాలా సాంకేతికతలపై పట్టు సాధించాలి. అక్కడికి వెళ్లి తిరిగి రావడంపై

మిగతా.. 2లో

## నేటి నుంచి నామినేషన్లు

### నేడు నాలుగోదశ ఎన్నికలకు నోటిఫికేషన్

- నేటి నుంచే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం
- ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ నోటిఫికేషన్
- 18 నుంచి 25 వరకు నామినేషన్ల స్వీకరణ
- 26న నామినేషన్ల పరిశీలన.. 29న ఉపసంహరణ
- మే 13న నాలుగోదశలో పోలింగ్ నిర్వహణ

న్యూఢిల్లీ/ హైదరాబాద్,ఏప్రిల్17(వెలుతురు): దేశ వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలకు సమయం ఆసన్నమైంది. మొత్తం 7 దశలలో దేశంలోని అన్ని లోక్‌సభ స్థానాలకు కేంద్ర ఎన్నికల సంఘం పోలింగ్ నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తోంది. మార్చి 16న సీఈసీ రాజీవ్ కుమార్ సార్వత్రిక ఎన్నికలు 2024 షెడ్యూల్ విడుదల చేయగా.. దేశ వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని విధాలుగా ఈసీ ఏర్పాట్లు చేస్తోంది. ఏప్రిల్ 19న తొలి దశ పోలింగ్ జరగనుంది. లోక్‌సభ ఎన్నికలకుగానూ ఇదివరకే మూడు దశల ఎన్నికల నోటిఫికేషన్లు ఇసి విడుదల చేసింది. 18న నాలుగో దశ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు ఇసి ఏర్పాట్లు చేస్తోంది. నాల్గవ దశలో 10 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో 96 లోక్ సభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఆంధ్రప్రదేశ్ (25 స్థానాలు), తెలంగాణ (17), బిహార్ (5), ఝార్ఖండ్ (4), మధ్యప్రదేశ్ (8), మహారాష్ట్ర (11), ఒడిశా (4), ఉత్తర్ ప్రదేశ్ (13), పశ్చిమ బెంగాల్ (8), జమ్మూకాశ్మీర్ (1). గురువారం ఆంధప్రదేశ్, తెలంగాణలో ఎన్నికలకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ కానుంది. అదే రోజు నుంచి అంటే 18 నుంచే అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. ఏప్రిల్ 25 వరకూ నామినేషన్లు దాఖలుకు గడువు ఇచ్చారు. ఈ 26న నామినేషన్ల పరిశీలన చేపడతారు. చివరికి ఈ నెల 29న నామినేషన్ల ఉప సంహరణతో ఈ పక్రియ పూర్తి అవుతుంది. నాలుగో దశలో ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణలలో మే 13న ఎన్నికలు జరగనున్నాయి. ఏపీలో అసెంబ్లీ ఎన్నికలతో పాటు లోక్ సభ స్థానాలకు, తెలంగాణలో లోక్‌సభ ఎన్నికలతో పాటు ఖాళీ అయిన సికింద్రాబాద్ కంటోన్మెంట్ స్థానానికి ఇదే దశలో పోలింగ్ నిర్వహించనున్నారు. జూన్ 4 న ఓట్లు లెక్కించి, విజేతల్ని ఇసి ప్రకటించనుంది. ఈ క్రమంలో గురువారం ఏపీ, తెలంగాణ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది.





మిగతా.. 2లో

## ఎన్నికలు స్వేచ్ఛగా జరిగితే...
# బిజెపి ఔట్

- 180 సీట్లకు మించి సాధిచడం కష్టమే
- ఇవిఎంల ట్యాంపరింగ్ లేకుండా చేయగలరా
- 400 సీట్లు వస్తాయని ధీమాగా ఎలా చెప్పగలరు
- యూపి ఎన్నికల ప్రచారంలో ప్రియాంక

లక్నో,ఏప్రిల్17(వెలుతురు): ఎన్నికలు సజావుగా జరిగితే..ఈవిఎంల ట్యాంపరింగ్ జరక్కపోతే బిజెపికి 180కి మించి సీట్లు రావని కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ అన్నారు. లోక్‌సభ ఎన్నికల వేళ ఈవీఎంల ట్యాంపరింగ్ అంశాన్ని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా ప్రస్తావించారు. ఈవీఎంల ట్యాంపరింగ్ లేకుండా దేశంగా స్వేచ్ఛగా, సజావుగా ఎన్నికలు జరిగితే బీజేపీకి 180కి మించి సీట్లు రావని అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని షహరాన్‌పూర్‌లో బుధవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రియాంక మాట్లాడుతూ, ఏ ఆధారంతో 400కు పైగా సీట్లు గెలుస్తామని బీజేపీ చెబుతోందని ప్రశ్నించారు. వాళ్లేమైనా జ్యోతిష్యులా?



మిగతా.. 2లో

## రాజకీయంగా నన్ను వేధిస్తున్నారు

- కారు ప్రమాదంలో నా కుమారుడి ప్రమేయం లేదు
- కావాలనే పోలీసులు కేసులో ఇరికించారు
- బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ ఆవేదన



హైదరాబాద్,ఏప్రిల్17(వెలుతురు): జూబ్లీహిల్స్ రోడ్డు ప్రమాదం కేసు ఎన్నో మలుపులు తిరిగింది. గత రెండేళ్లుగా ఈ కేసులో అనేక కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడి చుట్టూనే ఈ కేసు తిరుగుతోంది. ఈ కేసులో అఫ్నాన్‌ను గతంలో నిందితుడిగా చేర్చారు. అయితే ప్రమాద సమయంలో షకీల్ కుమారుడు రాహెల్ డ్రైవ్ చేశారని.. అతడిని తప్పించడానికి ప్రయత్నాలు చేశారనే వాదనలు కూడా వినిపించాయి. ఇప్పుడు తాజాగా షకీల్ కొడుకు పాత్రపై అనుమానంతో మరోసారి జూబ్లీహిల్స్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో షకీల్ కొడుకును నిందితుడిగా చేర్చారు.

మిగతా.. 2లో

# ఎన్నికలు స్వేచ్ఛగా జరిగితే... బిజెపి ఔట్

**మొదటిపేజీ తరువాయి..**

ఏ ఆధారంతో 400కు పైగా సీట్లు గెలుస్తామని అంటున్నారు? వాళ్లు ఇంతకుముందు ఏదైనా చేసి ఉండాలి. లేదంటే 400 సీట్లు వస్తాయని ఎలా ఢంకా బజాయిస్తున్నారని ప్రశ్నించారు. ఈరోజు దేశంలో ఈవీఎంల ట్యాంపరింగ్ లేకుండా ఎన్నికలు జరిగితే బిజెపికి 180కు మించి సీట్లు రావని నేను ధీమాగా చెప్పగలను. నిజానికి 180 కంటే తక్కువ సీట్లే వాళ్లకు వస్తాయని ప్రియాంక గాంధీ అన్నారు. ప్రజలు మార్పుకోరు కుంటున్నారని, ఈతరహా రాజకీయాలను ఆశించడం లేదని ప్రియాంక గాంధీ అన్నారు. పదేళ్లుగా సామాన్య ప్రజానీకం, మహిళల జీవితాల్లో ఎలాంటి అభివృద్ధి లేదని, ఉద్యోగాలు లేవని, ధరలు కిందకు దిగడం లేదని అన్నారు. ఇది పండుగల సీజన్ అయినప్పటికీ, ఈరోజు రామనవమి చేసుకుంటున్న ప్పటికీ ప్రజలకు దగ్గర ఏది కొనాలన్నా డబ్బులు లేవన్నారు. ప్రధాని నిరుద్యోగం గురించి మాట్లాడరు. ద్రవ్యోల్బణం ఊసెత్తరు. ఆయన చుట్టూ ఉన్నవాళ్లు కూడా ఆయనకు ఈ విషయం చెప్పరు. ప్రజల నుంచి ఆయన దూరంగా జరిగారని ప్రియాంక వ్యాఖ్యానించారు. షహరాన్‌పూర్ ప్రజల నుంచి తమకు వస్తున్న అనూహ్య స్పందన దిగ్భ్రాంతిని కలిగిస్తోందని, ప్రజలకు అన్యాయం చేసిన బీజేపీకి ఉద్వాసన తప్పదని అన్నారు. షహరాన్‌పూర్ లోక్‌సభ నియోజకవర్గానికి ఈనెల 19న ఎన్నిక జరుగనుండగా, కాంగ్రెస్ అభ్యర్థిగా ఇమ్రాన్ మసూద్ ఇక్కడ పోటీ చేస్తున్నారు. బీజేపీ సిట్టింగ్ ఎంపీ రాఘవ్ లఖన్‌పూర్ తిరిగి ఆ పార్టీ టిక్కెట్‌పై బరిలో ఉన్నారు. ఇకపోతే కంగనా రనౌత్ వ్యాఖ్యలపై మాట్లాడేందుకు ప్రియాంక గాంధీ నిరాకరించారు. ఎవరో ఏదో మాట్లాడితే దానికి తాను స్పందించాల్సిన అవసరం లేదన్నారు. తమ గురించి కంగన మాట్లాడినందుకు ధన్యవాదాలు అని ప్రకటించారు. కంగన రనౌత్ వ్యాఖ్యలపై సమాధానం చెప్పాలని మీడియా ప్రతినిధులు అడగగా ప్రియాంక గాంధీ అసహనం వ్యక్తం చేశారు. అర్థం పర్థం లేని కామెంట్ల గురించి నేను మాట్లాడాలా అని ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఆరోపణలను కొన్నేళ్ల నుంచి ఎదుర్కొంటున్నామని ప్రియాంక వివరించారు. తన తండ్రి రాజీవ్ గాంధీ బతికి ఉన్న సమయంలో తన తల్లి సోనియా గాంధీ ఇలాంటి సమస్యలను ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. కంగన రనౌత్ హిమాచల్ ప్రదేశ్ మండి లోక్ సభ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. ఇటీవల జరిగిన ఓ ఇంటర్వ్యూలో గాంధీ కుటుంబం గురించి కంగన రనౌత్ స్పందించారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ రాజకీయాలకు సరిపోరని స్పష్టం చేశారు. తన స్వార్థం కోసం ఓ గొప్ప తల్లిని రాహుల్ గాంధీ ఇబ్బందికి గురిచేశాడు. సోనియా గాంధీకి ఇష్టం లేకున్నా సరే రాజకీయాల్లో కొనసాగుతున్నారు. రాజకీయాల్లో కంటిన్యూ అయ్యేందుకు సోనియా గాంధీని వేధిస్తున్నారు అని' కంగన రనౌత్ సంచలన ఆరోపణలు చేశారు.

# అయోధ్యలో అద్భుత ఘట్టం ఆవిష్కరణ

**మొదటిపేజీ తరువాయి..**

ఈ సమస్యను అధిగమించేందుకు గడియారంలో ముల్లులు తిరిగేందుకు ఉపయోగించే పరిజ్ఞానం తరహాలో గేర్ టీత్ మెకానిజం వినియోగించారు. సూర్యకాంతిని గ్రహించే పరికరం వద్దే మరో పరికరం ఉంచారు. ఇది కాంతిని గ్రహించే అద్దాన్ని 365 రోజులు స్వల్పంగా కదుపుతూ ఉంటుంది. మళ్లీ నవమి రోజు వారు అనుకున్న చోటుకు తీసుకొస్తుంది. అంతకుముందే ఏటా శ్రీరామనవమి వచ్చే కాలాన్ని సెకన్లతో సహా లెక్కలు వేశారు. ఈ లెక్కల సాయంతో సూర్యకిరణాలు ప్రసరింపజేసే పరికరాలు, వ్యవస్థను రూపొందించారు. ఈ వ్యవస్థ 19 ఏళ్లు నిరాటంకంగా పనిచేస్తుంది. ఆ తర్వాత మరోసారి సమయాన్ని సరిచేయాలని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇకపోతే శ్రీరామనవమి వేడుకలతో ఆధ్యాత్మిక శోభతో అయోధ్య పరవశించింది. రామ్ లల్లా సూర్య తిలకం కార్యక్రమానికి ముందు ఆలయ అర్చకులు బాల రాముడికి దివ్య అభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. రామనవమి సందర్భంగా తెల్లవారుజామునే ఆలయం తెలిచి భక్తులకు దర్శనానికి అనుమతి ఇచ్చారు. భక్తులు పోటెత్తడంతో అర్ధరాత్రి వరకు ఆలయం తెరిచే ఉంటుందని, మొత్తం 19 గంటల పాటు దర్శన ఏర్పాట్లు కల్పిస్తామని ఆలయ పూజారులు తెలిపారు. ఈ క్రమంలో తెల్లవారు జామున నిర్వహించిన అభిషేకం కార్యక్రమం వేద మంత్రోచ్ఛరణల నడుమ వైభవంగా జరిగింది. ఇందుకు సంబంధించిన చిత్రాలను ఆలయ అధికారులు ఎక్స్ లో పోస్ట్ చేశారు. మరోవైపు.. రామనవమి సందర్భంగా దేశ ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ఐదు శతాబ్దాల నిరీక్షణ ఫలించి రామ మందిరంలో బాల రాముడిని పూజించే భాగ్యం లభించిందని ప్రధాని చెప్పారు. ఈ శుభ సందర్భంలో నా హృదయం భావోద్వేగం, కృతజ్ఞతతో నిండిపోయాయన్నారు. ఈ ఏడాది నేనూ, లక్షలాది మంది నా దేశ ప్రజలు అయోధ్యలో రామ్ మందిరాన్ని దర్శించుకున్నాం. ఈ జ్ఞాపకాలు ఇప్పటికీ నాలో శక్తిని నింపుతాయి అని ప్రధాని ట్వీట్ చేశారు.

# అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణోత్సవం..

మొదటిపేజీ తరువాయి..

శాంతికుమారి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం తెల్లవారు జామునే ఆలయ ద్వారాలను తెరిచి అర్చకులు.. రామయ్యకు సుప్రభాత సేవ జరిపారు. అనంతరం తిరువారాధన, ఆరగింపు, మంగళ శాసనం, అభిషేకం ఆ తర్వాత ధ్రువమూర్తులకు కల్యాణం నిర్వహించారు. తర్వాత కల్యాణ మూర్తులను పల్లకీలో ఉంచి మంగళవాయిద్యాల మధ్య మిథిలా మైదానంలోని కల్యాణ మండపానికి వేంచేపు చేశారు.





రజత సింహాసనంపై సీతారామచంద్ర స్వాములను ఆసీనులను చేశారు. తిరువారాధన, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించి మండప శుద్ధి చేశారు. 'యుంజానహః ప్రథమం' అనే మంత్రాని పఠిస్తూ వేద పండితులు ప్రజా సంపతర్థ్యం 'శ్రీయం ఉద్వాః హిష్షే' అన్న సంకల్పంతో స్వామి వారికి ఎదురుగా సీతమ్మను కూర్చోబెట్టి కన్యావరణలు జరిపారు. మోక్షబంధం, ప్రతిసర బంధనం, ద్వితీయ సువర్ణ యజ్ఞోపవీత ధారణ గావించారు. వధూవరుల వంశ గోత్రాలకు సంబంధించి ప్రవరలు వినిపించారు. అనంతరం ఆశీర్వచనం, పాద ప్రక్షాళన, పుష్పోదక స్నానం జరిపి వరపూజ కార్యక్రం జరిపారు. కల్యాణం సందర్భంగా సంప్రదాయబద్ధంగా భక్తరామదాసు చేయించిన పచ్చల పతకం, చింతాకు పతకం, కలికితురాయి, రామమాడ తదితర ఆభరణాలను రామయ్యకు, సీతమ్మకు, లక్ష్మణ స్వామికి ధరింపజేశారు.

అర్చక స్వాములు స్వామి వారికి నూతన వస్త్రాలను అలంకరించారు. అభిజిత్ లగ్నం సమయంలో సీతారాముల ఉత్సవమూర్తుల శిరసుపై జీలకర్రబెల్లం ఉంచి.. అనంతరం భక్తరామదాసు చేయించిన మంగళ సూత్రాలతో సూత్రధారణ, తలంబ్రాల కార్యక్రమం నిర్వహించారు. కల్యాణ వేడుకలో వేలాది మంది భక్తులు వీక్షించి పరవశించి పోయారు. కల్యాణం జరిగిన మిథిలా మైదానంతో ఆలయ పరిసరాలన్నీ రామనామ స్మరణతో మార్మోగాయి. కల్యాణోత్సవంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహా, హైకోర్ట్ జడ్జి భీమపాక నగేష్ రామయ్య కల్యాణాన్ని వీక్షించారు. కల్యాణ వేడుక సందర్భంగా మిథిలా స్టేడియాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం పట్టాభిషేక కార్యక్రమం జరుగనున్నది. కళ్యాణోత్సవారికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దంపతులు, రెవెన్యూ శాఖ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దంపతులు, మంత్రి కొండా సురేఖ, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు దంపతులు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దంపతులు హాజరయ్యారు.

అలాగే సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.ఎస్. నర్సింహా, హైకోర్ట్ జడ్జి భీమపాక నగేష్ కళ్యాణంలో పాల్గొన్నారు. రామయ్య కళ్యాణాన్ని కనులారా వీక్షించేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. శ్రీరామనామస్మరణతో మిథులా స్టేడియం మారుమ్రోగింది. భక్తులంతా శ్రీరాముడి కళ్యాణాన్ని వీక్షిస్తూ పరవశించి పోయారు. సీతారామచంద్రుల కళ్యాణం కోసం మిథిలా కళ్యాణ మండపం లో 24 సెక్టార్స్ ఏర్పాటు చేశారు. 31 వేల మంది భక్తులు కళ్యాణం వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. అలాగే 1800 మంది పోలీసులు బందోబస్తు విధుల్లో ఉన్నారు. కాగా.. కళ్యాణోత్సవం సందర్భంగా మిథులా స్టేడియాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఈ వేడుక కోసం ఆలయాన్ని అందంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణం మొత్తం విద్యుత్ దీపాలతో కళకళ లాడుతోంది. గురువారం శ్రీ రామ పట్టాభిషేకం జరుగనుంది.ఎ

# మాదిగలకు అన్యాయం జరుగుతోంది..

**ఒక్క టిక్కెట్ అయినా ఇవ్వకపోతే ఎలా**

**మరోమారు గొంతు పెంచి మోత్కుపల్లి**

**హైదరాబాద్,ఏప్రిల్17(వెలుతురు):** లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మాదిగ సామాజికవర్గానికి టిక్కెట్ కేటాయించకపోవడంపై సీనియర్ నేత మోత్కుపల్లి నర్సింహులు ఆవేదన వ్యక్తం చేశారు. టికెట్ దక్కలేదని నాకు బాధ లేదు నా జాతికి అవమానం జరుగుతుందన్నారు. పెద్ద పెద్ద ఉపన్యాసాలు ఇవ్వడం కాదు ఎలాంటి న్యాయం జరుగుతుందో కనిపిస్తుందన్నారు. ఇది దళిత జాతికి అవమానమని.. సరి చేసుకోక పోతే మూల్యం తప్పదని హెచ్చరించారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలోనే ఉన్న మోత్కుపల్లి నర్సింహుపు.. తాను కాంగ్రెస్ లోనే ఉంటా పార్టీ మారే ఉదేశం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ లో మాదిగలకు అన్యాయం జరుగుతుంది.. మా జాతి హక్కు మాకు ఇవ్వటం లేదన్నారు. పార్టీలో అంటరాని వారీగా మమల్ని చూస్తున్నారని.. బీజేపీ, బిఆరెస్ రెండేసి టికెట్స్ ఇచ్చారు కాంగ్రెస్ పార్టీ ఎన్ని ఇచ్చిందని ప్రశ్నించారు. అటెండర్ పోస్టులు ఇచ్చి గొప్పగా చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. మందకృష్ణ మాదిగ మాట్లాడిన దాంట్లో తప్పు ఎం లేదన్నారు. మా పార్టీ కి నష్టం



జరగాలని నేను మాట్లాడటం లేదని.. గతం లో ఎంతో మంది ముఖ్యమంత్రులను చూసా .. ఎప్పుడు మాదిగలకు అన్యాయం జరగలేదన్నారు. కేసీఆర్ ని గద్దె దించిందే మాదిగలని.. 17నియోజకవర్గాల్లో పార్టీకి నష్టం జరుగుతుందన్నారు. కడియం శ్రీహరి ఏ కులామో ఆయనకె తెలీదని.. అయన ఓడిపోవడం పక్కా అని జోస్యం చెప్పారు. ఒక్కో కుటుంబలో ఇద్దరిదరికి టికెట్ ఇచ్చారు మాదిగ వాళ్లు ఎం పాపం చేశారని మోత్కుపల్లి ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలని కోరుకున్న వ్యక్తి ని తానని.. తన మాటకు రెస్పెక్ట్ లేదు .. ఇంతవరకు సీఎం అపాయింట్మెంట్ లేదన్నారు. జరగబోయే పరిణామాలకు రేవంత్ రెడ్డి దే బాధ్యతని స్పష్టం చేశారు. జితేందర్ రెడ్డి ఇంటికి పోయి రాత్రికి రాత్రికి పార్టీలో జాయినింగ్ వెంటనే పదవి ఇచ్చారని.. తా ము మాదిగ వలమనే కదా చిన్న చూపు అని ప్రశ్నించారు. మాదిగ వారు పార్లమెంట్ కి పోవొద్దా.. మేము మాట్లాడొద్దా అని మోత్కుపల్లి ప్రశ్నించారు. రాహుల్, సోనియా గాంధీ చెప్పేది ఒకటి ఇక్కడ జరిగేది ఒకటన్నారు.

సర్వేలు అన్ని బోగస్, ముఖ్యమంత్రి ఎవరికీ అనుకుంటే వారికీ టికెట్ వొస్తుందన్నారు. ఇప్పటికైనా తేరుకొకపోతే..పార్టీకి నష్టం కలుగుతుందన్నారు. రేపు ఇదే అంశం పై ఒక్క రోజు దిక్ష చేస్తున్నానని మోత్కుపల్లి ప్రకటించారు. మాదిగ సామాజికవర్గం అయిన కడియం శ్రీహరి కుమార్తెకు వరంగల్ టిక్కెట్ ఇచ్చారు. అయితే ఆయన ఉపకులానికి చెందిన వారు. అదే సమయంలో ఆయన బీఆర్ఎస్ నుంచి వచ్చి చేరగానే టిక్కెట్ కేటాయించడంతో కాంగ్రెస్ నేతల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

# ఈశాన్య రాష్ట్రాలను నిర్లక్ష్యం చేసిన కాంగ్రెస్

**వారు అధికారంలో ఉంటే ఫోన్ బిల్లుల 5వేలు ఉండేది**

**అగర్తల ప్రచారంలో ప్రధాని మోడీ**

**అగర్తల,ఏప్రిల్17(వెలుతురు):** లోక్‌సభ తొలి దశ ఎన్నికల ప్రచార గడువు ముగుస్తున్న వేళ కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ ఫైర్ అయ్యారు. త్రిపురలో బుధవారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మాట్లాడారు'ఈశాన్య రాష్ట్రాల్లో కాంగ్రెస్ లూట్ ఈస్ట్ పాలసీ అమలు చేసింది. మేం వచ్చి దానిని యాక్ట్ ఈస్ట్ పాలసీగా మార్చాం. కాంగ్రెస్ అధికారంలో ఉంటే త్రిపురలో సెల్‌ఫోన్ బిల్లు నెలకు ఒక్కొక్కరికి రూ.5వేల దాకా వచ్చేది. గతంలో ఇక్కడ మొబైల్ టవర్లు పనిచేసేవి కావు. ప్రస్తుతం మేమిక్కడ 5జీ కనెక్టివిటీ కోసం పనులు చేపట్టాం అని వివరించారు. మా ప్రభుత్వ చర్యల వల్ల ఇక్కడ మొబైల్ బిల్లు నెలకు రూ.500కు తగ్గింది. ఇదే కాంగ్రెస్ ఉంటే నెలకు



రూ.5వేల రూపాయల బిల్లు వచ్చేది. ఈశాన్య రాష్ట్రాలను అవినీతికి హబ్‌గా కాంగ్రెస్ మార్చింది. త్రిపుర భవిష్యత్తును కమ్యూనిస్టులు పూర్తిగా పాడు చేశారు'అని మోదీ మండిపడ్డారు. కాంగ్రెస్ అనుసరించే 'లూట్ ఈస్ట్ పాలసీ'లో లూట్.. దోపిడీ ఉందని సెటైర్లు వేశారు. తమది యాక్ట్ ఈస్ట్ పాలసీ అని, చెప్పింది చేస్తాం అని ప్రధాని మోదీ వివరించారు. గతంలో త్రిపురలో మొబైల్ టవర్స్ సరిగా పనిచేసేవి కాదని ప్రధాని మోదీ గుర్తుచేశారు. ఇప్పుడు రాష్ట్రంలో 5జీ నెట్ వర్క్ చక్కగా వస్తుందని వివరించారు. నాణ్యమైన నెట్ వర్క్ అందిస్తూ.. నెలకు మొబైల్ బిల్ అందుబాటులో అందజేస్తున్నామని తెలిపారు. ఎంత నెట్ వాడినప్పటికీ నెలకు రూ.400 నుంచి రూ.500 వరకు బిల్ వస్తుందని వివరించారు. ఇలాంటి ఉత్తమ నెట్ మీకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు ఛార్జీ చేసేదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఈశాన్య రాష్ట్రాలను అవినీతి మయం చేసిందని ప్రధాని మోదీ విరుచుకుపడ్డారు. ఈశాన్య రాష్ట్రాల ప్రయోజనాల కోసం కాంగ్రెస్ పార్టీ పాటు పడలేదని విమర్శించారు. తర్వాత కమ్యునిస్టులు మరింత నాశనం చేశారని మండిపడ్డారు. దేశంలో 3 కోట్ల నూతన గృహాలు నిర్మించబోతున్నామని పేర్కొన్నారు. త్రిపురలో పేద ప్రజలకు అందులో భాగస్వామ్యం ఉంటుందని హామీ ఇచ్చారు.

# రాష్ట్రంలో పెరుగనున్న ఉష్ణోగ్రతలు

**మొదటిపేజీ తరువాయి..**

పొడిగా ఉండే అవకాశం ఉంది. వేడి, తేమ, అసౌకర్యమైన వాతావరణం ఒకటి లేదా రెండు చోట్ల ఏర్పడవచ్చు. దక్షిణ కోస్తాంధ్రలో వాతావరణం పొడిగా ఉండే అవకాశం ఉంది. వేడి, తేమ, అసౌకర్యమైన వాతావరణం ఒకటి లేదా రెండు చోట్ల ఏర్పడే అవకాశం ఉంది. రాయలసీమలోనూ వాతావరణం పొడిగా ఉండే అవకాశం ఉంది. వేడి, తేమ, అసౌకర్యమైన వాతావరణం ఒకటి లేదా రెండు చోట్ల ఏర్పడే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. వడగాలులు రాయలసీమలో ఒకటి లేదా రెండు చోట్ల వీచే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. తెలంగాణలో రాగల మూడురోజుల్లో పలు చోట్ల వడగాలులు వీస్తాయని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. రెండు మూడు డిగ్రీల ఉష్ణోగ్రత పెరిగే అవకాశాలున్నాయని చెప్పింది. అదే సమయంలో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. 17న మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహమూబాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ వడగాలులు వీస్తాయని తెలిపింది. 18న ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో? 19న ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలో వడగాల్పులు వీస్తాయని చెప్పింది. 20న రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని తెలిపింది. మంచిర్యాల, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, వరంగల్, హన్మకొండ, సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడ వానలుపడుతాయని తెలిపింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

# జాబిల్లిపై కాలుపెట్టే వరకు ప్రయత్నాలు

**మొదటిపేజీ తరువాయి..**

పరిశోధనలు చేయాలి. తదుపరి మిషన్‌లో దీన్ని ప్రయత్నిస్తాం అని వెల్లడించారు.

భారత్ త్వరలో చేపట్టబోయే గగన్‌యాన్ గురించి సోమనాథ్ మాట్లాడారు. 'దీనికంటే ముందు ఈ ఏడాది ఓ మానవరహిత మిషన్‌ను చేపట్టనున్నాం. ఏప్రిల్ 24న ఎయిర్‌డ్రాప్ వ్యవస్థను పరీక్షించనున్నాం. ఆ తర్వాత వచ్చే ఏడాది మరో రెండు మానవరహిత యాత్రలను చేపట్టబోతున్నాం. అన్నీ అనుకూలిస్తే 2025 చివరికి గగన్‌యాన్ ప్రయోగం చేపడతాం అని పేర్కొన్నారు. గగన్‌యాన్ మిషన్ కోసం ఇప్పటికే నలుగురు వ్యోమగాములను ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. ఇటీవల ఈ ప్రాజెక్టులో ఇస్రో కీలక ముందడుగు వేసింది. మనుషులను సురక్షితంగా తీసుకెళ్లడానికి అనువైన అఇ20 క్రయోజనిక్ ఇంజిన్‌ను సిద్ధం చేసింది. ఈ ప్రయోగంతో వ్యోమగాములను 400 కిలోమీటర్ల ఎత్తులో భూకక్ష్యలోకి పంపుతారు. ఇందుకోసం ఎల్‌వీఎం-మార్క్3 రాకెట్‌ను ఉపయోగించనున్నారు. దాదాపు 3 రోజుల తర్వాత భూమికి తిరిగొస్తారు. తిరుగు ప్రయాణంలో వ్యోమనౌక సముద్ర జలాల్లో ల్యాండ్ అవుతుంది.

# నేటి నుంచి నామినేషన్లు

**మొదటిపేజీ తరువాయి..**

అదేరోజు నామినేషన్ల పక్రియ ప్రారంభం కానుంది. నామినేషన్లు దాఖలుకు తుది గడువు - ఏప్రిల్ 25. ÷ూమినేషన్ల పరిశీలన - ఏప్రిల్ 26, నామినేషన్ల ఉప సంహరణ - ఏప్రిల్ 29, ఎపీ, తెలంగాణలో ఎన్నికలు - మే 13న నిర్వహిస్తారు. తొలిదశలో ఏప్రిల్ 19న 21 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఎన్నికలు జరుగుతాయి. మొత్తం 102 లోక్ సభ స్థానాలకు పోలింగ్ జరుగనుంది. 2వ దశ ఎన్నికలు- ఏప్రిల్ 26న నిర్వహించనున్నారు. అభ్యర్థుల నామినేషన్ల గడువు ఏప్రిల్ 4తో ముగిసింది. రెండవ దశలో 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 89 స్థానాల్లో ఎన్నికలు జరుగుతాయి. ఫేజ్ 3 ఎన్నికలు- మే 7న పోలింగ్.. కాగా, అభ్యర్థుల నామినేషన్ల గడువు ఏప్రిల్ 19తో ముగియనుంది. మూడో దశలో భాగంగా 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 94 లోక్ సభ స్థానాలకు పోలింగ్ జరుగనుంది. 4వ దశ ఎన్నికలు- మే 13న ఓటింగ్ జరగనుండగా.. అభ్యర్థుల నామినేషన్ల తుది గడువు ఏప్రిల్ 25తో ముగియనుంది. నాల్గవ దశలో 10 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో 96 లోక్ సభ స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. 5వ దశ ఎన్నికలు- మే 20న పోలింగ్ నిర్వహించనుంది. మే 3 వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. ఐదవ దశలో 8 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 49 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ 6వ దశ ఎన్నికలు- మే 25న ఎన్నికలు ఉండగా.. మే 6తో అభ్యర్థుల నామినేషన్ల గడువు ముగియనుంది. ఆరవ దశలో 7 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 57 లోక్ సభ స్థానాలకు ఎన్నికలు ఉంటాయి.

7వ దశ ఎన్నికలు- జూన్ 1న పోలింగ్ జరగాల్సి ఉండగా.. అభ్యర్థుల నామినేషన్ల గడువు మే 14తో ముగియనుంది. ఏడవ దశలో 8 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 57 లోక్ సభ స్థానాలకు పోలింగ్ జరుగుతుంది. జూన్ నాలుగున కౌటింగ్ చేపట్టి ఫలితాలు ప్రకటిస్తారు.

# సిఎం రేవంత్‌పై అనుచిత వ్యాఖ్యలు

**మొదటిపేజీ తరువాయి..**

చేశారంటూ కేసీఆర్‌పై కాంగ్రెస్ నేత నిరంజన్ రెడ్డి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయగా కేసీఆర్‌కు ఈసీ నోటీసులు జారీ చేసింది. గతసారి కూడా అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రతిపక్ష పార్టీలపై కేసీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేశారని అప్పట్లో ఈసీకి ఫిర్యాదు చేశారు. దీంతో ఎలక్షన్ కమిషన్ సీరియస్ అయింది. కేసీఆర్, కేటీఆర్ కు కూడా నోటీసులు జారీ చేసింది. తాజాగా పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అనుచిత వ్యాఖ్యలతో అన్ని రాజకీయ పార్టీలు ముందుకు వెళుతుండడంతో ఈసీ సీరియస్‌గా ఉంది.

ఈ నేపథ్యంలో సిరిసిల్లలో కేసీఆర్ నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో కాంగ్రెస్, సీఎం రేవంత్ రెడ్డిపై కేసీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేశారు. గురువారం నుంచి నామినేషన్ల స్వీకరణ పక్రియ ప్రారంభం కానుంది. తెలంగాణలో 17 పార్లమెంట్ స్థానాలకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేయనుంది. అభ్యర్థులు దరఖాస్తు చేసుకోడానికి ఏప్రిల్ 25 వరకు అవకాశముంది. మే 13న పోలింగ్... జూన్ 4న ఫలితాలు వెలువడనున్నాయి. ఎన్నికల నిర్వహణ కోసం ఎలక్షన్ కమిషన్ అన్ని ఏర్పాట్లు చేసింది. కాగా షెడ్యూల్ విడుదల అయిన నాటి నుంచి పోలీసులు దాదాపు రూ. వంద కోట్లకు పైగా నగదు సీజ్ చేశారు. ఇప్పటికే 17 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ, బీఆరెస్ పార్టీలు ప్రకటించాయి. అధికారి పార్టీ కాంగ్రెస్ 14 చోట్ల అభ్యర్థులను ఖరారు చేసింది.

# రాజకీయంగా నన్ను వేధిస్తున్నారు

**మొదటిపేజీ తరువాయి..**

అయితే ఈ కేసులో తన కొడుకును అన్యాయంగా ఇరికించే ప్రయత్నం చేస్తున్నారంటూ బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ ఆరోపిస్తున్నారు. అసలు ఈ కేసులో తన కుమారుడి ప్రమేయమే లేదని చెప్పుకొచ్చారు. ఈ ప్రమాదంపై సీబీఐ లేదా.. సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కావాలనే వెస్ట్ జోన్ డీసీపీ విజయ్ కుమార్ కుట్ర చేస్తున్నారంటూ మాజీ ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు చేశారు. నా కుమారుడి తప్పు ఉంటే చట్టబద్ధంగా ఉరి తీసినా ఒప్పుకుంటా. జూబ్లీహిల్స్ కేసులో నా కుమారుడి ప్రమేయం లేదు. దీనిపై సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలి. కేసు ట్రయల్‌లో ఉంది. నాపై రాజకీయ కక్ష వుంటే నా కుమారుడిని ఇబ్బంది పెట్టడం ఎందుకు? నా కుమారుడు కారు బారికేడ్లకు తగిలితే నా కుమారుడిపై 21 సెక్షన్ల కేసులు పెట్టారు. కేసు పారదర్శకంగా విచారణ చేయాలని ముఖ్యమంత్రిని కోరుతున్నా. నా ఆరోగ్యం బాగాలేకపోయినా నాపై ఎఫ్.ఐ.ఆర్ చేశారు. నేను 25 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నాను. పది సంవత్సరాలు ఎమ్మెల్యేగా పని చేశాను. నా కుమారుడిని మానసికంగా ఇబ్బంది పెడుతున్నారు. నా కొడుకును చంపేస్తామని పోలీసులు బెదిరిస్తున్నారు. నా కుమారుడికి ఏమైనా హాని జరిగితే వెస్ట్ జోన్ డీసీపీ, పంజాగుట్ట ఏసీపీ, సీఐ, జూబ్లీహిల్స్ సీఐ బాధ్యత వహించాలి. నా కుమారుడు మానసిక ఒత్తిడికి గురి అయితే హాస్పిటల్‌లో చికిత్స తీకుంటున్నారు అంటూ షకీల్ వాపోయారు. రెండేళ్ల క్రితం జూబ్లీ హిల్స్ రోడ్ నంబర్ 45లో జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు నెలల చిన్నారి మృతి చెందాడు.

ఓ మహిళ తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. బెలూన్లు అమ్ముతూ రోడ్డు దాటుతున్న కాజోల్ చౌహాన్ అనే మహిళను కారు ఢీకొట్టగా.. ఈ ప్రమాదంలో కాజోల్ రెండు నెలల కొడుకు రన్వీర్ మృతి చెందాడు. కాజోల్ తీవ్రంగా గాయపడింది. ప్రమాదం జరగిన వెంటనే కారులోని ముగ్గురు వ్యక్తులు అక్కడి నుంచి పారిపోయారు. కారుపై స్టిక్కర్ ఆధారంగా అది ఎమ్మెల్యే షకీల్‌కు చెందినదిగా పోలీసులు గుర్తించారు. ప్రమాద సమయంలో కారులో ఎమ్మెల్యే షకీల్ కొడుకు రాహెల్, స్నేహితులు ఆఫ్నాన్, మాజ్ ఉన్నట్లు నిర్ధారించారు. అయితే కారు ఎవరు నడిపారనే దానిపై పోలీసులు అనేక రకాలుగా దర్యాప్తు చేపట్టినప్పటికీ స్పష్టత రాలేదు. చివరకు కారు తానే నడిపానంటూ ఆఫ్నాన్ అనే యువకుడు పోలీసులకు లొంగిపోయాడు. దాంతో కేసులో ఆఫ్నాన్‌ను నిందితుడిగా పేర్కొంటూ అరెస్ట్ చేశారు. ఈ మేరకు ఛార్జ్‌షీట్‌ను కూడా జూబ్లీహిల్స్ పోలీసులు దాఖలు చేశారు. అయితే తాజాగా షకీల్ కొడుకు పాత్రపై అనుమానంతో మరోసారి దర్యాప్తు చేపట్టారు. కారు ప్రమాదంలో ఇరుక్కోవడంతో అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన షకీల్ ఇప్పుడు ఓ వీడియో ద్వారా తన ఆవేదన వ్యక్తం చేశారు. ఆ వీడియోను ఆయన దుబాయ్ నుంచే చేసినట్లుగా తెలిసింది. తన కొడుకును జైల్లో పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుట్రలు పన్నుతున్నారని షకీల్ అన్నారు. పోలీసులు కూడా నా కొడుకును చంపేస్తామని అంటున్నారని ఆరోపించారు.

# గురుకుల విద్యార్థి కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వమే ఆదుకోవాలి

**బి ఎస్ పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రియదర్శిని మేడి**



**వెలుతురు న్యూస్, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై మృతి చెందిన ఆరో తరగతి చదువుకునే విద్యార్థి ప్రశాంత్ కుటుంబాన్ని రాష్ట్రప్రభుత్వమే అన్ని విధాలుగా ఆదుకోవాలని బి ఎస్ పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రియదర్శిని మేడి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇటీవల గురుకుల పాఠశాలలో తరచూ ఇలాంటి సంఘటనలు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతూనే ఉన్నాయని అన్నారు. ప్రభుత్వం దీనిపై దృష్టి సారించడం లేదని, ప్రభుత్వాధికారుల పర్యవేక్షణ లోపమే దీనికి కారణమని అన్నారు, మృతి చెందిన విద్యార్థి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలన్నారు.

# మధుయాష్కి గౌడ్‌కి మైనంపల్లి పరామర్శ

**ఎల్ బి నగర్ నియోజకవర్గం, వెలుతురు ఏప్రిల్ 17:**
మాతృవియోగం పొందిన టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కి గౌడ్ గారిని పలువురు ప్రముఖులు పరామర్శించారు. మాతృమూర్తి అనసూయ గారి చిత్రపటానికి నివాళులర్పించిన






నాయకులు.. మధుయాష్కి గౌడ్ గారికి, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు గారు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ సామ తిరుమలరెడ్డి పరామర్శించిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా మధుయాష్కి గౌడ్ గారి తాత నిర్మించిన వందేళ్ల నాటి పెంకుటిల్లుని, తాత నానమ్మల ఫోటోలను, చిన్నప్పుడు ఆ ఇంట్లోని జ్ఞాపకాలను మైనంపల్లి హనుమంతరావు గారికి వివరించారు.

# జ్యోతి నగర్‌లో కన్నుల పండుగగా సీతారాముల కళ్యాణ మహోత్సవం

**దర్శించుకున్న సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్**

**రామచంద్రాపురం వెలుతురు ఏప్రిల్ 17:**
శ్రీరామనవమి సందర్భంగా 112 డివిజన్ రామచంద్రాపురం పరిధిలోని జ్యోతి నగర్ కాలనీ లోని శ్రీ కోదండరామ స్వామి వారి దేవాలయంలో శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్





గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై సీతారాముల వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కాట సుధా గారు మాట్లాడుతూ పుణ్య దంపతులైన సీతా రాముల శుభాశీస్సులతో అందరి మనసులు ఎప్పుడూ మంచి ఆలోచనలతో ఉండాలని ఆశిస్తూ అందరికీ శ్రీ రామ నవమి శుభాకాంక్షలు తెలియజేశారు.

# వైభవంగా శ్రీరాములవారి కళ్యాణం

**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 17:** బుధవారం రోజున శ్రీరామనవమి సందర్భంగా హిమాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ డివిజన్లోని ముత్యాలభాగ్, జనార్ధన్ బాడ, దత్త నగర్, ఆదర్శ బస్తీ, విట్టల్ వాడి, రాజు మొల్లాహ్ మరియు ఇంద్రానగర్‌లో తిరిగి శ్రీరాములవారి కళ్యాణంలో పాల్గొని ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రామన్ గౌడ్, మరియు కాంగ్రెస్ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.





# కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సమక్షంలో బిజెపిలో చేరిన బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, ఆయన సోదరుడు ఆసిఫాబాద్ ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, బీఆర్ఎస్ ద్వితీయ శ్రేణి నాయకులు

**ఉమ్మడి ఆదిలాబాద్ వెలుతురు ఏప్రిల్ 17:**
ఉమ్మడి ఆదిలాబాద్ లోక్ సభ ఎన్నికలకు ముందే బీఆర్ఎస్ సీనియర్ నేతలు వరుస కట్టి వలస వెళ్తున్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, తాజాగా ఆసిఫాబాద్ జిల్లాలో తిరుగులేని నేతగా పేరున్న బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, ఆయన సోదరుడు ఆసిఫాబాద్ ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, బీఆర్ఎస్ ద్వితీయ శ్రేణి నాయకులు మూకుమ్మడిగా ఆ పార్టీని వదిలి బీజేపీలో చేరారు.

బీజేపీ ఎంపీ అభ్యర్థి గొడెం నగేష్ కు సన్నిహితుడైన అరిగెల నాగేశ్వరరావుతో పార్టీ నేతల మంతనాలు ఫలించాయి. మూడుసార్లు ఎంపీపీగా, రెండుసార్లు జెడ్పీటీసీగా, తెలుగు దేశం, బీఆర్ఎస్‌లో, క్రియాశీలక నాయకుడిగా ఒక పర్యాయం ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా పదవులు నిర్వర్తించిన అరిగెల నాగేశ్వరరావు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు ఎంపీ కే.లక్ష్మణ్ సమక్షంలో కమలం కండువా కప్పుకున్నారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అశోక్ ముస్తాపురే తదితరులున్నారు.

**మూడోసారి ప్రధానిగా మోడీ కావాలని.. పార్టీలో చేరా..**

దేశ ప్రధాని నరేంద్ర మోడీకి ప్రపంచంలోనే విశేష ఆదరణ ఉందని, మోడీ నాయకత్వంలో పనిచేయాలన్న లక్ష్యంతో



బీజేపీలో చేరినట్టు అరిగేలా నాగేశ్వరరావు ఆంధ్రప్రభ కు చెప్పారు. తన సన్నిహిత మిత్రుడు బీజేపీ అభ్యర్థి గొడం నగేష్ కు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొని గెలుపు కోసం పాటుపడతానని తెలిపారు.





# సీతారామచంద్రస్వామి పల్లకీ మోసిన బండి సంజయ్

**జై శ్రీరాం నినాదాలతో మారుమోగిన ఇల్లందకుంట**

**భక్తులతో ఆలయంలోనే గంటకుపైగా గడిపిన సంజయ్**

**ఇల్లందకుంట, వెలుతురు ఏప్రిల్ 17:**
బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ కొద్దిసేపటి క్రితం హుజూరాబాద్ నియోజకవర్గంలోని ఇల్లందకుంట సీతారామచంద్ర స్వామిని దర్శించుకున్నారు... బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్, జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి జె.సంగప్పలతో కలిసి ఇల్లందకుంట విచ్చేసిన బండి సంజయ్ కుమార్ కు బీజేపీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఈ సందర్భంగా ఆలయం వద్దకు వచ్చిన బండి సంజయ్‌కు ఆలయ సిబ్బంది స్వాగతం పలికారు. సీతా రామచంద్ర స్వామిని దర్శించుకున్న బండి సంజయ్ దాదాపు గంటకుపైగా భక్తులతో కలిసి ఆలయ ఆవరణలోనే గడిపారు. అనంతరం సీతారామచంద్రస్వామి ఊరేగింపు ప్రారంభమవడంతో భక్తులతో కలిసి శేష వాహన సేవలో పాల్గొని సీతాసమేత రామచంద్రస్వామి పల్లకీని బండి సంజయ్ స్వయంగా మోశారు. బండి సంజయ్ ఇల్లందకుంటలో ప్రవేశించింది మొదలు... తిరుగు పయనమయ్యేదాకా జై శ్రీరాం నినాదాలతో ఆ ప్రాంతమంతా మారుమోగిపోయింది.... రామలక్ష్మణ జానకీ.. జై భోలో హనుమాన్ కీ అంటూ రామభక్తులు, కాషాయ శ్రేణులు నినదిస్తూ శేషవాహన సేవలో తరించారు.

# బహుజన్ సమాజ్ పార్టీ సిద్దిపేట జిల్లా నూతన కమిటీ నియామకం

**సిద్దిపేట టౌన్, వెలుతురు ఏప్రిల్17:**
బహుజన్ సమాజ్ పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కటికల ఓం ప్రకాష్ ఆధ్వర్యంలో సిద్దిపేట లోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యదర్శి లింగంపల్లి యాదగిరి రాష్ట్ర కార్యదర్శి జక్కుల వెంకట్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా వారు సిద్దిపేట జిల్లా నూతన కమిటీ సభ్యులను జిల్లా అధ్యక్షు కటికల ఒం ప్రకాష్ ఆధ్వ ర్యంలో నూతనజిల్లా కమిటీ నాయకులను నియమించడం జరిగింది జిల్లా ఉపాధ్యక్షుడిగా ఈర్ల మల్లేష్ ముదిరాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా శంకర్ ఎనగందుల జిల్లా కోశాధికారిగా జింక సంజీవ్ జిల్లా సంఘటన మంత్రిగా కొండోనల్ల నరేష్, జిల్లా ఈసీ మెంబర్లు గా కథ మహేష్ మైల తిరుపతి జోడు ముంత నవీన్ ఆశని కనక ప్రసాద్ గార్లను నియమించడం జరిగింది రానున్న పార్లమెంటు ఎలక్షన్ లను గెలుపే లక్ష్యంగా ప్రతి



ఒక్కరు పని చేయాలని బహుజన సిద్ధాంతాన్ని ముందుకు తీసుకుపోతూ పూలే అంబేద్కర్ కాన్సిరాం గార్ల సిద్ధాంతాన్ని గ్రామ గ్రామీణ విస్తరించాలని ఈ సందర్భంగా వారు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో వివిధ అసెంబ్లీ మండల నాయకులు పాల్గొన్నారు. పుల్లూరు ఉమేశ్ రామనకర్ వినోద్ రాజు దేగల వెంకటేష్ తిరుపతి శ్రీనివాస్ నవీన్ శరత్ సాయి తేజ బాను మహేష్ బాను కిరణ్ లింగం స్థానిక నాయకులు పాల్గొన్నారు.





# శ్రీ కోదండ రామలయంలో నేత్రపర్వంగా సీతారాముల కళ్యాణం

**వేల సంఖ్యలో హాజరైన భక్తుల రామనామ స్మరణతో పులకించిన శ్రీ కోదండ రామాలయం.**

**శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవానికి పట్టు వస్త్రాలు సమర్పించిన కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్**

**కరీంనగర్ వెలుతురు ఏప్రిల్ 17:**
కరీంనగర్ పట్టణం తీగలగుట్టపల్లిలోని శ్రీ కోదండ రామాలయంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ వేడుక నేత్రపర్వంగా కొనసాగింది. దేవాలయంలో ఉదయం ప్రత్యేక పూజల అనంతరం వేద పండితుల ఆధ్వర్యంలో శ్రీ సీతా రాముల కళ్యాణ ఘట్టాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలిసి స్థానిక డివిజన్ కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్ శ్రీ సీతారామ స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తులకు ఈ సందర్భంగా తీర్థ, అన్న ప్రసాద వితరణ చేశారు. ఇట్టి కళ్యాణ మహోత్సవంలో దేవాలయ కమిటీ బాధ్యులు పాకాల రామ్ రెడ్డి, స్థానిక ప్రజలు, మహిళలు వేల సంఖ్యలో పాల్గొన్నారు.



# సంపాదకీయం..


**మతి భ్రమించిన మాటలు!**

కెసిఆర్‌తో పాటు ఆయన అనుయాయులు, అనుచరులు కూడా శాపనార్థాలకు అలవాటు పడ్డారు. గత పదేళ్లుగా రాజ్యం అనుభవించిన వారు ఇప్పుడు తట్టుకోలేక పోతున్నారు. అధికారం పోయిందన్న బాధలో ఏదేదో మాట్లాడుతున్నారు. అందుకే తెలంగాణ అంతా ఆగం అయిపోయిందన్న రీతిలో గగ్గోలు పెడుతు న్నారు. ఎపిలో జగన్ కూడా మేము లేకుంటే ఇక అంతే సంగతులని చెబుతున్నారు. అంటే వీరు మేము లేకుంటే రాష్ట్రాలు అతలాకుతలం అవుతాయని, అభివృద్ది ఆగిపోతుందని భావిస్తున్నారు. తెలంగాణ లో పదేళ్లుగా సాగు,తాగునీటికి ఢోకా లేకుండా చేశామని కెసిఆర్ అంటున్నారు. మరి ఈ మూడు నెలల్లోనే ఆ నీరంతా ఎక్కడికి పోయిందో కెసిఆర్ చెప్పాలి. కాళేశ్వరం అవినీతిపైనా, అక్రమ దుస్థితిపైనా నోరు విప్పడం లేదు. రైతుబంధు పేరుతో జరిగిన అక్రమాలపై నోరు మెదపని కెసిఆర్ రేవంత్‌పై దుమ్మెత్తి పోస్తున్నారు. బిల్డిపుట్ ప్రభుత్వం అంటూ విమర్శలు చేస్తున్నారు. తన అక్రమాలను కప్పిపుచ్చుకోవడానికే చేస్తున్న ఎత్తుగడలో భాగంగా విమర్శలను పదును పెట్టారని భావించాలి. ఎందుకంటే ప్రాజెక్టులు కట్టి ఉంటే నీళ్లు ఏమయ్యాయి. మిషన్ భగీరథ సక్రమంగా ఉంటే ఎందుకు ఈ మూడు నెలల్లోనే పథకం నిరుగారి పోయింది. అంటే పథకం పేరుతో చేసిన ప్రచారం అంతా ఉత్తిదే అని అర్థం చేసుకోవాలి. ఇంతకాలం అబద్దాలు ప్రచారం చేసి ప్రజలను నమ్మించారని అనుకోవాలి. కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ అంశాలపై రెండు మూడు రోజులలో టీవీలలో కూర్చుని మొత్తం చెబుతానని కెసిఆర్ మీడియాతో చెప్పారు. కానీ ప్రకటనలు చేసి..రోజులుగా గడిచిపోతున్నా..ఆయన టీవీల ముందుకు రాలేకపోయారు. లిక్కర్ కేసులో చివరికి కుమార్తె అరెస్టు గరించి కూడా ఒక్క మాట మాట్లాడటం లేదు. కవితను ఈడీ జైలుకు పంపి నెల రోజుల అయింది. ఈ లోపు సీబీఐ కూడా అరెస్టు చూపించింది. అయినా ఎన్నికల బహిరంగసభల్లో కేసీఆర్ రేవంత్ రెడ్డిని వ్యక్తిగతంగా టార్గెట్ చేసుకుంటున్నారు తప్ప నిజాలు వెల్లడించడం లేదు. రాజకీయ వ్యాఖ్యలతో ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నంలో రేవంత్ బీజేపీలో చేరబోతున్నారని ఓ రాయి విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోకి వచ్చాక అనేక విషయాలపై ఆరోపణలు వచ్చాయి. అన్నింటికి మించి ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం దద్దరిల్లుతోంది. ఇలా కేసీఆర్ ఇంకా అనేక కీలక విషయాలపై స్పందించడం లేదు. కూతురు కవిత అరెస్టుపై ఇంతవరకు స్పందించలేదు. తన కూతురు అరెస్టు అక్రమమని కాని సక్రమమని కాని కేసీయార్ ఇంతవరకు మాట్లాడకపోవటమే ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత కూతురును ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో ఈడీ, సీబీఐలు అరెస్టులు చేసినా సైలెంట్ గా ఉన్నారు. తెలంగాణ రాజకీయాలను కుదిపేస్తున్న టెలిఫోన్ ట్యాపింగ్ అంశంపై విచారిస్తున్న స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు ఇప్పటికే సుమారు పదిమంది పోలీసు అధికారులను అరెస్టుచేశారు. వీరంతా బీఆర్ఎస్ అధికారంలో ఉన్నపుడు ప్రత్యర్థుల ఫోన్లను ఎలా ట్యాపింగ్ చేసింది పూసగుచ్చినట్లు చెప్పినట్లు మీడియా లో ప్రచారం జరుగుతోంది. అరెస్టయిన పోలీసు అధికారులు చెప్పిన సమాచారం ప్రకారం ప్రభుత్వంలోని పెద్దతలకాయ ఆదేశాల ప్రకారమే ట్యాపింగ్ జరిగిందని వాంగ్మూలాలు ఇచ్చారని అంటున్నారు. ఇదే విషయమై మంత్రులు, అధికార కాంగ్రెస్ నేతలు, కేంద్రమంత్రి, బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి తదితరు లంతా ట్యాపింగ్ కు బాధ్యులుగా కేసీయార్, కేటీయార్, హరీష్ రావులపైనే ఆరోపణలు చేస్తున్నారు. టెలిఫోన్ ట్యాపింగ్ కు బాధ్యత వహించాల్సింది కేసీయారే అని అందరికీ తెలుసు. పైగా తమ హయాంలో ట్యాపింగ్ జరిగిందని స్వయంగా కేటీయారే అంగీకరించారు. కొడుకు ట్యాపింగ్ జరిగిందని అంగీకరించిన తర్వాత ట్యాపింగ్ జరగలేదని కేసీయార్ అనేందుకు లేకుండా పోయింది. ట్యాపింగ్ తో తనకు సంబంధం

లేదని తప్పించుకునేందుకూ లేదు. ఇవన్నీ పక్కన పెట్టి కొత్తగా పల్లవి అందుకున్నారు. ఇప్పుడు కేటీఆర్ తో పాటు కేసీఆర్ కూడా.. రేవంత్ రెడ్డి బీజేపీలోకి వెళ్తారని అంటున్నారు. ఇలాంటి వ్యాఖ్యలు చేయడం వల్ల రేవంత్ రెడ్డి మీద ప్రజల్లో అపనమ్మకం కలిగించడమా లేక తమకు ఎన్నికల్లో లబ్ది చేకూరుతుందని అనుకుంటున్నారా అన్నది అర్థం కావడం లేదు. రాష్ట్రాన్ని కుదిపివేస్తున్న కీలక అంశాలపై స్పందిం చకుండా రేవంత్ రెడ్డి బీజేపీలోకి వెళ్తారంటే.. బీఆర్ఎస్‌కు ప్రజలు ఓట్లు వేస్తారా అన్న ప్రశ్న కూడా సహజంగానే వస్తుంది. కేవలం రాజకీయ ప్రకటనలతో మభ్య పెట్టడం మానుకోవాలి. ఇప్పటికే ఎన్నికల నాటకంలో బిఆర్ఎస్ నేతలు భంగపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టడంతోపాటు ప్రజల అభిమానాన్ని చూరగొన్నట్లు ప్రకటించుకుంటున్నారు. ఇక అంతా బాగు చేశానని ప్రకటించిన సింగరేణి నిధులు కరిగిపోగా.. అప్పుల కోసం వేట మొదలుపెట్టింది. అప్పుల కోసం ఆర్థిక సంస్థల చుట్టూ తిరుగు తోంది. ప్రతి ఏటా భారీ లాభాలను ఆర్జిస్తున్నట్టు ప్రకటనలు చేస్తూనే అప్పుల కోసం అన్వేషించడం మేడిపండు చందంగా కనిపిస్తోంది. ఇచ్చిన హామీలను పక్కన పెట్టడం, ప్రజలను మభ్య పెట్టడం గత పదేళ్లలో కెసిఆర్ బాగా అలవాటు చేసుకున్నారు. ఉన్నది లేనట్లుగా ప్రచారంల చేయడంలో వీరు దిట్టలని తేలిపోయింది. నిజాం షుగర్స్ 9 ఏళ్లయినా తెరుచుకోలేదు. ఆజంజాహీ ముచ్చటేలేదు. ఆసియాలోనే అతి పెద్దదిగా గుర్తింపు పొందిన నిజాం షుగర్ ఫ్యాక్టరీ మూతపడి కార్మికులు రోడ్డుపాలయ్యారు. తాము అధికారంలోకి వస్తే వంద రోజుల్లోనే మూతపడిన ఈ ఫ్యాక్టరీని తెరిపిస్తామని 2014 ఎన్నికల సందర్భంగా కేసీఆర్ ప్రకటించారు. ఉమ్మడి వరంగల్‌లోని ఏపీ రేయాన్స్ ఫ్యాక్టరీ పరిస్థితి కూడా ఇంతే. తెలంగాణలో మూతపడిన పరిశ్రమల ఊసెత్తని కేసీఆర్ పదేళ్లుగా ప్రజలను మోసం చేశారు. నిజంగానే కెసిఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే తెలంగాణలో మూతపడ్డ పరిశ్రమలను తెరిపించే వారు.ఎన్నికల ముందు చేసే ప్రయత్నాలు ఎప్పటికైనా బెడిసి కొడతాయి. రాజకీయాలు చేయడం వేరు..ప్రజలకు సేవచేయడం వేరు..ప్రజలను నమ్మించి ఓట్లు కొనుగోలు చేయడం వేరు. ఈ ప్రక్రియలో ఎవరు ఎటువైపు అన్నది ప్రజలు గమనిస్తూనే ఉంటారు. అందువల్ల చిత్తశుద్ధితో చేసే ప్రయత్నాలను మాత్రమే ప్రజలు స్వాగతిస్తారు. ఎందుకంటే ఇప్పుడు కెసిఆర్, బిఆర్ఎస్ నేతలు రేవంత్ ప్రభుత్వం విషయంలో చేస్తున్న ఆరోపణలకు మూల్యం చెల్లించుకోక తప్పదు.

## రక్తం గడ్డకట్టకపోవడం కూడా ఓ రకం వ్యాధే

ఏటా ఏప్రిల్ 17న ప్రపంచ హిమోఫిలియా దినోత్సవ జరుపుకుంటారు. .హిమోఫిలియా వ్యాధి మరియు ఇతర రక్తస్రావ లోపాల గురించి ప్రజల్లో అవగాహన పెంచడం ప్రపంచ హిమోఫిలియా దినోత్సవం. ముఖ్య ఉద్దేశ్యం... ఏప్రిల్ 17 నే ఎందుకు వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ హిమోఫిలియా ను స్థాపించిన ఫ్రాంక్ ష్నాబెల్ ఏప్రిల్ 17 న జన్మించాడు.ఈయన జ్ఞాపకార్థం ఈయన పుట్టినరోజైన ఏప్రిల్ 17 ను ప్రపంచ హిమోఫిలియా దినోత్సవంగా ప్రతి సంవత్సరం నిర్వహిస్తుంది. హిమోఫిలియా అంటే.. మనిషికి గాయం అయినప్పుడు రక్తం కారుతుంది. అయితే, కొంతసేపటి తరువాత రక్తం గడ్డకట్టుతుంది. రక్తం గడ్డకట్టకుండా, రక్తం కారడాన్ని హిమోఫిలియా అంటారు.



హిమోఫిలియాను ప్రధానంగా రెండు రకాలుగా విభజించుకోవచ్చు. హిమోఫిలియా ఎ రకంలో ఫ్యాక్టర్ 8 లోపం, బి రకంలో ఫ్యాక్టర్ 9 లోపం కనబడుతుంది. దాదాపు 90శాతం మందిలో ఎ రకమే కనబడుతుంది. మరో 9 శాతం మందిలో బి రకం, మిగతా ఒక శాతం మందిలో ఫ్యాక్టర్ 11, 5 లోపం వంటి ఇతరత్రా రకాల హిమోఫిలియా కనబడుతుంది. 70 శాతం వంశపారంపర్యంగానూ, 30 శాతం ఆకస్మిక జన్యు మార్పిడి కారణంగా, పుట్టుకతో వచ్చే ఈ వ్యాధి వలన వ్యాధిగ్రస్తులు ఏటా పెరుగుతున్నారని సర్వేలు చెబుతున్నాయి.ఎక్కువ శాతం మగపిల్లలోనే ఈ వ్యాధి ఉంటుంది. ప్రతి పదివేల మందిలో ఒకరికి ఈ వ్యాధి ఉంటుంది. వ్యాధిని గుర్తించడం ఎలా.. రక్తం గడ్డకట్టకపోవడం ఈ వ్యాధి ప్రధాన లక్షణం.శరీరంలో గాయాలు అయినప్పుడు, ఏదైనా శస్త్ర చికిత్స జరిగినప్పుడు, ప్రమాదాలు జరిగినపుడు రక్తం గడ్డకట్టకుండా నిరంతరంగా రక్తం స్రవించడం, గాయాలు మానకపోవడం, ముక్కు నుండి రక్తం కారడం, చిగుళ్లు, మల, మూత్రం ద్వారా రక్తం స్రవించడం. సమస్య తీవ్రంగా ఉన్నవారిలో ఇంజెక్షన్ తీసుకున్న చోట పెద్దగా ఉబ్బటం, అక్కడక్కడా చర్మం నల్లగా కమిలినట్టు కనిపించటం వంటివీ వేధిస్తుంటాయి. కొందరికి ఎలాంటి కారణం లేకుండానే ఉన్నట్టుండి ఒంట్లోనూ రక్తస్రావం కావొచ్చు. ఇలా కండరాల్లోకి, కీళ్లలోకి రక్తస్రావం కావటం వల్ల తీవ్రమైన నొప్పి, వాపుతో పిల్లలు విలవిల్లాడిపోతారు. తరచుగా రక్తస్రావమైతే కీళ్లు పెద్దగా ఉబ్బి, ఆకారం మారిపోవచ్చు. ఈ అవకరం శాశ్వతంగానూ ఉండిపోతుంది. కాబట్టి దీనిపై అవగాహన కలిగి ఉండటం అవసరం. గాయం నుంచి స్రవిస్తున్న రక్తం ఎంతకీ గడ్డకట్టకపోతే, ఐసు గడ్డను గాయంపై పూసి, తక్షణమే వైద్యుడిని సంప్రదించాల్సి ఉంటుంది.

# కాంగ్రెస్‌లో హిందుత్వ ఎజెండా...

త్వరలో జరిగే కొన్ని రాష్ట్రాల ఎన్నికలతో పాటు, 2024లో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించాలంటే ఎఐసిసి అధ్యక్షుడు రాహుల్ గాంధీని హిందుత్వ అనుకూలవాదిగా సిద్దం చేయాలని కాంగ్రెస్ ప్లాన్ వేస్తోంది. మోడీని ఢీకొనాలంటే అధికశాంత ఉన్న హిందువుల ఓట్లు ఆకట్టుకోవాలి. అందుకే ఇటీవల హిందూ అనుకూల విషయాల్లో కొంత సానుకూలంగా వ్యవహరిస్తున్నారు. రాహుల్ హిందుత్వవాది అనిపించుకోవాలని పక్కాగా ప్లాన్ వేసినట్లు కాంగ్రెస్ నేతల ద్వారా వెల్లడవుతోంది. ఆలయాలకు వెళ్లడం, పూజలు చేయడం పెద్దపెద్ద బొట్లు పెట్టుకోవడం వంటివన్నీ అన్నా చెల్లెళ్లు చేస్తున్నారు. ఇటీవల ఫలితాలను బేరీజు వేసుకున్నాక కొంత హిందుత్వ విషయంలో రాహుల్ కూడా ఆలోచన చేస్తున్నట్లుగా క్షేత్రస్థాయికి సమాచారం చేరవేస్తున్నారు. బిజెపిని ఢీకొని అధికారంలోకి రావాలంటే జాతరల్లో ఓట్లను పట్టాలని చూస్తున్నారు. హిందుత్వ ఓట్లు నిజంగానే గంపగుత్తగా బిజెపికి పడివుంటే ఈ దేశంలో కాంగ్రెస్ అధికారంలో ఉండేది కాదు. కానీ ముస్లిం సంతుష్టీకరణపై మాత్రం హిందువుల్లో కాంగ్రెస్ పట్ల వ్యతిరేకత ఉంది. కాంగ్రెస్ హయాంలో అనేక సందర్భాల్లో ముస్లింల కోసం గీతదాటింది. ఎన్నికల సంవత్సరం ప్రారంభం కావడంతో నేపథ్యంలో బిజెపిని మించి హిందుత్వాన్ని ప్రదర్శించాలని కాంగ్రెస్‌లోని ఓ వర్గం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగానే రాహుల్‌ను మోడీని మించిన హిందుత్వవాదిగా తయారు చేయాలని చూస్తున్నారు. ఇదిసానుకూల ఫలితం ఇస్తుందా లేదా అన్నది చూడాలి. నిజానికి దేశానికి ఇప్పుడు ఏం కావాలి... మనం ఏం తప్పులు చేశాం... ఏం చేయలేకపోయాం... గతంలో పదేళ్లు ప్రజలు అధికారం కట్టబెడితే ఎందుకు దేశాన్ని సక్రమంగా పాలించలేక పోయాం అన్న ఆత్మపరిశీలనతో ముందుకు వెళితే తప్ప కాంగ్రెస్ మనుగడ సాధించడం కష్టం. కేవలం గుళ్లూగోపురాలు తిరిగితే ప్రజలు ఓట్లు వేస్తారనుకుంటే పొరపాటు. అలా అనుకుంటే దివంగత పివి నరసింహారావు హయాంలో అయోధ్యలో వివాదాస్పద మసీదు కూల్చివేత తరవాత కాంగ్రెస్ ఓటమి పాలయ్యింది. హిందువులు ఈ విషయంలో పివిని ఆదర్శంగా తీసుకుని, హిందువులకు అతనే ప్రతినిధి అని అనుకుని ఉంటే భారీ మెజార్టీతో మళ్లీ గెలిపించే వారు. కానీ అలా జరగలేదు. దేశంలో బీజేపీ క్రమక్రమంగా ఎదుగుతున్న వైనాన్ని మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు గమనించినందువల్లనే బాబ్రీ మసీదు కూల్చివేత సమయంలో ఉదాసీనతతో వ్యవహరించారని, ఆయన వల్లే మైనారిటీలు దూరం అయ్యారని కాంగ్రెస్‌లో ఒక వర్గం ఆనాడు భావించింది. అందుకే తరవాత పివిని దూరం పెడుతూ వచ్చారు. అర్జున్ సింగ్ వంటి నేతలు పి.వి. నరసింహారావు అనుసరించిన హిందూత్వ విధానాలపై లేఖాస్త్రాలు సంధించి ఇరుకున పెడుతూ



ఉండేవారు. మాధవరావు సింధియా, చిదంబరం తదితర నేతలు పివిని తక్కువ చేసి చూశారు. పి.వి. హయాంలో కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా ఉన్న గాడ్గిల్ కాంగ్రెస్ రోజురోజుకూ క్షీణించిపోవడానికి కారణం ముస్లింలను బుజ్జగించే ప్రయత్నాలు చేయడమేనని చెప్పేవారు.

సోనియా హాయంలో రెండు పర్యాయాలు అధికారం అనుభవించాక ఇంతగా దిగజారి పోవడం ఇదే ప్రథమం. అందుకే కొందరు రాహుల్‌ను హిందూ ప్రతినిధిగా ప్రజలు గుర్తించేలా చేయాలని తపాత్రయపడుతు న్నట్లుగా ఉంది. సోనియా స్వతహాగా క్రిష్టియన్ కావడం, విదేశీ వనిత కావడం వల్ల ఇంతకాలం ఆమె హిందుత్వను అంగీకరించి ఉండకపోయి ఉంటారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏం చేస్తుంది.. ఏం చేయలేక పోయాం అన్న సిద్దాంతాన్ని పక్కన పెట్టి ముందుకు వెళ్లడం అన్నది సైద్దాంతిక దిగజారుడు తనంగానే చూడాలి. 2014లో నరేంద్ర మోదీ హయాంలో బీజేపీ ప్రభంజనం వీచిన తర్వాత నుంచీ కాంగ్రెస్‌లో ఈ మేరకు అంతర్మథనం ప్రారంభమైనట్లు సంకేతాలు కనపడుతున్నాయి. అప్పటివరకూ మైనారిటీల మద్దతు పొందేందుకు ఎటువంటి చర్యకైనా పూనుకునే దిగ్విజయ్ సింగ్ వంటి కాంగ్రెస్ నేతల వల్ల తమకు నష్టమే కాని లాభం లేదని కాంగ్రెస్ అధిష్ఠానం భావించే స్థితికి చేరుకుంది. ఈ క్రమంలో ఇటీవల మేనిఫెస్టో కూడా ఆకర్శణీయంగా తయారు చేశారు.

# రైతుల్లో ఆశల జల్లులు

ఈ ఏడాది దేశంలో సాధారణం కన్నా మించి వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం, స్కైమెట్ ముందస్తు అంచనాలు రైతులకు ఆనందం కలిగించే శుభవార్త. ఈ దఫా కూడా ఎల్‌నినో (వర్షాభావ) పరిస్థితులే ఉంటాయనే వార్తల మధ్య వర్షాలు దండిగానే కురుస్తాయనే ఐఎండి అధికారిక ప్రకటన ఒక్క వ్యవసాయ రంగంలోనే కాకుండా దానికి అనుబంధంగా ఉన్న అన్ని రంగాలకు కూడా ఆనందకరమైన వార్తనే. అయితే గత ఖరీఫ్ సీజన్‌కు ముందు కూడా ఐఎండి సాధారణ వర్షపాతమే నమోదవుతుందనీ ముందస్తుగానే ప్రకటించినా ప్రస్తుత సీజన్‌లో 94 శాతం వరకే వర్షపాతం నమోదు కావడంతో రైతుల్లో ఇంకా వానలపై నమ్మకం కలగడం లేదు.

అభివృద్ధి చెందిన దేశాల మాదిరిగా మన దేశంలో కూడా వర్షాలు, వరదలు, ఎండలు, అతిశీతలం లాంటి వాతావరణ పరిస్థితులను ఖచ్చితంగా అంచనా వేసే ఆధునిక వ్యవస్థ ఇంకా ఇక్కడ ఏర్పాటు కాలేదు. అమెరికాలో రైతులే కాకుండా ప్రజలు కూడా అక్కడి వాతావరణ హెచ్చరికల గురించి అధికారిక వాతావరణ వ్యవస్థలపై ఎక్కువగా ఆధారపడతారు. అక్కడి అంచనాలు దాదాపుగా 99 శాతం ఖచ్చితంగా ఉంటాయి. ఆ స్థాయిలో మనకింకా వాతావరణ వ్యవస్థలు ఏర్పడలేదు. దీని కారణంగానే మన వాతావరణ అంచనాలపై పూర్తిగా విశ్వాస పరిస్థితి ఏర్పడలేదు. అయినా అనుకూల దృక్పథంతో మనకు వచ్చే సీజన్‌లో మంచి వర్షాలే కురుస్తాయని ఆశిద్దాం.

దానికి తగినట్లుగా వ్యవసాయ శాఖ ప్రణాళికలను సిద్ధం చేయాలి. ఒకవేళ వాతావరణం అనుకూలించకపోతే అందుకు తగినట్లుగా ప్రత్యామ్నాయ ప్రణాళికలతో యంత్రాంగం సిద్ధంగా ఉండాలి. ఇక ఐఎండి అంచనాలను పరిశీలిస్తే, సాధారణం అంటే జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య కాలంలో నైరుతి రుతుపవనాల కారణంగా సుదీర్ఘకాల సరాసరి వర్షపాతం 96 నుంచి 104 శాతం వరకు 868 మి.మీ వర్షం కురుస్తుందని ప్రామాణికంగా అర్థం చేసుకోవాలి. జాతీయ స్థూల ఉత్పత్తిలో



వ్యవసాయ వాటా 17.6 శాతమే. ఇది రకరకాల కారణాల వల్ల ప్రతియేటా తగ్గుతూ వస్తున్నది.ఇది ఆందోళనకర పరిణామమే. అయితే జాతీయ ఆదాయానికి వర్షాధార పంటభూముల నుంచి వచ్చే ఆదాయం 55 నుంచి 60 శాతం వరకు ఉంటుంది. దేశం సగానికి సగం సాగు భూముల్లో 141.4 మిలియన్ హెక్టార్ల భూములు నీటి పారుదల సౌకర్యం లేనివి.

కేవలం వర్షాధారంగానే సాగు అవుతుంటాయి. ఐదింట మూడొంతుల కంటే ఎక్కువ మంది రైతులు ఎలాంటి నీటిపారుదల సౌకర్యం లేక తమ భూములను వర్షాధారంగా పండించుకుంటున్న పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో వర్షాలు విస్తారంగా కురిసే అవకాశం రైతులకు శుభవార్త గానే పరిగణించక తప్పదు. అయితే ఈ ముందస్తు అంచనాలు ఎప్పుడూ కచ్చితంగా ఉండవు. గత ఏడాది ఐఎండి (భారత వాతావరణ విభాగం) సాధారణ వర్షపాతం ఉంటుందని ముందుగా తెలియజేసినప్పటికీ, సాధారణం కన్నా తక్కువ గానే సుదీర్ఘకాల సరాసరిలో 94 శాతం వరకే వర్షం కురిసింది. సాధారణం లేదా సాధారణం కన్నా మించి వర్షపాతం అన్న అంచనాలు ఆయా సీజన్‌లో మొత్తం వర్షపాతాన్ని సూచిస్తాయి తప్ప ప్రాదేశిక, తాత్కాలిక వర్షపాతం పరిస్థితిని చెప్పలేవు. అవి చాలా అసమానంగా కూడా ఉంటాయి.

ఎల్‌నినో, లానినో ప్రభావం ఆధారంగా ఐఎండి, స్కైమెట్ అంచనాలు వెలువడుతుంటాయి. ఎల్‌నినో వర్షాభావ పరిస్థితిని చెప్పగా, లానినో విపరీతంగా వర్షాలు కురిసే పరిస్థితిని చెబుతుంది. పసిఫిక్ మహాసముద్రంలోని మధ్య, తూర్పు ప్రాంతంలో సముద్ర ఉపరితలం వేడెక్కడంపై ఎల్‌నినో ప్రభావం అంచనా వేస్తారు. ఇది గత ఏడాదిలా నైరుతి రుతుపవనాలను బలహీనం చేయవచ్చు.ఈ ప్రభావంతో సీజన్ బలహీనంగానే ప్రారంభం కావచ్చునని స్కైమెట్ అంచనా. ఐఎండి కూడా ఇంచుమించు ఇదే విధంగా అంచనా వేసింది. అయితే ఈ రెండు సంస్థలు లానినో విషయంలో ఏకాభిప్రాయం వెలిబుచ్చాయి. పసిఫిక్ సముద్రం ఉపరితలం వేడి చల్లారి ఆగస్టులో నైరుతి పవనాలు బలం పుంజుకుంటాయని చెబుతున్నాయి. హిందూ మహాసముద్రం లోని ద్విధ్రువ పరిస్థితులు వర్షాగమనానికి అనుకూలంగా ఉంటాయని ఐఎండి సూచిస్తోంది.

పశ్చిమ హిందూ మహాసముద్ర ఉపరితలం వేడెక్కితే, తూర్పు హిందూ మహాసముద్ర ఉపరితలం చల్లగా ఉంటుందని చెబుతున్నారు. రెండవ అర్ధభాగ సీజన్‌లో మొదటిభాగం వాతావరణ పరిస్థితులు కన్నా మెరుగ్గా ఉంటుందని అంచనా. ఖరీఫ్ సీజన్ లేదా వేసవిలో జూన్, జులైలో వరి, చిరుధాన్యాలు, కాయధాన్యాలు, సోయాబీన్ వంటివి సాగు చేయడానికి కీలకమైన కాలం. వీటికి సాధారణ, సాధారణానికి మించి వర్షపాతం లభిస్తే చాలా మేలు జరుగుతుంది.

# మోడీ హయాంలో నిరుద్యోగ భారతం.!

గుమ్మడికాయల దొంగ అంటే భుజాలు తుడుము కోవడం బిజెపికి అలవాటుగా మారింది. సత్యాలను కూడా అంగీకరించలేని స్థితికి ఆ పార్టీ చేరింది. విలువలతో కూడాని రాజకీయాలు నెరిపే బిజెపికి ఇప్పుడు అసత్యాలు మాట్లడడమే అలవాటుగా చేసుకుంది. ఎందుకంటే విలువలు కలిగిన నేతలను పార్టీలో దూరంగా పెట్టారు. కనీసం వారికి మర్యాద ఇచ్చి మాట్లాడే స్థితిలో కూడా లేరు. అందుకే పార్టీలో అన్నీ అవలక్షణాలు చోటుచేసుకున్నాయి. కేవంల ఇద్దరి చేతుల్లోనే పార్టీ ఉంది. వారిద్దరే అన్ని నిర్ణయాలు తీసుకుంటున్నారు. కార్పోరేట్ల సలహాలతో వారు చెప్పిన రీతిలోనే పాలన సాగుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. తాము చెప్పిందే వేదం అన్న రీతిలో పార్టీని నడుపుతూ ప్రజల ఉసురు పోసు కుంటున్నారు. అన్నీ ఘనతలు సాధించామని, భారత్ ఉజ్వలంగా ఉందని గొప్పలకు పోతున్నారు. ఇలాంటి వారికి ఎదుటి వారు చెప్పే నిజాలు చేదుమాత్రగానే ఉంటుంది. దేశంలో నిరుద్యోగం 45 ఏళ్ల గరిష్ఠానికి చేరింది. సమస్యలపై గొంతుచించుకుని అరిచినా వినిపించుకునే స్థాయిని మోడీ దాటిపోయారు. నిరుద్యోగం పెరిగిందని, ఏటా రెండుకోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయని నిలదీస్తున్నా సమాధానం ఇచ్చే ధైర్యం మోడీకి లేదు. విపక్ష పార్టీలు నిజాలు అడిగినంతనే బిజెపి అగ్గిమీద గుగ్గిలం కావడం దాని అసహనాన్ని వెల్లడిస్తోంది. పదేళ్ల పదవీ కాలంలో నిరుద్యోగులను అగాధంలోకి నెట్టిన మోడీ బృందానికి సహజంగానే విమర్శలను జీర్ణించుకునే స్థాయి లేదు. ఉద్యోగ కల్పనలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విఫలమయ్యారని గణాంకాలే వెల్లడిస్తున్నా ఒప్పుకునే ధైర్యం చేయడం లేదు. దీనికితోడు ఉన్నప్రభుత్వరంగ సంస్థలను నిస్సిగ్గుగా అమ్ముతున్నా..గట్టిగా నిలదీసే నేతలు బిజెపిలో కూడా లేరు. అంతెందుకు పార్లమెంటులో ఏ సమస్యపైనా చర్చించే ధైర్యం కూడా మోడీ చేయడం లేదు. అసలు తమను పట్టించుకున్న పాపాన పోవడం లేదని అన్ని వర్గాలు వాదిస్తున్నా పట్టించుకోవడం లేదు. ఎన్నికల ముందు, పార్లమెంటు సమావేశాల సందర్భంగా నీతి వాక్యాలు చెప్పడంతప్ప సమస్యల కోణంలో చూడడం లేదు. కేంద్రంలో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఏయే రంగాల్లో ఎలాంటి సానుకూల మార్పులు తీసుకు వచ్చిందీ చెప్పడమే తప్ప క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసు కోవడం లేదు. రాష్ట్రాలకు ఒరగబెట్టిందీ ఏమీ లేకున్నా గణాంకాలతో వివరించేందుకు పదేపదే ప్రయత్నాలు చేయడంతప్ప మరేమీ లేదు. పెద్దనోట్ల రద్దు నిర్ణయం లక్షలాదిమంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలను దెబ్బతీసింది. చాయ్ అమ్మానని గొప్పల చెప్పే ప్రధాని మోడీ,గ్రామాల్లో చాయ్ అమ్మేవాళ్లకు కూడా కష్టకాలం తీసుకుని వచ్చారు. ఎంతోమంది ఆర్థిక వేత్తలు, ఆర్థిక నిపుణులు ప్రస్తుత విపరిణామాలను ఏకరువు పెట్టినా పట్టించుకోవడం లేదు. పలు స్వతంత్ర నివేదికలు ఇప్పటికే ఈ విషయాన్ని కుండబద్దలు కొట్టాయి. నిజానికి ఇది ప్రతి నిరుద్యోగి చేస్తున్న ఆక్రందన. దేశంలో ఉద్యోగాలు రావు. వస్తూత్పత్తి పెరిగినా అనుబంధ రంగాలు బలపడలేదు. వ్యవసాయం దివాళా తీసింది. పండించిన




పంటలకు మద్దతు ధరలు రావడం లేదు. వ్యవసాయానుబంధ పరిశ్రమలు పెట్టి నిరుద్యోగాన్ని రూపుమాపకుండా ఉపన్యాసాలతో కాలం వెళ్ల దీసారు. ఉద్యోగాలు కల్పిస్తానని, మేకిన్ ఇండియా అంటూ ఊదరగొట్టిన మోదీ వైఫల్యాన్ని కాలంగడుపుతున్నారు. దేశంలో నిరుద్యోగ సమస్య తీర్చే ప్రయత్నాలు జరిగివుంటే పరిస్థితి ఎందుకింత దారుణంగా ఉంటుంది. దీనికితోడు రూపాయి విలువ పడిపోతూ, ద్రవ్యోల్బణం పెరుగుతూ పోతుందే తప్ప అభివృద్ధి గణాంకాలు ముందుకు సాగడం లేదు. దేశవ్యాప్తంగా ఉపాధి అవకాశాలు ఎలా సన్నగిల్లాయో లెక్కలుచూస్తే తెలుస్తుంది. దేశంలోని పట్టణ ప్రాంతాల్లో 7.8శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 5.3శాతం చొప్పున నిరుద్యోగిత ఉందని, సగటున 6శాతం పైనేనని గణాంకాలు తెలుపు తున్నాయి. తీవ్రమైన ఉపాధి లేమి ఎన్నికల్లో మోదీ విజయావకాశాలను దెబ్బతీస్తుందన్నది చాలామంది అంచనాలు వేశారు. అయితే మోడీ మేనేజ్‌మెంట్‌తో ఎన్నికల్లో గెలవడంతో ఇక తమకు తిరుగులేదన్న ధోరణిలో ఉన్నారు. ఎన్నో అద్భుతాలను సాధించామని చెప్పుకున్నంత మాత్రాన ప్రజలు నమ్ముతారను కోవడం అవివేకం. నల్లధనాన్ని తవ్వితీయడమనే ప్రకటిత లక్ష్యాన్ని సాధించకపోగా, నలుపును తెల్లగా మార్చి, చక్కగా ఉన్న భారత ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసింది. అధికారంలోకి వచ్చేముందు కోట్లాది ఉద్యోగ ఉపాధి అవకాశాలు సృష్టిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తరువాత కొంతకాలం అవే మాటలతో మేకిన్ ఇండియా పాట కూడా పాడారు. ఆర్థిక వ్యవస్థ నాశనం చేసి ఇప్పుడు ఆత్మనిర్భర భారత్ జపం చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. గత 45 ఏళ్లలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి దాపురించలేదు. దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతున్నా అది అసమతుల్యంగా ఉండడం వల్ల తగినన్ని ఉద్యోగాల సృష్టి జరగక లక్షలాది మంది నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. గత 45 ఏళ్ళ కాలంలో ఎప్పుడూ లేనంత నిరుద్యోగం ఇప్పుడు ఉన్నదనీ, కోట్లాది ఉద్యోగాలు సృష్టిస్తామన్న మోదీ హామీ ఓ క్రూరమైన జోక్‌గా మిగిలిపోయిందని కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణల్లో నిజం ఉంది.



## వైభవంగా సీతారాముల వారి కళ్యాణ మహోత్సవం

**తుర్కయంజాల్, వెలుతురు:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరామ్ నగర్ కాలనీ రామాలయంలో వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణం మహోత్సవం కన్నుల పండుగగా నిర్వహించడం జరిగింది. శ్రీ సీతారాముల కళ్యాణం మహోత్సవం పట్టు వస్త్రాలు, తలంబ్రాలను పుర మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంగమ్మ శివకుమార్ సమర్పించడం జరిగింది.సీతారాముల కళ్యాణం మహోత్సవం తిలకించడానికి బచ్చిగళ్ళ రమేష్ , తాడిచెట్టు అశోక్ గౌడ్, సంజీవరెడ్డి, కాలనీ వాసులు, పెద్దలు, మహిళలు,యువకులు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సీతారాముల ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి : మహేందర్ నాయక్

**కూకట్‌పల్లి, వెలుతురు:** శ్రీచక్రిపురం శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంటేశ్వరస్వామివారి దేవాలయంలో శ్రీరామ నవమి పర్వదిన వేడుకలు బుధవారం అంగరంగ వైభవంగా జరిగాయి. అశేష భక్తజన సందోహం మధ్య దేవాలయ ప్రధాన అర్చకులు, సుప్రసిద్ధ పురోహితులు శ్రీహరి ఆచార్య మంత్రోచ్ఛారణల మధ్య శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని



కన్నుల పండువల నిర్వహించారు. దీనబంధునగర్ సొసైటీ అధ్యక్షులు, సీనియర్ జర్నలిస్ట్ మాలోతు మహేందర్ నాయక్, దివ్య దంపతులు స్వామివారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ సందర్భంగా మహేందర్ నాయక్ మాట్లాడుతూ, శ్రీరాముడి ఆశీస్సులు ఎల్లవేళలా ప్రజలందరిపై ఉండాలని, సీతారాముల కృపతో ప్రజలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకున్నట్లు చెప్పారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

## కూకట్‌పల్లి రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన వడ్డేపల్లి రాజేశ్వర్ రావు

**కూకట్‌పల్లి, వెలుతురు:** కూకట్‌పల్లి రామాలయంలో శ్రీరామనవమి సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు శ్రీరామనవమి



శుభాకాంక్షలు తెలిపారు. ఆ రాములోరి ఆశీస్సులు అందరిపై ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం ఆలయ పూజారులు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్, భాస్కర్ రావు, పీ దుర్గాప్రసాద్ రావు, ప్రశాంత్ రావు, చంద్రప్రకాశ్ రెడ్డి, టీం వీఆర్ఆర్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సీతారాముల కళ్యాణం మహోత్సవాలకు హాజరైన తూము వినయ్ కుమార్..

**కూకట్‌పల్లి, వెలుతురు:** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా పలు నియోజవర్గాలలో జరిగిన సీతారామ కళ్యాణ మహోత్సవాలకు హాజరైన తెలంగాణా కాంగ్రెస్ పార్టీ ఓబీసీ వర్కింగ్ చైర్మన్ తూము వినయ్ కుమార్, వారితోపాటు మేడ్చల్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం, మేడ్చల్ జిల్లా బీసీ సమాజ్ జర్నలిస్టు ఫోరం అధ్యక్షులు తెల్ల హరికృష్ణ తూము నిఖిల్, వివేక్, బాణాల వెంకట్, అవినాష్, పవన్ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఊరు ఊర వాడా వాడల శ్రీ సీతా రాముల కళ్యాణం అంగరంగ వైభవంగా జరుగుతుందన్నారు. సీతా




రాముల కళ్యాణం చూడటం వలన మనకు ఆరోగ్యం, సంపద, ఆయుష్షు పెరుగుతుంది, లోకం సుభిక్షంగా ఉంటుంది, పుణ్య దంపతులైన సీతా రాముల శుభాశీస్సులతో మనఅందరి మనసులు ఎల్లప్పుడు మంచి ఆలోచనలతో నిండాలని ఆశిస్తూ అందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు.

# రాముడి జీవితం అందరికి ఆదర్శప్రాయం

### - నియోజకవర్గ ఇంచార్జి బండి రమేష్

### రామాయణ గాధ కుటుంబ విలువలకి నేటి సమాజనికి స్ఫూర్తిదాయకం - టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం



**కూకట్‌పల్లి, వెలుతురు:** శ్రీరాముడి జీవితం అందరికి ఆదర్శప్రాయమని కూకట్ పల్లి నియోజకవర్గ ఇంచార్జి బండి రమేష్ అన్నారు. బుధవారం శ్రీరామనవమి సందర్భంగా కూకట్ పల్లి నియోజకవర్గం బాలాజినగర్ డివిజన్ సేవాలాల్ నగర్, కైతలపూర్ రాఘవేంద్ర నగర్ లోని శ్రీ ప్రసన్నంజనేయ స్వామి దేవాలయాలలో, అల్లాపూర్ డివిజన్ రామారావు నగర్, న్యూ రామారావు నగర్ శ్రీ వినాయక,శివపార్వతి, ప్రసన్నంజనేయ, నవగ్రహ నాగదేవత దేవాలయాలలో, బాలానగర్ డివిజన్ ఫిరోజ్ గూడా, బాలానగర్ లోని దుర్గా దేవి ఆలయం, చెరబండరాజు కానీలలో ఆంజనేయ స్వామి దేవాలయాలలో జరిగిన శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవానికి నియోజకవర్గ ఇంచార్జి బండి రమేష్, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం, మల్కాజ్ గిరి పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి కుమార్తె మనీషా రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ సామజిక విలువను తూచా తప్పకుండ ఆచరించి, ధర్మాన్ని విలువలను కాపాడేందుకు తన జీవితాన్నే త్యాగం చేసిన మహోన్నత ప్రజా పాలకుడు సీతరామచంద్రుడు అని అన్నారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ విలువలను ఆదర్శవంత కుటుంబ జీవనానికి రాములోరి జీవితం అద్దం పడుతుందని, హక్కుల కంటే బాధ్యత గొప్పదని రామతత్వం, కష్ట కాలంలో నడుస్తుంది సీతతత్వం, కుటుంబ బాధ్యత పంచుకుంటుంది లక్ష్మణతత్వం, ప్రతి అడుగులో మంచిని గ్రహించాలనే రామాయణ పరమార్థం అదే రామాయణం మనకు ఇచ్చే ఆదర్శ సందేశమని తెలిపారు. శ్రీరామ నవమి ప్రజలందరి జీవితాలలో ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలను నింపాలని, సకల జన లోక సంరక్షణమే శ్రీరామ నవమి పండుగ పరమార్థం అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళ ప్రధాన కార్యదర్శి పుష్ప రెడ్డి, బాలాజీ నగర్ డివిజన్ అధ్యక్షులు కృష్ణ రాజ్ పుత్, బాలానగర్ డివిజన్ అధ్యక్షులు మధు గౌడ్, అల్లాపూర్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహ యాదవ్, బి బ్లాక్ మహిళా అధ్యక్షురాలు రమాదేవి, మహిళా అధ్యక్షురాలు భారతమ్మ, కృష్ణ వేణి, రజిత, జోజమ్మ, రేష్మ, మణి, జ్యోతి, ప్రతాప్ రెడ్డి, సతీష్ రెడ్డి, శ్రీకాంత్ పటేల్, శివకుమార్ గౌడ్, గజానంద్ శేఖర్, మధు మోహన్, మహేందర్, భరత్, గోవింద్ గౌడ్, ప్రసన్న కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రంగారావు, గిరిధర్, ఎడ్ల మోహన్ రెడ్డి, శంకర్ నాయక్ మరియు ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఈటల రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం...

### - బిజెపి కన్వీనర్ గురు ప్రసాద్


**కూకట్‌పల్లి, వెలుతురు:** రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి భారతీయ జనతా పార్టీ అభ్యర్థి ఈటల రాజేందర్ ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని కేపిహెచ్బి కాలనీ డివిజన్ బిజెపి కన్వీనర్ గురు ప్రసాద్ అన్నారు. కేపిహెచ్బి కాలనీ డివిజన్ బిజెపి కన్వీనర్ గురు ప్రసాద్ నియమితులైన సందర్భంగా పలువురు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

ఈ సందర్భంగా గురు ప్రసాద్ కూకట్ పల్లి ఇన్చార్జి మాధవరం కాంతారావుకు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, మేడ్చల్ మల్కాజిగిరి అర్బన్ జిల్లా కోకన్వీనర్ పద్మయ్య, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు సూర్యప్రకాష్, పాపయ్య గౌడ్ కూకట్ పల్లి అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర రావుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డివిజన్లో ఉన్న సభ్యులందరికీ కలుపుకుని పార్లమెంటు అభ్యర్థి ఈటెల రాజేందర్ గెలుపుకు కృషి చేస్తామని తెలిపారు. మన దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి అధికారంలోకి రావాలని నరేంద్ర మోడీ మూడోసారి ప్రధానమంత్రి అవుతున్నారని దీమా వ్యక్తం చేశారు.

అందుకోసం ప్రజలు పార్టీల అతీతంగా ఈటెల రాజేందర్ ను మల్కాజిగిరి ఎంపీగా గెలిపించాలని ప్రజలను కోరారు.








## శ్రీరామనవమి సందర్భంగా పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసిన బండి రమేష్...

కూకట్‌పల్లి, వెలుతురు: కూకట్ పల్లి నియోజకవర్గంలో శ్రీరామనవమి ఉత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. ప్రముఖ ఆలయాలతో పాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికలపై రాములవారి కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు ఈ ఉత్సవాల్లో అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలు పొందారు . కూకట్ పల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ బండి రమేష్ కూకట్ పల్లి రామాలయంలో, వసంత నగర్, కెపిహెచ్బి కాలనీ రోడ్ నెంబర్ 2,బాలనగర్, బోయిన్పల్లి, హస్మత్ పేట్, బేగంపేట లలో జరిగిన శ్రీసీతారాముల కళ్యాణానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. వేద బ్రాహ్మణుల ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా భక్తులకు శ్రీరామనవమి ఉత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. భక్తులందరూ సుఖసంతోషాలతో పిల్ల పాపలతో ఆనందంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో సత్యం శ్రీరంగం, సతీష్ రెడ్డి, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, సునీత మహేందర్ రెడ్డి తనయ మనిషారెడ్డి ,పుష్ప రెడ్డి, సాధు ప్రతాప్ రెడ్డి, యాదగిరి, రాజేందర్, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామనవమి సందర్భంగా ప్రత్యేక పూజలో పాల్గొన్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్..

శేర్లింగంపల్లి, వెలుతురు: శ్రీరామ నవమి సందర్భగా ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డి అల్లుడు రాజేష్ రెడ్డి, మరియు వారి కుటుంబ సభ్యులతో కలిసి డివిజన్ పరిధిలోని శివమ్మా కాలనీ, దత్తత్రయ కాలనీ, ఆల్విన్ కాలనీ 1వ,ఫేస్, ఆల్విన్ కాలనీ 2వ ఫేస్, సాయి నగర్ ఈస్ట్, సాయి నగర్ వెస్ట్, హనుమాన్



నగర్, తులసి నగర్, ధరణి నగర్, చంద్రమ్మ కాలనీ, ఎన్టీఆర్ నగర్, శిల్ప బృందావనం కాలనీలలోని రామలయాలను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, గుడ్ల శ్రీనివాస్, పోశెట్టిగౌడ్, యాదగిరి, సంగమేష్, అగ్రవాసు, షౌకత్ అలీ మున్నా, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాములోడి.. కళ్యాణ మహోత్సవం

తుర్కయంజాల్, వెలుతురు: తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని పదో వార్డులో ఎల్లమ్మ గుడి ప్రాంతంలో శ్రీ సీతారాముల కళ్యాణం మహోత్సవం కన్నుల పండుగగా నిర్వహించడం జరిగింది. శ్రీ సీతారాముల కళ్యాణం మహోత్సవం పట్టు వస్త్రాలు, తలంబ్రాలను పుర మున్సిపాలిటీ పదో వార్డు కౌన్సిలర్ మేతరి



అనురాధ దర్శన్ కుటుంబ సభ్యులు అందించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ శ్రీరామచంద్రుడు ప్రతి ఒక్కరికి ఆదర్శ ప్రియుడని ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు రాజ్యాన్ని ఏ విధంగా ముందుకు నడిపించాలో నిరూపించిన వ్యక్తి శ్రీరాముడు అని, పట్టాభిషేకం జరిగిన మరుసటిరోజే తండ్రి మాట జవదాటకుండా 14 సంవత్సరాలు వనవాసం చేసిన పురుషోత్తముడని తమ్ముడిగా, భార్యగా ఏ విధంగా ఉండాలో మనమందరం రాముని ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. శ్రీ సీతారాముల కళ్యాణం మహోత్సవం తిలకించడానికి కాలనీ వాసులు, పెద్దలు, మహిళలు,యువకులు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## విజయం మనదే : గుర్రం మచ్చందర్

వెలుతురు నారాయణఖేడ్ ఏప్రిల్ 17: సంగారెడ్డి జిల్లా బీ- హీరాబాద్ పార్లమెంట్ కు ఆల్ ఇండియా ఫార్వార్డ్ , ఓటయ్యాలని అభ్యర్థించారు. బ్లాక్ పార్టీ తరపున పోటీ చేస్తున్న గుఱ్ఱపు మచ్చెందర్ ప్రచారంలో దూసుకెళ్తున్నారు. మంగళవారం అర్థరాత్రి వరకు కల్హేర్ మండలంలోని ఇందిరా నగర్, కృష్ణపూర్, నారాయణఖేడ్ మండలంలోని నమిలిమేట్, నర్సాపూరే?డ్ పట్టణం, నాగిలిగిద్దా మండలంలోని కరస్ గుత్తి, ఇరక్ పల్లి, దామరగిద్దా, నాగిలిగిద్దా మరియు మోర్గి గ్రామాలలో ప్రచారం నిర్వహించి సింహం గుర్తుకు గుర్తును ఓటు వేసి గెలిపిద్దాం అంటున్న కార్యకర్తలు.



## శ్రీ సీతారాముల వారి కళ్యాణ మహోత్సవ వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బీజేపీ అసెంబ్లీ ఇంఛార్జి రవికుమార్ యాదవ్

శేర్లింగంపల్లి, వెలుతురు: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని శేరిలింగంపల్లి నియోజకవర్గం లోని గచ్చిబౌలి డివిజన్, ఏం.ఐ.జి , కూకట్ పల్లి డివిజన్, ఆల్విన్ కాలనీ డివిజన్, హైదర్ నగర్ డివిజన్ ,మియాపూర్ డివిజన్, హాఫీజ్ పేట్ డివిజన్ ,మాదాపూర్ డివిజన్, కొండాపూర్ డివిజన్లలోని పలు కాలనీలలో అంగరంగ వైభవంగా నిర్వహించిన సీతారాముల కళ్యాణ మహోత్సవ వేడుకల్లో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, బీజేపీ అసెంబ్లీ ఇంఛార్జి రవికుమార్ యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలం గాణ రాష్ట్ర ప్రజలకు, శేరిలింగంపల్లి నియోజకవర్గం ప్రజలం దరికీ శ్రీ రామనవమి శుభాకాంక్షలు తెలిపారు. సామాజిక విలువను తు.చ. తప్పకుండా ఆచరించి, ధర్మాన్ని విలువలను కాపాడేందుకు తన జీవితాన్నే త్యాగం చేసిన మహోన్నత ప్రజా పాలకుడు సీతారామ చంద్రుడు అన్ని అన్నారు. విలువలు, ఆదర్శవంతమైన జీవనానికి రాముల వారి జీవితం అద్దం పడుతుందన్నారు. శ్రీరామనవమి ప్రజలందరి జీవితాల్లో ఆయురారోగ్యాలు, సుఖశాంతులు నింపాలని ఆకాంక్షించారు. రాముడు చూపించిన ధర్మమార్గం వైపు మనల్ని నడిపిస్తూ కుటుంబం, సమాజం, దేశం పట్ల మన కర్తవ్యాలను, బాధ్యతలను గుర్తు చేసే ఉత్సవమని పేర్కొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు



అన్నదానం చేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, భక్తులు, సీనియర్ నాయకులు, డివిజన్ నాయకులు, స్థానిక నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## పీర్జాదిగూడ కార్పొరేషన్‌లో వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణం

### వివిధ ఆలయాల కళ్యాణోత్సవంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

### ప్రత్యేక పూజలు నిర్వహించిన వజ్రేష్ యాదవ్, సుధీర్ రెడ్డి, సునీత మహేందర్ రెడ్డి, తుంగతుర్తి రవి

మేడిపల్లి, వెలుతురు: శ్రీరామనవమి సందర్భంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అన్ని దేవాలయాలలో "శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవం వాడవాడల అంగరంగ వైభవంగా కన్నుల పండుగగా జరిగింది. పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలో మేడిపల్లి హనుమాన్ టెంపుల్, విష్ణుపురి కాలనీ, పీర్జాదిగూడ సాయి బాబా టెంపుల్, పీర్జాదిగూడలోని 17వ వార్డు ఆర్ టీ సి కాలనీ, వెంకటసాయి నగర్, పీర్జాదిగూడ చెరువు కట్ట సాయి ఐశ్వర్య కాలనీ, బోడుప్పల్ ప్రాంతాలలో జరిగిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాలలో టిపిసిసి ఉపాధ్యక్షుడు మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి మల్కాజ్గిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి లతో కలిసి పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొని శ్రీ సీతారాముల కళ్యాణాన్ని తిలకించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ లోక రక్షకుడు శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణంలో పాల్గొనడం భావిస్తున్నానని, జగద్రక్షకుడు శ్రీరామచంద్రుడి ఆశీస్సులు తెలంగాణ ప్రజలపై బండిగా ఉండాలని సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని భగవంతుని ప్రార్థించానని తుంగతుర్తి రవి అన్నారు. ఈ సందర్భంగా శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించిన ఆలయ కమిటీలకు, పెద్దలకు ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు.

## అంతా రామమయం..

### శేర్లింగంపల్లిలో కన్నుల పండువగా సీతారాముల కల్యాణం..

### శ్రీ సీతారాముల ఆశీస్సులు ప్రజాలందరిపై ఉండాలి.. వి. జగదీశ్వర్ గౌడ్..

శేర్లింగంపల్లి, వెలుతురు: శ్రీ సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. రామ నామ జపంతో భక్తజనం భక్తి పారవశ్యంలో మునిగితేలారు. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని శేర్లింగంపల్లి నియోజకవర్గంలోని పలు దేవాలయాల్లో బుధవారం సీతారామ కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. కూకట్పల్లిలోని రామాలయం ప్రాంగణంలో జరిగిన శ్రీ సీతారాముల కల్యాణోత్సవంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావుతో కలిసి శేర్లింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్ పాల్గొని



ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర నగర్ ఆంజనేయ స్వామి ఆలయంలో, కొండాపూర్, మాదాపూర్ డివిజన్ పరిధిలోని మాదాపూర్, అరుణోదయ కాలనీ, శిల్పా పార్క్, గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని, నల్లగండ్ల హుడా లేఔట్, చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తిశ్రీ నగర్, మియాపూర్ డివిజన్ పరిధిలోని ప్రగతి ఎంక్లేవ్ కమ్యూనిటీ హాల్, అపర్ణ జెనిత్ గేటెడ్ కమ్యూనిటీ, లో జరిగిన సీతారామ కళ్యాణం లో చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు డాక్టర్ రంజిత్ రెడ్డి అల్లుడు రాజేష్ రెడ్డి తో కలిసి జగదీశ్వర్ గౌడ్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ శ్రీరాముడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరు కున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో నాయకులు ఏకాంత్ గౌడ్, భాశిపాక యాదగిరి, మూకన్న, మనేపల్లి సాంబశివరావు, భారతీ నగర్ డివిజన్ అధ్యక్షులు గిరిబాబు, డిసిసి ఉపాధ్యక్షులు బొల్లంపల్లి విజయ భాస్కర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ సురేష్ గౌడ్, నవీన్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, మనోజ్, రవికుమార్, రాంబాబు, నవీన్, హుడా లేఔట్ అధ్యక్షులు పురం విజయేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సీతారాముల కళ్యాణంలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు..

### ఆదర్శ పాలకుడు శ్రీరాముడు

కూకట్‌పల్లి, వెలుతురు: శ్రీరామ నవమి సందర్భంగా నియోజకవర్గంలో నిర్వహించిన సీతారాముల కల్యాణ మహోత్సవంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. కూకట్ పల్లి హౌసింగ్ బోర్డ్ కాలనీలోని రెండవ రోడ్డులో గల శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో జరిగిన సీతా రాముల కల్యాణ వైభవం కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ బండి రమేష్, కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి, మల్కాజ్ గిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కుమార్తె పట్నం మనిషా రెడ్డి లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ శ్రీరాముడు అన్ని వర్గాలకు ఆదర్శ ప్రాయుడని పరిపాలన అధ్యక్షతన శ్రీరాముని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవ కార్యక్రమంలో మల్కాజ్ గిరి ఎంపీ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డి కుమార్తె మనిషా రెడ్డి పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పుష్ప రెడ్డి, సత్యం శ్రీరంగం, సాదు ప్రతాపరెడ్డి, బాలాజీ నగర్ డివిజన్ అధ్యక్షులు కృష్ణ రాజ్ పుత్ ,శివ పటేల్ గౌడ్ ,శ్రీకాంత్ పటేల్ గౌడ్, రాము, ప్రసన్న కుమార్, అరవింద్ రెడ్డి ,మేకల మైఖేల్ రేష్మ, మనీ ,వాణి , పాల్గొన్నారు.






# వైభవంగా శ్రీరామనవమి వేడుకలు...

**పట్టు వస్త్రాలు సమర్పించిన మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి. ప్రజా ప్రతినిధులు..**

**మేడిపల్లి, వెలుతురు:** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయం ప్రాంగణంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవంలో మాజీ మంత్రివర్యులు, మేడ్చల్ శాసన సభ్యులు చామకూర మల్లారెడ్డి, మేయర్ జక్క వెంకట్ రెడ్డి,డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్,కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు,ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొని స్వాముల వారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించి స్వామివారి ఆశీర్వాదాలు స్వీకరించారు. అనంతరం భారతీ సీమెంట్ శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానం వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చెస్తా..

**తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ సంగారెడ్డి జిల్లా కార్యదర్శిగా నియమితులైన కె.జగదీశ్వర్ రెడ్డి**

**కార్యదర్శిగా నియమించడంతో నా బాధ్యతలు ఇంకా పెరిగాయి**

**కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లుతా**



**జహీరాబాద్, 17 ఏప్రిల్, వెలుతురు :** తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ సంగారెడ్డి జిల్లా కార్యదర్శిగా కె.జగదీశ్వర్ రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషిచేస్తానని పేర్కొన్నారు. నన్ను తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ సంగారెడ్డి జిల్లా కార్యదర్శిగా నియమించిన తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శివసేన రెడ్డి, తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, తెలంగాణ రాష్ట్ర ఫిలిం డెవలప్ మెంట్ సంస్థ కార్పొరేషన్ చైర్మన్ యన్.గిరిధర్ రెడ్డి, పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ సిద్ధం. ఉజ్వల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఎ.చంద్రశేఖర్, జహీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులకు, నా సోదరులు యువజన కాంగ్రెస్ నాయకులకు, ఎన్ ఎస్ యూ ఐ నాయకులకు ప్రత్యేక హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. నాపై భరోసాతో యువజన కాంగ్రెస్ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గా నియమించడంతో నాకు ఇంకా బాధ్యతలు పెరిగాయని, కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చెస్తానని తెలిపారు.




# కాంగ్రెస్ అభ్యర్ధి నీలం మధు గెలుపు ఖాయం

**కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజ్ యాదవ్ : చిన్నకోడూరులో ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు**

**సిద్దిపేట రూరల్, వెలుతురు ఏప్రిల్17:** కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధును భారీమెజారిటీతో గెలిపిస్తామని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజ్ యాదవ్ అన్నారు బుధవారం నాడు చిన్నకోడూరు మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు మీసం మహేందర్ అధ్వర్యంలో ముఖ్యకార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమనికి ముఖ్య అథితులలుగా సిద్దిపేట పార్లమెంట్ ఎన్నికల అబ్జార్వర్ తిరుమల్ రెడ్డి ఎస్సి సెల్ జిల్లా అధ్యక్షులు కొండపాక విజయ్ కుమార్ జిల్లా అధ్యక్షులు వర్ల్లకొండ రవీందర్లు పాల్గొన్నారు. ఈ సమావేశనికి మీసం నాగరాజ్ యాదవ్ అధ్యక్షత వహించి మాట్లాడుతు నీలం మధు అన్న ను భారీ మెజారిటీ తో గెలిపించే విధంగా ప్రతి కార్యకర్త సైనికునిల పని చేయాలన్నారు ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి పథకాన్ని కార్యకర్తలు ప్రతి ఓటర్కు వివరించాలన్నారు.

ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మీసం మహేందర్ యాదవ్ ఉప అధ్యక్షులు సందబోయిన పర్శరం సెక్రటరీ కోరిమి రాజు సోషల్ మీడియా కోర్డినేటర్ సామల సంతోష్ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఉడుత జయంత్ ఉప అధ్యక్షులు కాలువ జగన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గణేష్ ప్రధాన కార్యదర్శి బర్ల స్వామి యన్ఏస్ యుఐ మండల ప్రధాన కార్యదర్శి గుంజే రాజేందర్ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు నముండ్ల వినోద్ నాయకులు వేణు ప్రశాంత్ రెడ్డి గంగాపూర్ గ్రామ శాఖ అధ్యక్షులు దామోదర్ రెడ్డి పాణ్యల వెంకటరెడ్డి విఠలపూర్ గ్రామ అధ్యక్షులు బొల్లా బోయిన నాగరాజు రాజిరెడ్డి పుచ్చాకాయల వెంకట్ రెడ్డి అల్లీపూర్ గ్రామ అధ్యక్షులు మీసం రాజు ఉప అధ్యక్షులు మంకాళి యాదగిరి యూత్ అధ్యక్షులు లింగంపల్లి మహేష్ ఓగులాపూర్ గ్రామ అధ్యక్షులు తాళ్లపల్లి రాజు భాస్కర్ దేవురాయ చెంద్ర శేఖర్ నక్క రాజు చౌదరాం చందు సింగిరాల రాజన్న సద్గురు నారాయణ రెడ్డి రాములు ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు

## మృత్యువుతో పోరాడి తనువు చాలించిన

# భువనగిరి గురుకుల హాస్టల్ విద్యార్థి ప్రశాంత్

**ఈ సంఘటన జరిగి వారం రోజులు అవుతున్నా ప్రభుత్వ యంత్రాంగం స్పందన అంతంత మాత్రంగానే ఉన్నది.**

**వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు జోక్యం చేసుకొని ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని బాలల హక్కుల సంక్షేమ సంఘం డిమాండ్ చేస్తుంది.**

**భువనగిరి వెలుతురు ఏప్రిల్ 17:** యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ఎస్సీ గురుకుల పాఠశాల హాస్టల్లో ఫుడ్ పాయిజన్కు గురై 6వ తరగతి చదువుచున్న విద్యార్థి సీహెచ్ ప్రశాంత్(12) గత ఆరు రోజులుగా చికిత్స పొందుతూ మృతి చెందడం అత్యంత బాధాకరమైన విషయం అని బాలల హక్కుల సంక్షేమ సంఘం( బి హెచ్ ఎస్ ఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంజమూరి రఘునందన్ అన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలలో చదువుచున్న విద్యార్థులు ఇలా తరచుగా ఫుడ్ పాయిజన్ కు గురై అస్వస్థతకు గురి కావడం, ఒక్కోసారి మరణాలు సంభవించడం పట్ల ప్రభుత్వ యంత్రాంగం సిగ్గుతో తలదించుకోవాల్సిన విషయం అని వారు అన్నారు.

ఈ సంఘటన జరిగి వారం రోజులు అవుతున్నా ప్రభుత్వ యంత్రాంగం స్పందన అంతంత మాత్రంగానే ఉందనీ, వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు జోక్యం చేసుకొని ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని బాలల హక్కుల సంక్షేమ సంఘం డిమాండ్ చేస్తుంది.

ఈ నెల 11న రాత్రి హాస్టల్లో ఫుడ్పా యిజన్ కావడంతో ఇప్పటివరకు 27 మంది విద్యార్థులు అస్వస్థ తకు గురయ్యారు. మొదటగా 10 మందిని మెరుగైన చికిత్స కోసం భువనగిరి ఏరియా దవాఖానకు తరలించి ఆరుగురికి అక్కడే చికిత్స కొనసాగించారు. పరిస్థితి విషమించిన నలుగురు విద్యార్థుల్లో ఇద్దరిని ఉస్మానియా దవాఖానకు, మరో ఇద్దరిని హైదరాబాద్లోని మిరాకిల్ దవాఖానకు తరలించారు. మిరాకిల్ దవాఖానలో చికిత్స పొందుతున్న సీహెచ్ ప్రశాంత్ పరిస్థితి మరింత విషమంగా ఉండటంతో గత శనివారం బంజారాహిల్స్ లోని రెయిన్ బో దవాఖానకు తరలించారు. అప్పటి నుంచి అక్కడే వెంటిలేటర్ పై చికిత్స పొందుతూ మృత్యు వుతో పోరాడుతున్న ప్రశాంత్ ఆరోగ్యం మరింత క్షీణించడంతో మంగళవారం సాయంత్రం మృత్యువాతపడడం జరిగింది. మిగిలిన విద్యార్థులకు కూడా మెరుగైన చికిత్స అందించాలని బి హెచ్ ఎస్ ఎస్ డిమాండ్ చేస్తున్నది.



**సి హెచ్ ప్రశాంత్, 6వ తరగతి విద్యార్థి**
**సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల భువనగిరి**

ఐతే గమనించాల్సిన విషయం ఏమిటంటే.. భువనగిరి గురుకుల పాఠశాల లో జరిగిన సంఘటన తెలంగాణా రాష్ట్రం లో మొదటిదీ కాదు చివరిదీ కాదు. గత ప్రభుత్వ హయంలో జరిగిన ఇలాంటి సంఘటనలు ఈ ప్రభుత్వ పాలనలో కూడా కొనసాగడం బాధాకరమైన విషయం అని, పాలకులు మారినా పరిస్థితులు మారకపోవడం దారుణమైన విషయమని బాలల హక్కుల సంక్షేమ సంఘం విమర్శించింది. భువనగిరి గురుకుల పాఠశాల విద్యార్థి మృతి పట్ల సిఎం రేవంత్ రెడ్డి గారు వెంటనే స్పందించాలి. బాధ్యులైన అధికారుల పై కఠిన చర్యలు తీసుకోవాలి . ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని కోరుతూ విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలనీ బాలల హక్కుల సంక్షేమ సంఘం (బి హెచ్ ఎస్ ఎస్) డిమాండ్ చేస్తుంది.

నిన్న (మంగళ వారం) బాసర ట్రిపుల్ ఐటీ లో కూడా ఒక విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం జరిగింది. ఇలా వేర్వేరు కారణాలతో ఈ విద్యా సంవత్సరంలోనే ఆరుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవడం జరిగిందనీ బాలల హక్కుల సంక్షేమ సంఘం తెలిపింది.

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సంక్షేమ హాస్టళ్లలో అనుసరించాల్సిన ప్రమాణాలపై నిర్దిష్టమైన విధి విధానాలు రూపొందించాలని, అవి ఖచ్చితంగా అమలు అయ్యేలా తగిన పర్యవేక్షణా యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలనీ బాలల హక్కుల సంక్షేమ సంఘం డిమాండ్ చేస్తుంది.




# శ్రీరాముడి ఆశీస్సులతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలి.. శిరీష సత్తూర్..

**శేర్లింగంపల్లి, వెలుతురు:** శ్రీరామనవమి సందర్భంగా సీతా రాముల వారి కళ్యాణ ఉత్సవాల్లో అవని స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు, కాంగ్రెస్ మహిళా నాయకురాలు శిరీష సత్తూర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కూన సత్యం గౌడ్, శ్రీనివాస్ గౌడ్, ఆల్విన్ కాలనీ, హైదర్ నగర్ డివిజన్ లోని పలు రామాలయ ఆలయాల్లో శ్రీ సీతా రాముడిని దర్శించుకుని, శ్రీ సీతారాముల కల్యాణ వేడుకలలో పాల్గొన్నారు. అనంతరం అన్న ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరాముడి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మధు, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

# సీతారాముల కళ్యాణంలో పాల్గొన్న గాలి బాలాజీ..

**కూకట్పల్లి, వెలుతురు:** శ్రీరామనవమి సందర్భంగా కెపిహెచ్బి కాలనీలోని 2వ రోడ్ లోని శ్రీశ్రీశ్రీ వీరాంజనేయ స్వామి వారి ఆలయంలో సీతారాముల కళ్యాణం లో ప్రత్యేక ఆహ్వానితులుగా పీసీసీ కార్యదర్శి గాలి బాలాజీ, కంటెస్టెడ్ కార్పొరేటర్ గంధమురాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొప్పిశెట్టి



దినేష్ కుమార్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వనజ, సంధ్య, బచ్చుమల్లీ, పి ఆర్ నాయుడు, రాజేష్, సుబ్బు, తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా

# శ్రీ సీతారాముల కళ్యాణం...

**జైశ్రీరామ్ నామస్మరణంతో మారుమోగిన కూకట్పల్లి**

**ప్రత్యేక పూజలు చేసిన మాజీ మంత్రి కేటీఆర్,...**

**కూకట్పల్లి, వెలుతురు:**
శ్రీరామనవమి సందర్భంగా కూకట్ పల్లి రామాలయంలో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీలు నవీన్ కుమార్, శంబిపూర్ రాజు, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ దేవాలయ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ 439



ఏళ్ల చరిత్ర గల ఈ రామాలయాన్ని ఇంత అత్యద్భుతంగా గ్రామస్తులు సహకారంతో పునర్ నిర్మించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుని అభినందించారు. దేవాలయం బాగుంటే ఊరు బాగుంటుందని ఊరు బాగుంటే దేశం బాగుంటుందని భక్తి అన్న విత్తనం మానవత్వాన్ని పెంచుతుందని అందుకనే మన దేవాలయాల్ని కాపాడుకుని భావితరాలకి ఆదర్శంగా నిలవాలని అన్నారు.

# UPSC - 2023 ఫలితాల్లో విజయం సాధించిన తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు అభినందనలు తెలిపిన యుగంధర్

**ఖమ్మం వెలుతురు న్యూస్:**
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఈసారి 50 మందికి పైగా సివిల్స్ కు ఎంపిక కావడం గర్వించదగ్గ విషయమని జాతీయ స్థాయిలో మూడవ ర్యాంకు సాధించిన పాలమూరుకు చెందిన దోనూరి అనన్య రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపిన యువ నాయకుడు డాక్టర్ తుమ్మల యుగంధర్






## జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గుర్రపు మచ్చేందర్

**వెలుతురు నారాయణఖేడ్ ఏప్రిల్ 17 :**
సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం కల్లేరు మండలం మరిడి గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా వారి స్వగ్రామంలో రామ మందిరంలోని శ్రీ సీతారాముల కళ్యాణం లో పాల్గొని శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుర్రపు సుశీలా అంజయ్య, నాగిరెడ్డి, ఉప్పరి తుకారాం, సాయిలు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామగ్రామాన బిజెపి ఇంటింటి ప్రచారం

**వెలుతురు, నారాయణఖేడ్ ఏప్రిల్ 17 :**
మెదక్ జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం శంకరంపేట మండలంలో గ్రామ గ్రామాన మండల బిజెపి అధ్యక్షుడు కోణం విట్టల్ ఆధ్వర్యంలో మండల బిజెపి నాయకులు బుధవారం ఇంటింటికి





తిరుగుతూ జహీరాబాద్ బిజెపి పార్లమెంట్ అభ్యర్థిని గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో భారతదేశం అన్ని రంగాలు లో అభివృద్ధి చెందిందని .. మూడోసారి ఆశీర్వదించి ఎంపిక బిబి పాటిల్ ను గెలిపించాలని కార్యకర్తలు నాయకులు ఇంటింటికి తిరుగుతూ వివరిస్తున్నారు.. ఈ కార్యక్రమంలో మండల బిజెపి నాయకులు శ్రవణ్ కుమార్ మంగలి కృష్ణ శ్రీహరి.. సురేందర్ రెడ్డి విట్టల్ గంగారెడ్డి సురేష్ విజయ్ కుమార్ బొగడాలకృష్ణ ఆయా గ్రామాల్లో బిజెపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తక్కువేమి మనకు రాముండొక్కడుండు వరకూ...!

- నేత్రపర్వం నీలమేఘశ్యాముని కల్యాణోత్సవం
- పట్టు వస్త్రాలను బహుకరించిన మంత్రి పొంగులేటి, మాధురి దంపతులు
- పాల్గొన్న సోదరుడు పొంగులేటి ప్రసాద్ రెడ్డి, శ్రీలక్ష్మి దంపతులు

**భద్రాచలం వెలుతురు ఏప్రిల్ 17:**
అందరి బంధువు... ఆదుకునే ప్రభువు... భద్రాచల రామయ్య కల్యాణ మహోత్సవాన్ని అభిజిత్ లగ్నంలో కనుల పండువగా నిర్వహించారు. నేత్రపర్వంగా సాగిన ఈ తంతులో తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, మాధురి దంపతులు హాజరై నీలమేఘశ్యాముని కల్యాణోత్సవానికి పట్టు వస్త్రాలను బహుకరించారు. మంగళ వాయిద్యాలు... వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ జరిగిన సీతారాముల కల్యాణ వేడుకను లక్షలాది మంది భక్తులు తిలకించి పులకించారు. ఈ కల్యాణ క్రతువును మంత్రి సోదరుడు పొంగులేటి ప్రసాద్ రెడ్డి, శ్రీలక్ష్మి దంపతులు కూడా హాజరై వీక్షించారు.



## మన్నెగూడెం గ్రామ ప్రజలకు శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపిన BRS నాయకులు

**చిన్నగూడూర్ వెలుతురు న్యూస్:**
చిన్నగూడూర్ మండలంలోని మన్నెగూడెం గ్రామంలో శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణం స్థానిక ఆంజనేయ స్వామి దేవస్థానంలో ప్రత్యేక ప్రసారాల ద్వారా వీక్షించి రామ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలియచేసిన గ్రామ BRS నాయకులు కురాకుల కృష్ణ బొమ్మకంటి నాగమల్లేష్ కుర్రె సోమన్న బొమ్మకంటి కిరణ్ బొడ్డుపల్లి శ్రీను బొమ్మకంటి శ్రీను తదితరులు



## చిన్న జీయర్ స్వామి వారిని దర్శించుకున్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి,ఎంపీ సంజయ్ కుమార్

**వెలుతురు కరీంనగర్ ఏప్రిల్ 17:**
సీతారామచంద్ర స్వామి చిత్రపటం, ఫలం అందించి ఆశీస్సులు అందించిన చిన్న జీయర్ స్వామి.

హిందూ బంధువులందరికీ శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపిన బండి సంజయ్.

ప్రతి గ్రామంలో శ్రీరామ నవమి పండుగ అంగరంగ వైభవంగా జరుపుకోవడం సంతోషం గా వుంది.

శతాబ్దాల చిరకాల కల అయోధ్య రామ మందిరం నిర్మాణం జరిగిన వేళ ఇంటింటా అయోధ్య అక్షింతలు అందుకున్న శుభ తరుణాన శ్రీరామ నవమి పండుగ జరుపుకోవడం ఆనందంగా వుంది.

ఈ సందర్భంగా కరీంనగర్ లో సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న చిన్న జీయర్ స్వామి వారిని దర్శించుకుని ఆశీర్వచనం అందుకోవడం ఆనందంగా వుంది.

ధర్మ రక్షణ కోసం చేస్తున్న మహా క్రతువులో నేనూ పాల్గొనడం సంతోషంగా వుంది.



## సీతారాముల కల్యాణం కమనీయం ..

**నంగునూర్ మండలం, వెలుతురు ఏప్రిల్17:**
శ్రీరామ నవమి సందర్భంగా నంగునూర్ మండలం కేంద్రంలో తోకల బండపై శ్రీ సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు భారీగా తరలివచ్చిన భక్తుల సాక్షిగా అర్చకులు సీతారాముల కల్యాణం జరిపించారు శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. భారీగా తరలివచ్చిన భక్తుల సాక్షిగా అర్చకులు సీతారాముల కల్యాణం జరిపించారు ఏర్పాటు చేసిన కల్యాణ మండపాల్లో సీతారాముల విగ్రహాలను అందంగా ముస్తాబు చేసి రాములవారితో సీత మెడలో తాళి కట్టించారు. ఈ కమనీయమైన వేడుకను చూసి భక్తులు తరించిపోయారు
వేదమంత్రోచ్చారణలు మృదుమధుర మంగళవాయిద్యాల నడుమ (స్వామి అమ్మవార్లను) సీతారామ లక్ష్మణ సహిత హనుమ విగ్రహాలను ప్రత్యేకంగా
సర్వా భరనాలతో అందముగా అలంకరించి కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చి ఆశీనులను చేశారు. తొలుత అర్చకులు విశ్వక్సేన పుణ్యాహవాచనం కంకణధారణ యజ్ఞోపవీతం జిలకర్ర బెల్లం మాంగల్యధారణ తలంబ్రాలప్రక్రియలను శాస్త్రోక్తముగా వైభవోపేతంగా నిర్వహించారు. భక్తులు పాల్గొని



పూజలు నిర్వహించి స్వామి అమ్మవారిని దర్శించుకుని తరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మేన్ కోల రమేష్ గౌడ్ భక్తులు తదితరులున్నారు.

## దానవాయిగూడెంలో శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న S.V. గౌడ్

**ఖమ్మం, వెలుతురు న్యూస్ :**
ఖమ్మం రూరల్ మండలం దానవాయిగూడెంలో వంద సంవత్సరాల క్రితం వేంచేసియున్న శ్రీ వీరాంజనేయ పురాతన దేవాలయంకు తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సంపెట వెంకటేశ్వర్లు గౌడ్ 100 గజాలు తన సొంత స్థలం దానం చేసి సొంత ఖర్చులతో మరియు కొంతమంది దాతల సహకారంతో గుడి నిర్మాణం చేసిన దానధర్మ ప్రధాత సంపెట వెంకటేశ్వర్లు గౌడ్.

శ్రీ వీరాంజనేయస్వామి వారి గుడిలో శ్రీరామనవమి కళ్యాణంలో కుటుంబ సమేతంగా పాల్గొని భక్తులందరికి అన్నదానం చేసిన సంపెట వెంకటేశ్వర్లు గౌడ్ వారి సతీమణి శ్రీమతి శ్రీదేవి, వారి పిల్లలు గోపి, దుర్గా (అమ్ము) నరేష్ తదితరులు సీతారామచంద్రస్వామి వారి కళ్యాణంలో పాల్గొని పూజలు నిర్వహించారు.

సంపెట వెంకటేశ్వర్లు గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానం కార్యక్రమంలో భారీగా భక్తులు పాల్గొని పూజలు



నిర్వహిం చారు. తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సంపెట వెంకటేశ్వర్లు గౌడ్ గారు రాష్ట్ర ప్రజలందరికీ పవిత్రమైన శ్రీరామనవమి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

వారు భక్తులనుద్దేశించి మాట్లాడుతూ..ఈ పండుగను ప్రగాఢమైన భక్తితో దేశవ్యాప్తంగా జరుపుకుంటారని ప్రేమ సామరస్యానికి ప్రతీకగా ఈ పర్వదినం నిలుస్తోందని శ్రీరాముడి ఆదర్శప్రాయ జీవితం నుంచి స్ఫూర్తి పొందుదామని రాష్ట్రమంతా పాడి పంటలతో సుభిక్షంగా వెలుగొందేలా అందరూ ఆనందంతో జీవించేలా సీతారాముల కరుణాకటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని సంపెట వెంకటేశ్వర్లు గౌడ్ కొనియాడారు, ఈ శ్రీ సీతారాముల కళ్యాణం మహోత్సవం కార్యక్రమంలో తెలంగాణ ప్రైవేట్ జూనియర్ లెక్చరర్స్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పరసా రమేష్ గౌడ్ కుటుంబ సభ్యులు, భారీగా భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు.


## భక్తి శ్రద్దలతో అంగరంగ వైభవంగా శ్రీ సీతారామచంద్రుల కళ్యాణం

**వెలుతురు న్యూస్ నారాయణపూర్:**
శ్రీరామనవమి పర్వదినాన నారాయణపురం మండల కేంద్రంలో శ్రీ సీతారామచంద్రుల కళ్యాణం అట్టహాసంగా అంగరంగ వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య స్వామివారి కళ్యాణం నిర్వహించారు. హాజరైన అశేష జనానికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా కమిటీ సభ్యులు జాగ్రత్తలు తీసుకున్నారు.బ్రహ్మోత్సవాల్లో భాగంగా గత రెండు రోజులుగా భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్న ప్రజలతో బుధవారం ఉదయం నుండే ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. రామనామ స్మరణతో నారాయణపురం చౌరస్తా మార్మోగిపోయింది. వేద పండితులు శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో భక్తులకు శ్రీరాముని ప్రాశస్తితను గురించి చెప్పడం జరిగింది. అనంతరం వేదమంత్రోచ్చారణల మధ్య శ్రీరాముల వారి కళ్యాణం నిర్వహించారు. ఈ కళ్యాణానికి ముఖ్య అతిథులుగా మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి లక్ష్మి దంపతులు, భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ సతీమణి కర్నే స్వాతి, మునుగోడు కాంగ్రెస్ నాయకులు నారబోయిన రవి ముదిరాజ్ హాజరై కళ్యాణాన్ని తిలకించారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తుల కోసం ఆలయ కమిటీ సభ్యులు మంచినీటికోసం ప్రత్యేక ఏర్పాటు చేశారు.



భక్తి శ్రద్దలతో రాములవారి కళ్యాణన్ని తిలకించారు భక్తులు. అనంతరం అన్నప్రాసద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామాలయం కమిటీ చైర్మన్ వడ్డేపల్లి రాములు,స్థానిక ఎస్సై జగన్,గ్రామ పంచాయితీ కార్యదర్శి నరేష్,కమిటీ సభ్యులు

మోగుదాల సత్తయ్య గౌడ్, ఓంకార్, తెలంగాణ భిక్షం, రసాల యాదయ్య, రమేష్, మందుగుల బాలకృష్ణ,ఉప్పల



లింగస్వామి,ఏపూరి సతీష్, జక్కిడి చంద్రారెడ్డి, పాలకూర్ల సతీష్, సికిలమెట్ల ప్రభాకర్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## నేత్రపర్వంగా కొండంరాజుపల్లీలో సీతారాముల కల్యాణం


**నంగునూర్ మండలం, వెలుతురు ఏప్రిల్17:**
శ్రీరామ నవమి సందర్భంగా సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం కొండంరాజుపల్లీ గ్రామంలో బుధవారం సీతారాముల కల్యాణం నేత్రపర్వంగా సాగింది కల్యాణం

అంగరంగ వైభవంగా జరిగింది. భారీగా తరలివచ్చిన భక్తుల సాక్షిగా అర్చకులు సీతారాముల కల్యాణం జరిపించారు కల్యాణ మండపాల్లో సీతారాముల విగ్రహాలను అందంగా ముస్తాబు చేసి రాములవారితో సీత మెడలో తాళి కట్టించారు. ఈ కమనీయమైన వేడుకను చూసి భక్తు లు తరించిపోయారు గ్రామస్తులు అందరూ హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శ్రీ సీతా రాములు కల్యాణ మహోత్సవం లో పాల్గొని ఈ ఏట పాడిపంట పశువు దినదిన అభివృద్ధి చెందాలని ఆ సీతారామచంద్ర స్వామివారిని దర్శించుకోవడం జరిగింది కళ్యాణ మహోత్సవము కథనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించిన గ్రామ భక్తులు ఈ కార్యక్రమంలో ఆంజనేయ స్వామి భక్తులు ఆలయ కమిటీ సభ్యులు గ్రామ భక్తులు తదితులున్నారు.







# లోకాభిరామ అయోధ్య రామ పట్టాభిరామ దీవెనలతో ప్రజలకు శుభం జరగాలి

**మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు**


**శ్రీరాముని దీవెనతో అనింటా శుభం జరగాలి.**

**ప్రజలంతా సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలి.**

**సిద్దిపేట రూరల్, వెలుతురు ఏప్రిల్17:**
శ్రీరామ నవమి పర్వదినం సందర్బంగా సిద్దిపేట పట్టణం లో పలు ఆలయాల్లో జరిగే శ్రీ సీతా రామ చంద్రస్వామి కళ్యాణోత్సవం లో పాల్గొన్న మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు మాట్లాడుతూ లోకరక్షకుడు సుపరిపాలనా దక్షకుడ ధర్మనిరతుడు అయిన శ్రీరాముడు అంటే సర్వ జగద్రక్ష అని శ్రీ రామ నామామృతం సకల పాపాలను హరించి వేస్తుందని భక్తుల ప్రగాఢ నమ్మకం ఉందని అన్నారు. రాష్ట్ర ప్రజలపైన సీతారామచంద్ర స్వామి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆ భగవంతుడిని కోరుకున్నట్లు తెలిపారు వర్షాలు సకాలంలో పడి రైతన్న ఇంట సిరులు పండాలని మనస్ఫూర్తిగా కోరుకుంన్నట్లు తేలిపారు.

# మధుర నగర్ కాలనీలో అంగరంగ వైభవంగా జరిగిన సీతారాముల కళ్యాణ మహొూత్సవంలో పాల్గొన్న కనకాల శ్యామ్ కురుమ

**మన్సూరాబాద్ వెలుతురు ఏప్రిల్ 17:**
బుధవారం రోజున ఎల్ బి నగర్ లో మన్సూరాబాద్ డివిజన్ లోని మధుర నగర్ కాలనీ లో అంగరంగ వైభవం గా జరిగిన సీతా రాముల కళ్యాణ మహొూత్సవంలో మధురా నగర్ కాలనీ కమిటీ ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథి గా బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల



శ్యామ్ కురుమ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది..ఆ తర్వాత కాలనీ మొత్తం పల్లకిలో సీత రాముల వారినీ ఊరేగించడం జరిగింది...ఈ కళ్యాణ మహొూత్సవంలో కాలనీ అధ్యక్షులు ఆర్ కే భూపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కుమారస్వామి ముదిరాజ్, ట్రెజరర్ రామలింగం కురుమ, ఉపాధ్యక్షులు సంతోష్ కుమార్ గుప్తా, వెంకటేష్, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.




# మధుయాష్కి గౌడ్‌కి పలువురి పరామర్శ

**ఎల్ బి నగర్ వెలుతురు ఏప్రిల్ 17:**
మాతృవియోగం పొందిన టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కి గౌడ్ గారిని పలువురు ప్రముఖులు పరామర్శించారు. మాతృమూర్తి అనసూయ గారి చిత్రపటానికి నివాళులర్పించిన నాయకులు.. మధుయాష్కి గౌడ్ గారికి, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, రాష్ట్ర మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు,




మల్కాజిగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి, యువజన కాంగ్రెస్ తెలంగాణ ఇంచార్జ్ సురభి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేన రెడ్డి, ప్రధాన కార్యదర్శి జక్కిడి శివ చరణ్ రెడ్డి, సామ మహేశ్వర రెడ్డి తదితరులు మధు యాష్కి గౌడ్ గారిని పరామర్శించిన వారిలో ఉన్నారు.

# హాట్సాఫ్ పోలీసు మానవత్వాన్ని చాటిన సిద్దిపేట టూ టౌన్ ఏఎస్ఐ ఉమారెడ్డి

**- సిద్దిపేట టూ టౌన్ ఏఎస్ఐ ఉమారెడ్డి ధైర్య సాహసాలు మెచ్చుకొని అభినందించిన స్తానికులు**

**సిద్దిపేట రూరల్, వెలుతురు ఏప్రిల్17:**
బుధవారం మధ్యానం 2.00 గంటలకు సిద్దిపేట రేణుక నగర్ కాలనీ ప్రక్కన ఉన్న వ్యవసాయక్షేత్రాల్లో ఉన్న బావిలోతు 10-15 గజాల నీటిలో బుడగజంగలు కులానికి చెందిన పర్వతం కనకయ్య వయస్సు 30 సంవత్సరములు గల వ్యక్తి ప్రమాదవ శాత్తూ కాలు జారి పడి చనిపోయాడని సమాచారం తెలవగా సిద్దిపేట టూ టౌన్ ఏఎస్ఐ ఉమారెడ్డి యూనిఫాంలో అక్కడికి వెళ్లగా మృతదేహాన్ని తీయడానికి సిద్దిపేట గజ ఈతగాళ్లను పిలిపించగా వాళ్లు 20 వేల రూపాయలు ఇస్తే మృతదేహాన్ని బయటకు తీస్తాము లేదంటే మాతో కాదు అని అనగా మృతుని కుటుంబ సభ్యులు కడు పేదవారు వారు అంత డబ్బు మేము ఇవ్వలేము ఐదువేల రూపాయలు ఇస్తామని అనగా గజ ఈతగాళ్లు ఒప్పుకోలేదు వారిని ఎంత బతిమిలాడినా మేము శవాన్ని తీయమని వెళ్ళిపోయినారు దిక్కులేని పరిస్థితిలో ఏమి చేయాలని కుటుంబ సభ్యులు ఆలోచిస్తుండగా ఏఎస్ఐ ఉమారెడ్డి వెంటనే యూనిఫామ్ విప్పేసి ఒక్కడే బావిలోకి దిగి ఒక గంట సేపు మృతదేహాన్ని వెతికి బయటకు బయటకు తీయడం జరిగింది బావి దగ్గరికి వచ్చిన ప్రజలు బంధువులు





ఏఎస్ఐ ఉమారెడ్డి ధైర్య సాహసాలు మెచ్చుకొని అభినందించారు.





# శ్రీ వెంకటేశ్వర కాలనీలో ఘనంగా శ్రీ సీతారాముల కల్యాణం

**తిమ్మాపూర్ వెలుతురు ఏప్రిల్ 17:**
తిమ్మాపూర్ మండలం అలుగునూరు పరిధిలోని శ్రీ వెంకటేశ్వర కాలనీలో గల శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి, శ్రీ రామ సాయి దేవాలయంలో.శ్రీ సీతారాముల కళ్యాణ మహొూత్సవ వేడుకలు కన్నుల పండుగల జరిగాయి.వేద పండితులు శ్రీ తిరునగరి వెంకటాద్రి స్వామి, చక్రధర స్వామి ల కల్యాణ మంత్రో చ్ఛవాల నడుమ శ్రీ సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీ సీతారాముల కళ్యాణ ఉత్సవ విగ్రహాల తో కాలనీ లో ప్రధాన వీధుల మీదు గా శోభ యాత్రా జరిగింది.భక్తులకు తీర్థ ప్రసాదాల ను అందించారు. ఇట్టి వేడుకల్లో దేవాలయ కమిటీ అధ్యక్షులు చిందం నరసయ్య, సిరిపురం శ్రీనివాస్, గడప శేఖర్ , సల్ల రాజయ్య, మల్లేశం , ఐతమ్ వెంకన్న ,బూట్లా కర్ణకర్, రాజేందర్, సుధాకర్ రెడ్డి, మృతుంజయం , రాజి రెడ్డి, చిందమ్ అంజి , కాలనీ ప్రజలు ,మహిళలు పాల్గొన్నారు.

# ఎన్నికల వేళ కెసిఆర్ కొత్త డ్రామాలు

**దళితబంధు..అంబేడ్కర్ విగ్రహం**

**మరోమారు కన్నీరు కారుస్తున్న కెసిఆర్**

**హైదరాబాద్,ఏప్రిల్17(వెలుతురు):**
గతేడాది అంబేడ్కర్ జయంతి సందర్భంగా 125 అడుగుల విగ్రహాన్ని కెసిఆర్ అట్టహాసంగా ఆవిష్కరించారు. ఇప్పుడా విగ్రహం వద్దకు ఎవరూ వెళ్లి నివాళి అర్పించలేదని కెసిఆర్ ఆగ్రహంవ్యక్తం చేశారు. మొన్నీమధ్య అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఎవరు కూడా ముఖ్యంగా సిఎం రేవంత్ రెడ్డి వెళ్లి నివాళి అర్పించలేదన్న ఆక్రోశాన్ని కెసిఆర్ వెళ్లగక్కారు. అలాగే దళితబంధుపైనా చేవెళ్ల సభలో ఆక్రోశించారు. దళితులంతా తిరుగుబాటు చేయాలన్నారు. ఈ రకంగా కెసిఆర్ తానొక్కడినే దళిత జనోద్ధారకుడినని ప్రచారం చేసుకోవడం మొదలుపెట్టారు. నిజానికి కేసీఆర్ మనసులో దళితుల పట్ల ప్రేమ, గౌరవం ఉండదు. బ్రాహ్మణులకు పాదాభివందనం చేసే కేసీఆర్ దళితులకు ఏ సందర్భంలో కూడా పాదాభివందనం చేయడాన్ని మనం చూడలేదు. బ్రాహ్మణ వర్గానికి చెందిన ప్రణబ్ ముఖర్జీ రాష్ట్రపతిగా ఉన్నప్పుడు, నరసింహన్ రాష్ట్ర గవర్నర్‌గా ఉన్నప్పుడు వారికి పాదాభివందనం చేయడాన్ని మనం చూశాం! అదే సమయంలో దళితుడైన రామ్‌నాథ్ కోవింద్ రాష్ట్రపతిగా ఉన్నప్పుడు ఆయనకు ఒక్కసారి కూడా పాదాభివందనం చేయలేదు. దీన్నిబట్టి దళితులకు కేసీఆర్ మనసులో ఏ స్థానం ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పుడు దేశవ్యాప్తంగా దళితవాదులు పెరగడంతో అంబేద్కర్‌కు ప్రాధాన్యత ఏర్పడింది. ఈ ప్రాంతం ఆ ప్రాంతం అన్న తేడా లేకుండా దళితులు అందరూ డాక్టర్ అంబేద్కర్‌ను తమ దైవంగా కొలుస్తున్నారు. అందుకే విగ్రహాన్ని పెట్టి, దళితబంధు పేరుతో బురిడీ కొట్టించే ప్రయత్నాలు చేశారు. దళితుల ఓట్లు గంపగుత్తగా కొల్లగొట్టాలని కేసీఆర్ దృష్టి పడింది. ఆగమేఘాల మీద అత్యంత ఎత్తయిన విగ్రహాన్ని తయారు చేయించారు. 'విగ్రహాలు మీకు?అధికారం మాకు' అని దళితులను మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. రాజకీయాల్లో వ్యక్తి పూజకు, వ్యక్తుల్ని విగ్రహాలను చేసి పూజించే సంస్కృతికి అంబేడ్కర్ వ్యతిరేకి. అణగారిన ప్రజలు తమ చైతన్యానికి స్ఫూర్తిగానో, ధిక్కారానికి ప్రతీకగానో అంబేడ్కర్ విగ్రహాలు ఏర్పాటు చేసుకోవడంలో అర్థముంది కానీ, ప్రభుత్వాలు పనిగట్టుకొని భారీ విగ్రహాలను నెలకొల్పడంలో ఏ అర్థమూ లేదు. అది గుజరాత్‌లో పటేల్ విగ్రహమైనా,



తెలంగాణ,ఎపిల్లో అంబేద్కర్ విగ్రహమైనా.. ప్రజల జీవితాల్లో మార్పేమీ ఉండదు. తెలంగాణలో దళితులకు మూడెకరాల భూమి పేరుతో కెసిఆర్ మోసం చేశారు. ఎపిలో కుల హత్యల కేసుల్లో న్యాయం జరగడంలేదు. సబ్ ప్లాన్ అమలుకు నోచుకోలేదు. ఇలా చెప్పుకొంటూ పోతే అడుగడుగునా దగాపడ్డ దళితులే కనిపిస్తారు. ఆ మహానుభావుడ్ని ఆకాశానికెత్తడం వెనుక ఉన్నవి రాజకీయ ప్రయోజనాలేనని దళితులు కూడా గుర్తిస్తున్నారు. తెలంగాణలో వ్యక్తి పూజ ఫలితంగా కేసీఆర్ నియంతలా మారిపోయారు. ఆయన మాటే శాసనంగా చెల్లుబాటు అయ్యేది. అంబేద్కర్ ఆశయాలకు కట్టుబడాలని ఉద్బోధించే కేసీఆర్ తాను మాత్రం ఆయన ఆశయాలను ఆచరించ లేదు. తాను స్థాపించిన విగ్రహం వద్దకు వెళ్లి నివాళి అర్పించలేదు.అలాంటప్పుడు రేవంత్ రెడ్డిని ఆడిపోసు కోవడంలో అర్థం లేదు. ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగానే రాజకీయ నేతలు నిత్యం మహాత్మాగాంధీ, డాక్టర్ అంబేద్కర్ జపాలు చేస్తున్నారు. అందుకే జ్యోతీరావ్ పూలే విగ్రహం కూడా పెట్టాలని కవిత గట్టిగానే ప్రయత్నం చేసినా..జైలు జీవితం తప్పలేదు. అంబేద్కర్ విగ్రహాలను భారీ ఎత్తులో నిర్మించినంత మాత్రాన దళితుల కడుపు నిండదు. వారిని మాయ చేయడానికి మాత్రం ఇవి పనికి వస్తాయి. బీసీల అవసరం ఏర్పడితే మహాత్మాపూలే విగ్రహం రూపొందుతుంది. నిజానికి కొన్నేళ్ల క్రితం వరకు జ్యోతీరావ్ పూలేకు తెలంగాణలో అంత ప్రాధాన్యత ఉండేది కాదు. మరుగునపడిన లేదా నిర్లక్ష్యానికి గురైన మహనీయులను రాజకీయ అవసరాలకోసం వాడుకుంటున్నారు. ప్రజలను మభ్యపెట్టడంలో కేసీఆర్, జగన్మోహన్ రెడ్డి ఎవరికెవరూ తీసిపోరు. విశాఖ విమానాశ్రయంలో తనపై హత్యాయత్నం జరిగిందని గత ఎన్నికలకు ముందు జగన్ ప్రజలను నమ్మించగలిగారు. ఇప్పుడు గులకరాయి తగలడంతో ఇదంతా చంద్రబాబు చేసిన పనిగా నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. అదంతా బూటకమని తేలింది. కోడి కత్తి డ్రామా వెలుగులోకి రావడంతో ఆశ్చర్యపోవడం ప్రజల వంతు అయ్యింది. ఈ తరహా ప్రచారమే చేసి ఎన్నికల్లో లబ్ది పొందారు. వివేకా హత్య జరిగినప్పుడు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు పాత్ర ఉందని జనాన్ని నమ్మించే ప్రయత్నం చేశారు. ఫేక్ ప్రచారం ద్వారా లబ్ది పొందడం ఎలాగో తెలుసుకున్న జగన్ అండ్ కో రానున్న ఎన్నికల్లో కూడా లబ్ది పొందడానికై అదే ఫేక్ ప్రచారంపై ఆధారపడుతున్నారు. తెలంగాణలో 17 ఎంపీ సీట్లు మాత్రమే ఉన్నా అందులో ఎవరు విజేతనో తేలనుంది. కాంగ్రెస్‌కు రెండుసీట్లు కూడా రావని కెసిఆర్ అనుకుంటున్నారు. మరోవైపు దళితబంధు గురించి ప్రచారం పెంచి అబ్దిపొంద వచ్చన్న ఆలోచన కూడా కెసిఆర్‌లో ఉంది. తెలంగాణ వనరులు సొంతం చేసుకుంటూ ఆర్థికంగా బలపడ్డ కేసీఆర్ రాజకీయ భవిష్యత్తును తెలంగాణ ప్రజలే తేల్చేశారు. చేసిన తప్పుల కారణంగా ఆయన ఎంతగా వగచినా ప్రజలు నమ్మడం కల్ల.

# కడియం లక్ష్యంగా బిఆర్ఎస్ నేతల విమర్శలు

**కాంగ్రెస్‌లో చేరడాన్ని తట్టుకోలేక పోతున్న నేతలు**

**వరంగల్,ఏప్రిల్17(వెలుతురు):**
వరంగల్ జిల్లాలో రాజకీయం వేడెక్కింది. నేతల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. కడియం కాంగ్రెస్‌లో చేరడంతో వీరంతా విమ్మలకు పదను పెడుతున్నారు. గత 15రోజుల వరకూ భాయ్ భాయ్ అంటూ తిరిగిన నేతలు.. ఒక్కసారిగా మెడలో కండువా మారడంతో బద్ధ శత్రువులైపోయారు. నిన్నటి వరకూ కలుపుగోలుగా తిరిగిన నేతలు మాటల దాడి చేసుకుంటున్నారు. వరంగల్ ఎంపీ సీటు విషయంలో పార్టీ మారిన కడియం శ్రీహరిపై బీఆర్ఎస్ నేతలు మండిపడు తున్నారు. సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్, మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ జంప్‌కి కారణం కడియం అంటూ ఆరోపించారు. వరంగల్ లోజరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల మీటింగ్‌లో కడియంపై ఫైర్ అయ్యారు.

కడియం శ్రీహరికి డాక్టర్ రాజయ్య సవాల్ విసిరారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అంటూ ఛాలెంజ్



చేశారు. త్వరలో కడియం విదేశీ ఆస్తుల వివరాలు బయటపెడతానన్నారు. కడియంపై మాజీ మంత్రి దయాకర్ రావు సెటైర్లు వేశారు. కడియం జీవిత చరిత్ర మొత్తం తన చేతిలో ఉందన్నారు. టైం వచ్చిన రోజు బయటపెడతాన్నారు. కడియం శ్రీహరి వల్ల కాంగ్రెస్‌కి త్వరలో పెనుప్రమాదం పొంచి ఉందంటూ పెద్ది సుదర్శన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. 2, 3 నెలల్లో స్టేషన్‌ఘన్‌పూర్‌కు ఉప ఎన్నికలు వస్తాయన్నారు. దానంకు నోటీసులు వచ్చాయి. రేపో మాపో కడియంకు కూడా నోటీసులు వస్తాయన్నారు.

మరోవైపు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, రాజయ్యపై మండిపడ్డారు కడియంశ్రీహరి. లిఫ్ట్ ఇరిగేషన్‌లో పల్లా లంచాలు తీసుకుంటే.. దళితబంధులో రాజయ్య లంచాలు తీసుకున్నారని ఆరోపించారు కడియం. వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్ వర్సెస్ కడియం అన్నట్లుగా మారింది రాజీయం. కడియం టార్గెట్‌గా బీఆర్ఎస్ నేతలు ప్రచారం మొదలెట్టారు. ఈవిమర్శల దాడి ముందుముందు ఇంకెత వరకూ వెళ్తోందో చూడాలి.



# గోధుమతో వెరైటీలు

గోధుమ పిండితో పుల్కాలు, పూరీలు, చపాతి, పరోటాలు సాధారణంగా చేస్తూనే ఉంటాం. పిల్లలు, పెద్దలు ఇష్టంగా తినే కొన్ని వంటకాలు చేసుకోవచ్చు. రైస్ కన్నా గోధుమలతో చేసిన వంటకాలు అందరూ ఇష్టపడుతుంటారు కూడా. గోధుమ పిండితో లడ్డూలు, తీపి దోశె, కారం దోశె, తీపి పొంగడాలు, కారం పొంగడాలు, మడత పూరీలు, కాజాలు వంటివి చేద్దాం రండి.

## గోధుమ లడ్డూలు

గోధుమ రవ (సన్ననిది) 4 కప్పులు,
పంచదార 3 కప్పులు
నెయ్యి 2 కప్పులు, ఏలకులు 8,
జీడిపప్పులు 16, బాదం పప్పులు 16, కిస్‌మిస్‌లు 24,
ఎండుకొబ్బరి 1 కప్పు

ముందుగా గోధుమ రవ్వను దోరగా నెయ్యి కొంచెం వేసి



**తయారు చేసే విధానం:** వేయించాలి. రవ్వను పంచాదారను కలిపి కొద్దిగా మిక్సీ పట్టాలి. బాదం, జీడిపప్పు దోరగా వేయించి ఏలకులు చేర్చి కచ్చాపచ్చగా మిక్సీ పట్టాలి. అన్నీ కలిపి ఈ పిండిలో చేర్చి బాగా కలపాలి. మిగతా నెయ్యి చేర్చి లడ్డూలుగా కట్టుకోవాలి. మెత్తగా ఉండే ఈ లడ్డూలు ఆరోగ్య రీత్యా చాలా మంచిది. పంచదారకు బదులు బెల్లం కూడా చేర్చుకోవచ్చు. బెల్లంతో చేసిన లడ్డులనూ షుగర్ పేషెంట్స్‌కు కూడా తినొచ్చు.

## కారం పొంగడాలు

బియ్యం పిండి 1 కప్పు, గోధుమ పిండి 2 కప్పులు
ఉప్పు 2 చెంచాలు, జీలకట్ట 2 చెంచాలు
అల్లం వెల్లుల్లి పేస్ట్ 4 చెంచాలు,
నూనె 1/2 కప్పు, సన్నగా తరిగిన ఉల్లిపాయలు
సన్నగా తరిగిన పచ్చిమిరపకాయలు (తగినంత)
సోడా 1/2 చెంచా, పెరుగు సరిపడినంత

**తయారు చేసే విధానం:** బియ్యం, గోధుమ పిండ్లకు పెరుగు చేర్చి



బజ్జీల పిండిమాదిరి కలుపుకోవాలి. దీనిలో జీలకర్ర, అల్లం వెల్లువి పేస్టు, పచ్చిమిరప, ఉల్లిపాయల ముక్కలు అన్నీ చేర్చి, ఉప్పు , సోడా కలుపుకోవాలి. పొంగడాలు గుంటకు నూనె రాసి ఈ పిండిని పోసి మూత పెట్టి స్టవ్ పైన సన్నని సెగతో కాల్చుకోవాలి. పొంగడాలు కొద్ది సేపటికి ఎర్రగా కాలి మంచి వాసన వస్తాయ. అపుడు తిరగవేసి మళ్లీ కొద్ది సేపు కాల్చుకుని వీటిని వేరే పళ్లెంలోకి తీసుకోవాలి. ఒకవేళ పొంగడాల పెనం లేకపోతే దోసె పెనం మీద కాస్త లావుగా అంటే పూతప్పం మాదిరి వేసుకొని కాల్చుకుంటే ఎంతో బాగుంటాయి.

## తీపు దోశెలు

గోధుమ పిండి 2 కప్పులు,
బియ్యం పిండి 4 చెంచాలు
మెత్తని బెల్లం 1 కప్పు, ఏలకులు 5
కొబ్బరికోరు 5చెంచాలు
జీడిపప్పు, బాదం పప్పులు పొడి 5 చెంచాలు
ఏలకులు 5, కొబ్బరి కోరు 5 చెంచాలు



జీడిపప్పు, బాదం పప్పు పొడి 5 చెంచాలు
నెయ్యి 1/4 కప్పు, కిస్‌మిస్‌లు 24
సోడా 1 చెంచా, పాలు 1 కప్పు

**తయారు చేసే విధానం:** ముందుగా పిండిలో అన్నీ కలిపి పాలు పోసి సోడా చేర్చి కొంచెం నీరు చేర్చుతూ దోశెల పిండిలా కలపాలి. ఈ పిండిని దోసెలపెనం మీద వేయాలి. సన్నని సెగమీద కాల్చాలి. చిన్న పిల్లలకు పెద్దవారికి కూడా ఇవి ఎంతో బాగుంటాయ.

## మసాలా దోసె

కావలసిన పదార్థాలు:
గోధుమ పిండి 4 కప్పులు
బియ్యం పిండి రెండు కప్పులు
గోధుమ రవ్వ (ఉప్మారవ) ఒక కప్పు
పెరుగు సరిపడినంత
దోసెలు వేయడానికి సరిపడినంత నూనె



**తయారు చేసే విధానం:** పిండిని పెరుగుతో కలుపుకుని ఓ గంటపాటు నిలువపెట్టాలి. ఆ తరువాత గరిటజారుగా చేసుకొని పెనాన్ని వేడి చేసి దోసెలు వేసుకోవాలి. ఇవి ఒకవైపు కాల్చితే సరిపోతాయ. వీటి మీద కావాలంటే సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు అలంకరించుకుంటే బాగుంటుంది.

# హలీం సలాం



**ఆరో నిజాం నవాబు మహబూబ్ అలీఖాన్ తన సంస్థానంలో పోలీసు వ్యవస్థను బలోపేతం చేసేందుకు కీలకమైన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి పర్షియా నుంచి ప్రత్యేక ఆహ్వానితులు వచ్చారు. రంజాన్ ఉపవాసదీక్ష విరమణకు వడ్డించే వంటకాల్లో ఓ ప్రత్యేక డిష్ గురించి పర్షియా ప్రతినిధులు ప్రస్తావించారు. వెంటనే నవాబు షాహీ దస్తర్ ఖానా (వంటగది) సిబ్బందిని పిలిపించి ఆ వంటకాన్ని సిద్ధం చేయించారు. అదే హలీమ్. అలా పర్షియా నుంచి పరిచయమైన హలీం హైదరాబాద్ బిర్యానీలాగే ఇక్కడి వంటకమైంది.**

ఇరాన్, ఇరాక్, తదితర అరబ్ దేశాల్లో తయారయ్యే హలీంలో గోధుమలు, మాంసం, పప్పు, ఉప్పు, నూనె మాత్రమే వినియోగిస్తారు. కానీ హైదరాబాద్ హలీంకు మొదట నెయ్యి తోడైంది. ఆ తరవాత కారం, షాజీరా, లవంగాలు, అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చి జతకట్టాయి. ఆ తరువాత అనేక రకాల మార్పులతో మరింత గొప్ప రుచిని సంతరించుకుంది. ఏడో నిజాం నాటికి హలీంకు అనూహ్యమైన డిమాండ్ వచ్చింది. పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఇరాన్, ఇరాక్, సింగపూర్, ఇండోనేషియా, యెమన్, అరబ్ ఎమిరేట్స్, అమెరికా, బ్రిటన్‌లలో లొట్టలేసుకుంటూ ఆరగించే వంటకం హైదరాబాద్ హలీం..

### ఐదు దశాబ్దాల క్రితమే..

నవాబ్ ఉస్మాన్ ఆలీఖాన్ హయాంలో బ్రహ్మాండమైన ఆదరణ పొందినప్పటికీ హలీం అమ్మకాలు మాత్రం ఐదు దశాబ్దాల క్రితమే మొదలయ్యాయి. ఇరాన్ నుంచి నగరానికి వచ్చిన ఓ కుటుంబం పాతబస్తీలోని చార్మినార్ వద్ద మదీనా సర్కిల్‌లో 'మదీనా' పేరుతో హోటల్ పెట్టి హలీం విక్రయాలను ప్రారంభించింది.

### భిన్న'రుచుల' పసందు..

తొలినాళ్లలో నాన్‌వెజ్‌తో తయారైన హలీం ఇప్పుడు వెజిటేరియన్‌గా కూడా లభ్యమవుతోంది. నాన్‌వెజ్‌లో మటన్, చికెన్, బీఫ్, ఫిష్, ఈమూ హలీంలు ప్రత్యేకం. ఇందులో సైతం దక్కని, ఇరానీ, అరేబియన్, జఫ్రానీ, యమనీ విధానాల్లో తయారు చేస్తుంటారు. కొవ్వు తక్కువగా ఉండే ఈమూ హలీం తయారీ రెండేళ్ల క్రితం ప్రారంభమైంది. వెజిటేరియన్‌లో కూడా అనేక రకాలుగా హలీం హోటల్స్‌లో దొరుకుతోంది.

### 'పిస్తా'కు ప్రత్యేక గుర్తింపు

హలీం తయారీలో నాణ్యత, ప్రమాణాలు పాటిస్తున్నందుకు హైదరాబాద్ పిస్తా హౌస్‌కు జాతీయ స్థాయిలో జియోగ్రాఫికల్ ట్యాగ్ లభించింది. పాతబస్తీలోని శాలిబండలో 1997లో ప్రారంభమైన పిస్తా హౌస్ అనతి కాలంలో దేశ విదేశాలకు విస్తరించి ప్రత్యేకతను చాటుకుంది. ఇప్పటికే ఐఎస్‌ఐ మార్కుతో పాటు, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో 514 అవార్డులు లభించాయి. ప్రతిరోజు సుమారు ఐదు క్వింటాళ్ల వరకు హలీం తయారు చేసి హైదరాబాద్‌తో పాటు దేశంలోని వివిధ నగరాల్లో 400కు పైగా ఔట్‌లెట్ల ద్వారా విక్రయిస్తున్నారు. అమెరికాలోని డల్లాస్, కాలిఫోర్నియా, న్యూజెర్సీ, తదితర ప్రాంతాల్లో 'పిస్తా'కు ఏడు బ్రాంచీలు ఉన్నాయి.

### తయారీ ప్రత్యేకం..

ఈ ప్రత్యేక వంటకం తయారీ కూడా ప్రత్యేకమే. హలీం తయారీకి కనీసం 9 గంటల సమయం పడుతోంది. తెల్లవారు జామున 4 గంటలకే తయారీ విధానం ప్రారంభమవుతుంది.

హలీం వంటకంలో మటన్, గోధుమలు, అన్ని పప్పులు, బాస్మతి బియ్యం, నెయ్యి, అల్లం వెల్లుల్లి పేస్ట్, ఉల్లిగడ్డ, పచ్చిమర్చి, యాలకులు, దాల్చినచెక్క, మిరియాలు, కొత్తిమీర, నూనె, డ్రైఫ్రూట్స్ తదితర వాటిని వినియోగిస్తారు.

ముందుగా గిన్నెలో మాంసం, నీటిని కలిపి బాగా ఉడికిస్తారు. అనంతరం గోధుమలు, బాసుమతి బియ్యం, పప్పులు, అల్లం వెల్లుల్లి పేస్ట్, మసాల దినుసులు, పచ్చిమిర్చి బాగా ఉడికించి మెత్తగా దంచుతారు. అనంతరం సమపాళ్లలో నెయ్యి కలుపుతారు.

ఫిష్ హలీంలో గోధుమలు, మసాలాలు కలిపి ఉడికించి చివరన చేప ముక్కలను కలిపి తయారు చేస్తారు.

> **ప్రపంచానికి రుచి చూ'పిస్తా'..**
>
> ప్రపంచ వ్యాప్తంగా హలీం విక్రయాలను విస్తరించాలని నిర్ణ యించాం. ఇందుకు 'టార్గెట్ 2020'గా పెట్టుకున్నాం. ఇప్పటికే దేశంలోని మెట్రో నగరాలతోపాటు వివిధ దేశాలకు 'హైదరాబాద్ పిస్తా హలీమ్'ను ఎగుమతి చేస్తున్నాం. అమెరికాలో ప్రత్యేకంగా హలీం తయారు చేస్తున్నాం. వచ్చే ఏడాది స్విడ్జర్లాండ్, జెనీవా నగరాల్లో కేంద్రాలను ప్రారంభిస్తాం. వెబ్‌సైట్ ద్వారా కూడా ఆర్డర్ తీసుకొని పంపిస్తున్నాం.
>
> – మహ్మద్ అబ్దుల్ మాజీద్, పిస్తాహౌస్ యాజమాని

### రుచుల్లో రకాలు.. దక్కనీ హలీం

ఇక్కడి ప్రజల ఆహారపు అలవాట్లకు అనుగుణంగా తయారు చేస్తారు. ఇందులో గోధుమలు కంటే మాంసం మోతాదు రెండింతలు అధికంగా ఉంటుంది. నెయ్యితో పాటు ఇతర దినుసులను వినియోగిస్తారు.

### ఇరానీ హలీం

ఇరానీ హలీం ఘాటుగా ఉండదు. డ్రై ఫ్రూట్స్‌తో పాటు గోధుమలు, మినపప్పు, తక్కువ మోతాదులో మసాల దినుసులు వినియోగిస్తారు.

### వెజిటేరియన్ హలీం

శాకాహారుల కోసం ప్రత్యేకంగా వెజిటేరియన్ హలీంలను కూడా కొన్ని హోటల్స్ అందిస్తున్నాయి. గోధుమ రవ్వతో పాటు మసాల దినుసులు కలిపి ఈ వంటకం చేస్తారు. దీనిలో బీన్స, క్యారెట్, కీరా, పచ్చి బటానీ కలిపి ఉడికిస్తారు. ఘాటుగా ఉండకుండా పలు హోటల్స్‌లో పెరుగు, పాలు కూడా కలుపుతారు.

### ప్యారడైజ్ స్పెషల్..

హైదరాబాద్ బిర్యానికి ప్యారడైజ్ హోటల్‌కు ఎంత పేరుందో.. స్వచ్ఛమైన హలీంకు సైతం ఇక్కడ గొప్ప ఆదరణ ఉంది. 'హలీం తయారీకి ఉపయోగించే నాణ్యమైన మాంసం, గోధుమలు, స్వచ్ఛమైన నెయ్యి, దినుసులు అన్నీ హైదరాబాదీవే'అని చెబుతారు హోటల్ మేనేజర్ అహ్మద్.

ప్రతి రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఇక్కడ హలీం ప్రియుల సందడి మొదలవుతుంది. 60 ఏళ్ల క్రితం ప్రారంభమైన ప్యారడైజ్ హోటల్‌లో 28 ఏళ్ల నుంచి హలీంను రుచి చూపిస్తున్నారు.

### ధరలు ఇలా..

మటన్ హలీం రూ. 90 నుంచి 170 వరకు, చికెన్ రూ. 70 నుంచి 90 వరకు, వెజిటేరియన్ హలీం రూ.70 నుంచి రూ.90 వరకు లభిస్తోంది. వీటిలో సింగిల్, ప్లేట్, స్పెషల్, ఫ్యామిలీ, జంబో ప్యాక్ ధరలు వేర్వేర్వుగా ఉంటాయి.

# తీర్థయాత్రలు ... అంతరార్థాలు

**నానా శ్రాంతాయ శ్రీరస్తి రోహిత శుశ్రుమ పాపో నృషద్వరో జన ఇంద్ర ఇచ్చరతః బాగా చరైవేతి**

భారతీయ జీవనవిధానంలో తీర్థయాత్రకు ఎంతో ప్రాధాన్యం ఉన్నది. ఐతరేయ బ్రాహ్మణంలో హరిశ్చంద్రుని పుత్రుడైన రోహితునికి అతని గురువులైన పర్వత, నారదులు ఈ శ్లోకాన్ని ఉపదేశించారు. 'ఓ రోహిత! అన్ని విధాలా కష్టపడిన వానికే సంపదలు వశమౌతాయి. ఏ పనీ చేయకుండా కాలం గడిపే వ్యక్తి దోషిగా మిగిలిపోతాడు. లోకసంచారం చేసేవారికి ఇంద్రుడే మిత్రుడౌతాడు. అందుకని లోకంలో సంచరించు." అని చెప్పారు.

ఏకాంతంలో అతిథితో సంభాషిస్తున్న రామునికి దుర్వాసమహర్షి వచ్చాడని అనుమతి లేకుండా వచ్చి తెలియజేసిన లక్ష్మణునికి రాజధర్మముల ననుసరించి దేశబహిష్కారశిక్ష విధించాడు రాముడు. లక్ష్మణుడు తీర్థయాత్రలో తన శేషజీవితాన్ని గడిపాడు. అదే విధంగా ద్రౌపదితో ఏకాంతంలో ఉన్న ధర్మరాజుకు ఏకాంత భంగంచేసిన అర్జునుడు ఒక సంవత్సరకాలం నిషేధాన్ని పొంది తీర్థయాత్రలో కాలం గడిపి అపారమైన అనుభవాన్ని, ఎన్నో విశిష్ట శక్తులను సంపాదించారని మహాభారతం చెబుతున్నది. పాండవులు 12 సంవత్సరాల వనవాసకాలంలో ఎన్నో ఆశ్రమాలను దర్శించారు. ఎన్నో పవిత్ర నదీక్షేత్రాలను చూశారు. వారు ఆ సమయంలో పొందిన అనుభవాలు, జ్ఞానం, శక్తి అనంతం.

తీర్థ శబ్దానికి శాస్త్రం, యజ్ఞం, పుణ్యక్షేత్రం,



రాజనీతి ఉపాయం, ఉపాధ్యాయుడు, ఋషులు సేవించిన నదీ, తటాకాదులు, అవతారం, మంత్రి, వేదములు, అగ్ని హోత్రం ఇలా అనేక అర్థాలున్నాయి. పండితుల్ని సేవించి అరుదైన శాస్త్రాలను తెలుసుకోవటానికి, యజ్ఞాలను చూడటానికి, (యజ్ఞాల వల్ల వర్షాలు పడతాయి. కనుక యజ్ఞసంస్కృతిని ప్రోత్సహించడం కోసం), పుణ్యక్షేత్రాలను దర్శించి పునీతులు కావడం కోసం, ప్రజాహితం కోసం రాజనీతి ఉపాయాలను సంపాదించటం కోసం, గొప్ప గురువులు తారసిల్లితే వారి అనుగ్రహంతో మంచి ఆశీస్సులను పొందటం కోసం, వివిధ దేవతామూర్తులను వీక్షించడం కోసం, వేద విద్యను రక్షించడం కోసం ... తీర్థయాత్రలు చేయాలన్నమాట.

ధర్మశాస్త్రంలో చెప్పిన విధంగా తీర్థాలు జంగమ, స్థావర, మానసములని మూడు రకాలు. మహా పురుషులు, ఆచారపరాయణులు కదిలే తీర్థములట. అందుకని వీరిని జంగమ తీర్థములు అంటారు. వారి మాటలు వింటే చాలు విన్నవారికి జీవితం, మనస్సు, బుద్ధి పవిత్రతని పొందుతాయట. ఇక మానసిక తీర్థములు అంటే సత్యం, క్షమ, ఇంద్రియనిగ్రహం, సర్వభూతదయ, అంతటా ఋజుప్రవర్తన కలిగి ఉండటం, దానం, దమము, సంతోషం, బ్రహ్మచర్యం, అందరితో మధురంగా మాట్లాడటం, జ్ఞానం, ధృతి, పుణ్యం... అని బ్రహ్మాండ పురాణంలో చెప్పారు. వీటివల్ల మనస్సు శుద్ధమౌతుంది. ఇక భౌమతీర్థాలు.. నదులు, ప్రాచీనమైన చెరువులు, పుణ్యక్షేత్రాలు, ప్రాచీన దేవాలయాలు వంటివి.

మహాపురుషులను చూడటం కోసం, పైన చెప్పిన సద్గుణాలను అలవర్చుకోవాలని, దివ్య ప్రాంతాల్లో ఆ క్షేత్ర మహత్యాన్ని అనుభవించటానికి తీర్థయాత్రలు చేయాలి. ఏ వ్యక్తి అయినా ఉన్నత సంస్కారాలను పొందాలనుకున్నా, తాను చేసిన పాపాలు పోవాలనుకున్నా, మహాపురుష సందర్శనం కావాలనుకున్నా, తటాకాదులలో స్నానం చేయటం వల్ల వివిధ ఓషధీ వనాలమీదుగా ప్రవహించే వాటి ప్రభావం వల్ల పరిపూర్ణమైన ఆరోగ్యాన్ని పొందాలన్నా, మంచి బుద్ధి వికాసం కావాలన్నా తీర్థయాత్రలు ఉపయోగపడతాయి.



ఈ ప్రపంచంలో 'మతం' అనేదే లేని చోటు ఒకటి ఉండేది. అది వేద కాలపు భారత(ప్ర)దేశం. 'భా' అంటే 'కాంతి' లేదా 'ప్రకాశం' అనీ, 'రత' అంటే 'అంకితమైన', 'ఆసక్తి కల' అనీ అర్థాలు. భగవంతుడు కాంతి రూపుడు. భారతం' అంటే 'భగవంతుడికి అంకితమైనది' లేదా 'భగవంతుడిపై ఆసక్తి కలది' అని భావం. అలాంటి భారతదేశంలో మతం లేని భగవత్ చింతన మాత్రమే ఉండేది. అది వేద ప్రతిపాదితం. వేదంలో మతం లేదు. మతం లేకుండా ప్రజలు ప్రశాంతంగా జీవించేవారు. మహర్షుల ఉపదేశాలూ, సందేశాలూ, పరిశీలనలూ, ప్రతిపాదనలూ వేదం అయినాయి.

# వేదంలోకి వెళ్దాం

## మొదట మూడు! తరువాత నాలుగు!!

'వేదం' అంటే విద్య లేదా జ్ఞానం అని అర్థాలు. తొలి దశలో వేదం ఒకటే. ఆపై మూడు విభాగాలై 'త్రయీ విద్య' అయింది. 'ఋక్', 'యజుర్', 'సామ' అని ఆ విభాగాలకు పేర్లు. మహాభారత కాలానికి కూడా వేదం త్రయీ విద్య గానే ఉండేది. అటు తరువాత 'అథర్వ' అన్న మరొకదానితో వేదం నాలుగు విభాగాలు లేదా శాఖలయింది. వేదం అన్నది నైతిక మార్గదర్శకాల, కర్మ కాండల, ప్రవర్తనా సూత్రాల క్రోడీకరణ కూడా! దైనందిన జీవనానికీ, అధ్యాత్మిక అభ్యాసానికీ మహర్షులు పలువురి సమష్టి ప్రయత్నమే వేద సంపుటి. 'వేద యతి యతో ధర్మాధర్మ ఇతి వేదః' ధర్మా ధర్మాలను తెలియజేసేది వేదం.


## మంత్రాలు... బ్రాహ్మణాలు... ఆరణ్యకాలు... ఉపనిషత్తులు!

వేదం నాలుగు భాగాలుగా ఉంటుంది. మంత్రం, బ్రాహ్మణం, ఆరణ్యకం, ఉపనిషత్ అనేవి. మంత్ర భాగాన్ని 'సంహిత' అని కూడా అంటారు. ఈ సంహితలు అయిదు. అవి ఋక్ సంహిత, కృష్ణ యజుస్సంహిత, శుక్ల యజుస్సంహిత, సామ యజుస్సంహిత, అథర్వ సంహిత. ఇక, బ్రాహ్మణాలు అయిదు. అవి ఐతరేయ బ్రాహ్మణం, తైత్తిరీయ బ్రాహ్మణం, శతపథ బ్రాహ్మణం, షడ్వింశ బ్రాహ్మణం, గోపథ బ్రాహ్మణం. మంత్రం అన్నదానికి పలు అర్థాలున్నాయి. యజ్ఞం చేసే వాళ్లు పలికే శబ్ద సమూహం మంత్రాలే. మంత్రాలను 'ఋక్, యజుస్, సామ'లని అన్నారు. ఋక్‌లు అంటే స్తుతులు, దైవ ప్రార్థనలు. వీటిని 'సూక్తాలు' అనీ అన్నారు. వేద సాహిత్యమంతా మంత్రాలే. మంత్రం లేదా సంహిత భాగానికి వివరణలు బ్రాహ్మణాలు. యజ్ఞాలను నిర్వహించే తీరును బ్రాహ్మణాలు వివరిస్తాయి.

ఋక్‌లు, బ్రాహ్మణాలు కర్మకాండకు సంబంధించినవి. మంత్రం, బ్రాహ్మణ శాఖల తరువాత ఆరణ్యకాలు ఉంటాయి. ఆరణ్యకాలు రెండు మాత్రమే కనిపిస్తున్నాయి. అవి ఐతరేయారణ్యకం, తైత్తరీయారణ్యకం. ఆరణ్యకాలు వైరాగ్యాన్ని ఉపదేశిస్తాయి. వానప్రస్థాశ్రమంలో అరణ్యాలలో అధ్యయనం చెయ్యడం వల్ల అవి 'అరణ్యకాలు' అని అనిపించుకున్నాయి. చివరి సమన్వయం (సింథసిస్) ఉపనిషత్తులలో తెలుస్తుంది. ఉపనిషత్తులు ఆధ్యాత్మికత వైపు నడిపిస్తాయి. అందుకనే వాటిని 'బ్రహ్మకాండ' అని అన్నారు. ఉపనిషత్తులు 108 కనిపిస్తున్నా పది ఉపనిషత్తులు మాత్రమే మౌలికమైనవి, ముఖ్యమైనవి. ఆది శంకరాచార్యులు దశోపనిషత్తులకు మాత్రమే భాష్యాలు రాశారు. అవి ఈశ, కేన, కఠ, ప్రశ్న, ముండక, మాండూక్య, తైత్తిరి, ఐతరేయ, ఛాందోగ్య, బృహదారణ్యకాలు. ఇవన్నీ కలుపుకొంటేనే వేద వాఙ్మయం.

## ఏనాటిది ఈ వేదం?

వేదానికి మూలం, కాలం ఇప్పటి వరకూ సరిగ్గా తెలియరాలేదు. అనుకోవడాలూ, అభిప్రాయపడడాలూ, వాదోపవాదాలూ ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. కానీ వేదం జీవనది అయి భారతం నుంచి ప్రపంచంలోకి ప్రవహించింది. జీసస్‌కు పదిహేడు శతాబ్దాల ముందే వేదం అరేబియాకు చేరింది. హీబ్రూ భాషలో ఉన్న పాత టెస్టమెంట్‌లో వేద సాహిత్యపు శైలీ, భావాలూ ఉన్నాయని విన్సెంట్ ఎ. స్మిత్ అనే పరిశీలకుడు తెలియజేస్తున్నాడు. వేదాన్ని దృష్టిలో పెట్టుకుని మహమ్మద్ నబికి కన్నా ముందు ఇప్పటికి 2,400 ఏళ్లకు పూర్వం జీవించిన అరబ్బీ కవి, దార్శనికుడు లబీబ్ ఇలా అన్నాడు "ఓ ఆశీర్వదించబడిన హిందూ భూమీ, నువ్వు గౌరవించతగిన దానివి. ఎందుకంటే నీలో భగవంతుడు తన నిజమైన జ్ఞానాన్ని ప్రకటించాడు". విశ్వ గ్రంథ భాండాగారంలో ప్రథమ గ్రంథం 'వేదం' అని పరిశీలకులు నిర్ధారించిన దాన్ని మనం గుర్తుంచుకోవాలి.



## ఆధునిక భావాలెన్నో!

వేదంలోని మొదటి అక్షరం 'అ'. భారత భూమిపై వెలసి నెలకొన్న తాత్త్విక, సాత్విక రచనలకన్నిటికీ వేదమే అధారం. 'ఫిలాసఫీ' అని మనం ఆ రచనల్ని అనకూడదు. 'వాస్తవిక విద్యను దర్శించడంలో హేతువునూ, తార్కికతనూ ఉపయోగించడం 'ఫిలాసఫీ' అవుతుంది. కానీ మనవి వేద జనిత రచనలు కనుక అవి ఫిలాసఫీ అవవు.

'వసుధైక కుటుంబకం' (భూమి ఒక చిన్న కుటుంబం) అన్న విశ్వభావన ప్రపంచ వాఙ్మయంలో తొలిసారి వెలువడింది వేదం నుంచే. శక్తి కేంద్రాల వంటి పలు దేవతలు వేదంలో కనిపిస్తున్నా 'పరమ పురుషుడు ఒక్కడే' (తస్మాత్సర్వైరపి పరమేశ్వర ఏవ హూయతే!) అని వేదం తొలిసారిగా మానవాళికి తెలియజేసింది.

'ఎవరైతే అన్ని ప్రాణులనూ తమలో చూస్తారో, అన్ని ప్రాణులలోనూ తమను చూస్తారో అటువంటి వారికి రోత లేదా విద్వేషం కలగదు' (యస్తు సర్వాణి భూతాని ఆత్మన్యేవాను పశ్యతి, సర్వ భూతేషు చాత్మానం తతో న విజుగుప్సతే) అని మానవజాతికి తొలిసారి చెప్పి సర్వ జీవ సామరస్యాన్ని నిర్దేశించింది వేదమే. ఎన్నో సార్వకాలిక, సార్వజనీన సత్యాలు వేదం నుంచి పుట్టి ప్రపంచమంతా వ్యాపించాయి.

'సంఘాన్ని ప్రేమించు గౌరవించు, ఆకలి చేత పీడించబడిన వాళ్లను రక్షించు' అని వేదం మానవాళికి నేర్పింది. వర్ణ, లింగ వివక్షలు లేని సమాజాన్ని వేదం నిర్దేశించింది. వేదంలో ఒక వధువు, వరుడితో "నేను ఋక్ (సాహిత్యం), నువ్వు సామం (గానం)" అని అంటుంది. స్త్రీపురుషుల సంబంధం ఎలా ఉండాలో ఇక్కడ చెప్పింది వేదం. మరో చోట ఓ స్త్రీ "నేను శిరస్సును, నేను జెండా(పతాకం)ను, నేను నిప్పుల మాటలు పలుకుతాను. నా భర్త నన్ను అనుసరించనీ!" అంటుంది. ఇక్కడ స్త్రీ స్వేచ్ఛ, ఆత్మవిశ్వాసం, స్త్రీ స్వాభిమానం వ్యక్తమవుతున్నాయి.

'ఓ నమ్మకమా! మాకు నమ్మకాన్నివ్వు, భయం నుంచి విముక్తి నివ్వు, అంతులేని సంపదలకు మమల్ని అధిపతుల్ని చెయ్యి, శ్రేష్ఠమైన జ్ఞానాన్ని ప్రసాదించు' అని మనతో పరమాత్మను అడిగిస్తోంది వేదం. అమెరికా దేశపు తత్త్వవేత్త ఆర్.డబ్ల్యూ. ఎమర్స్న (ఎమర్సన్ కాదు) "వేదంలోని భావం ఉష్ణంపై కాంతిలా ఉన్నతమైనది" అని అన్నాడు. "పరమాత్మ మనల్ని రక్షించాలి, మాకు పోషణనివ్వాలి, మాకు విద్యలలో సామర్థ్యం కలగాలి, తేజస్వులైన మాకు బ్రహ్మవిద్య అవగతం కావాలి, మాలో మాకు విద్వేషాలు కలగకుండా ఉండాలి" (ఓం సహనా వవతు సహనౌ భునక్తు, సహవీర్యమ్/ కరవావహై, తేజస్వీ నావధీ తమస్తు మా విద్విషా వ హై) అని వేదం మన చేత ప్రార్థన చేయిస్తూంటుంది.

**వేదాన్ని 'శ్రుతి' అని కూడా అంటారు. మనకు తెలుసు గానానికి శ్రుతి ఉంటుందని. గానం శ్రుతిలోనే ఉండాలి. మన జీవన గానాలు శ్రుతిలోనే సాగాలి. మనం శ్రుతిలో కలవాలి. వేదాలలోకి వెళదాం. సత్యాలను ఆస్వాదిద్దాం.**



# అన్నదాత అవధూత!

"పేదవాడి ఆకలి తీర్చడం, లేనివాడి కడుపు నింపడం... ఇదే నిజమైన మాధవ సేవ!" అని బోధించిన అవధూత కాశిరెడ్డి నాయన. కష్టాలు తీర్చే పెన్నిధిగా ఎందరికో ఆరాధ్యుడైన ఆధ్యాత్మిక గురువు. సామాన్యులను ఆదుకోవడం కోసం జీవితాంతం పాటు పడిన మహనీయునిగా ప్రసిద్ధి చెందిన కాశిరెడ్డి నాయన అసలుపేరు మున్నల్లి కాశిరెడ్డి. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా సీతారామపురం మండలం బెడుసుపల్లిలో సుబ్బారెడ్డి, కాశమ్మ దంపతులకు రెండవ సంతానంగా జన్మించారు.

ఒకవైపు ఆటపాటలూ, మరోవైపు ఆధ్యాత్మిక చింతనతో ఆయన బాల్యం గడిచింది. పదహారేళ్ళ వయసులో చదువు చాలించి, వ్యవసాయ పనులు చేపట్టారు. ఒకసారి వేపచెట్టు కింద కాశిరెడ్డి కూర్చొని ఉండగా, ఆయనకు అంతర్వాణి దిశా నిర్దేశం జరిగింది. సొంత ఊరు నుంచి ప్రకాశం జిల్లా వెలుగొండ గ్రామానికి చేరుకున్నారు. అక్కడ అతిరాచ గురవయ్య స్వామిలో ఆయనకు సద్గురు సాక్షాత్కారం అయింది. గురవయ్య స్వామి శిష్యరికంలో మంత్రోపదేశం పొందారు. తన గమ్యమేమిటో అవగతం అయింది. గురువు సూచన మేరకు తీర్థయాత్రలు ప్రారంభించారు. కన్యాకుమారి మొదలు కాశీ వరకూ దేశంలో కాశిరెడ్డి దర్శించని క్షేత్రం లేదు. కాశీలో మూడేళ్ళు గడిపారు.



గరుడాద్రి వద్ద పన్నెండేళ్ళు తపస్సు చేశారు. తరువాత పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ అన్న దానం, గోసేవ, ఆలయాల జీర్ణోద్ధరణలపై విస్తృతంగా ప్రచారం చేశారు.

## అన్నాన్ని పంచుకోవాలి!

"అమ్మా.. ఆకలితో ఉన్న వారికి పట్టెడన్నం పెట్టండి. శక్తి లేకపోతే గంజి పోయండి. పది మంది అన్నం ఒక్కరు తినకూడదు. నలుగురికి సరిపోయే అన్నం పది మంది పంచుకోవాలి!" అని కాశినాయన బోధించేవారు. నెల్లూరు, రాయలసీమ జిల్లాల్లో ఎందరినో ఆదుకున్నారు. నీడనిచ్చారు. ఆకలి తీర్చారు. కష్టాలలో తోడూనీడగా నిలిచారు. భక్తులు ఆయనను తండ్రిగా భావించేవారు. కాశిరెడ్డి నాయన అని ఆప్యాయంగా పిలుచుకొనేవారు. కాశిరెడ్డి నాయన ఎన్నో ఆలయాలను పునరుద్ధరించారు. నెల్లూరు జిల్లాలోని క్రీ.శ 1406 నాటి ఘటిక సిద్ధేశ్వరాలయం 1974లో ఆయన చేతుల మీదుగా పూర్వ వైభవం సంతరించుకుంది. కాశి నాయన 1995 డిసెంబర్ 6న పరమపదించారు.

## వందకుపైగా ఆశ్రమాలు

కాశిరెడ్డి నాయన సమాధి ఉన్న కడప జిల్లా నరసాపురం మండలంలోని జ్యోతి క్షేత్రం నిత్యం భక్తులతో సందడిగా ఉంటుంది. ఇది కడప జిల్లా ఆళ్ళగడ్డకు సుమారు 50 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇక్కడ నిరంతర అన్నదాన యజ్ఞం కొనసాగుతూ ఉంటుంది. ఏ సమయంలో వెళ్ళినా ఆదరించి, అన్నం పెట్టడం దీని విశిష్టత. తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడు నుంచి కూడా భక్తులు ఇక్కడకు వస్తూ ఉంటారు.

నరసాపురం మండలం పేరును 'కాశినాయన మండలం'గా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మార్చింది. కాశినాయన పేరిట రాయలసీమ ప్రాంతంలో వందకు పైగా ఆశ్రమాలు నడుస్తున్నాయి. అన్నదానంతో పాటు గోసంరక్షణకు కూడా ఇవి పాటుపడుతున్నాయి. వీటిలో తిరునాళ్ళతిప్ప ఆశ్రమం ఒకటి. ఇది అనేక ఆలయాల సముదాయంతో, పవిత్ర క్షేత్రంగా రూపుదిద్దుకుంటోంది. అలాగే, మహారాష్ట్రలోని షిరిడి నుంచి నాగర్‌సోల్ వచ్చే దారిలో, కర్నూలు, కడప, ప్రకాశం, అనంతపురం, నెల్లూరు జిల్లాల్లో ఎన్నో దేవాలయాలు, ఆశ్రమాలు అన్నార్తులను ఆదుకుంటున్నాయి.

# విద్యతో చతుర్విధ పురుషార్థాలు..

**సృష్టిలో ప్రతి ప్రకృతి శక్తినీ దేవతగా భావించడం భారతీయ సంప్రదాయంలో విశిష్టత. మన జీవితంలో అత్యవసరమైన ధనం మన దృష్టిలో వట్టి రూపాయి కాదు. సాక్షాత్తూ లక్ష్మీదేవి. అలాగే జ్ఞానాన్నిచ్చే విద్య కేవలం చదువు కాదు. సాక్షాత్తూ సరస్వతీ దేవి. అటువంటి సరస్వతీదేవిని బమ్మెర పోతన తన భాగవతంలో విశేషంగా ప్రార్థించాడు. ఆ పద్యం భారతీయ విద్యావ్యవస్థ మొత్తాన్నీ ప్రతిబింబిస్తుంది.**

**'క్షోణితలంబు నెన్నుదురు సోకగ**
**మ్రొక్కినుతింతు సైకత**
**శ్రోణికి చంచరీకచయ సుందరవేణికి, రక్షితామర**
**శ్రేణికి తోయజాతభవ చిత్త వశీకరణైక వాణికిన్**
**వాణికి, అక్షదామశుక వారిజ పుస్తక రమ్య పాణికిన్"**



ఈ పద్యం చివరిపాదంలో సరస్వతీదేవి చేతుల్లో జపమాల (అక్షదామం), చిలుక (శుకం), పద్మం (వారిజం), పుస్తకం ఉంటాయని వర్ణించాడు. మనం ఇప్పుడు చూస్తున్న సరస్వతి చిత్రంలో జపమాల, పుస్తకం ఉండి మరో రెండు చేతుల్తో వీణవాయిస్తూ ఉంటుంది. పోతన ఈ మూర్తినే వర్ణించి ఉంటే వీణ ఎందుకకు వదిలేస్తాడు? పైగా చేతుల్లో లేని పద్మాన్ని, చిలుకను, చేతుల్లోనే ఉన్నట్లుగా ఎందుకు వర్ణిస్తాడు? అంటే మనం చూస్తున్న సరస్వతీమూర్తి.. పోతన వర్ణించిన మూర్తి వేరని అర్థమవుతోంది కదా! అయితే వీణ లేకుండా అక్షదామ శుకవారిజ పుస్తకాలు చతుర్భుజాల్లో ధరించిన ఈ మూర్తి ఎవరు? పోతన వర్ణించింది 'శారదామూర్తి' అని, ఆవిడ వైదిక విద్యలకు అధిదేవత అని.. మనం చూస్తున్న సరస్వతీ మూర్తి లౌకిక విద్యలకు అధిదేవత అని వేదవిద్యలోను, సంస్కృత సాహిత్యంలోనూ నిష్ణాతులైన పెద్దల అభిప్రాయం. శృంగేరీ శారదాపీఠం వారు ప్రకటించిన శారదామూర్తి ఇందుకు సమర్థన. ఆ తల్లి చేతుల్లో ఈ నాలూగూ ఉంటాయి. వీణ ఉండదు.

కాబట్టి, పోతన ప్రార్థించిన వాణి లలితాదేవి యొక్క జ్ఞానస్వరూపంగా భావించే 'శారదాదేవి' అని బోధపడుతుంది. భారతీయ జీవన విధానంలో ధర్మ, అర్థ, కామ, మోక్షాల సాధనే జీవిత లక్ష్యంగా భావిస్తారు. విద్య ద్వారా ఈ చతుర్విధ పురుషార్థాలను సాధించడమే లక్ష్యమని 'శారదామూర్తి' చేతుల్లోని నాలుగు ప్రతీకలు సూచిస్తున్నాయి. అమ్మవారి చేతుల్లోని పుస్తకం ధర్మానికి ప్రతీక. పద్మం అర్థానికి ప్రతీక. లక్ష్మీదేవి పుట్టింది దాని నుండే కదా! ఇక, మన్మథుడి వాహనమైన చిలుక.. కామ పురుషార్థానికి ప్రతీక. నాలుగోచేతిలోని జపమాల మోక్షానికి ప్రతీక. జపతపాల ద్వారానే కదా సిద్ధిపొందేది! విద్య ద్వారా ఈ నాలుగు పురుషార్థాలనూ సాధించాలని.. అప్పుడే మనిషికి భవబంధాల నుంచి విముక్తి అని తెలియజేయడం కోసమే విద్యాదేవత తన చేతుల్లో ఆ నాలుగు వస్తువులనూ ధరించిందని గ్రహించవచ్చు. 'సావిద్యా యా విముక్తయే' అని గదా ఆర్యోక్తి!!

## డ్రగ్స్ విక్రయిస్తున్న ఇద్దరు విద్యార్థుల అరెస్ట్

హైదరాబాద్,ఏప్రిల్17(వెలుతురు): మాదాపూర్‌లో డ్రగ్స్ విక్రయిస్తున్న ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులను ఎస్‌వోటీ పోలీసులు అరెస్టు చేశారు. ఏపీలోని రాజమహేంద్రవరానికి చెందిన గుత్తుల శ్యామ్‌బాబు, కాటూరి సూర్యకుమార్‌లను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.4.2 లక్షల విలువ చేసే 28 గ్రాముల ఎండీఎంఏ, రెండు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. బెంగళూరులోని కీలక నిందితుడు సోల్‌మెన్ నుంచి వీరు డ్రగ్స్ తీసుకొచ్చి.. రాజమహేంద్రవరంలో విద్యార్థులకు అధిక ధరకు విక్రయిస్తున్నట్టు దర్యాప్తులో తేలింది. నిందితులిద్దరూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కుమారులని పోలీసులు తెలిపారు. ఉన్నత చదువులకోసం బెంగళూరుకి వెళ్లి డ్రగ్స్ దందాలో దిగారని పేర్కొన్నారు. దర్యాప్తు నిమిత్తం డ్రగ్స్‌తో సహా నిందితులను మాదాపూర్ పోలీసులకు అప్పగించినట్టు చెప్పారు.

## ఫ్రస్టేషన్‌లో ఉన్న కెసిఆర్

### కాంగ్రెస్ ప్రభుత్వంపై పెడబొబ్బలు: జానా

హైదరాబాద్,ఏప్రిల్17(వెలుతురు): కాంగ్రెస్ సర్కార్ ఏడాది కూడా ఉండే పరిస్థితి లేదని మాజీ సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలకు మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి తీవ్రంగా స్పందించారు. కెసిఆర్‌తో పాటు బీఆర్‌ఎస్ నేతలు ఫ్రస్టేషన్‌లో ఉన్నారని, రేవంత్ సర్కార్ కు ఎలాంటి ఢోకా లేదన్నారు. అసెంబ్లీ ఫలితాలే ఎంపీ ఎన్నికల్లో రిపీట్ అవుతాయని స్పష్టంచేశారు. జానారెడ్డి మీడియాతో మాట్లాడుతూ 'ప్రజలే పట్టుకొమ్మలై కాంగ్రెస్ కు అండగా నిలిచారు. ప్రభుత్వాన్ని కూల్చాలని ట్రై చేసేవాళ్లకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారు. బీఆర్‌ఎస్?నేతలకు కాంగ్రెస్?ను విమర్శించే అర్హత లేదు. పదేండ్ల పాలనలో వాళ్లు?ఏమీ చేయలేదు. రాజకీయ లబ్ధికోసమే గులాబీ పార్టీ ప్రజలను రెచ్చగొడుతోంది. వచ్చే ఎన్నికనల్లో బీఆర్‌ఎస్‌కు శృంగభంగం తప్పదు. తెలంగాణ ఇచ్చిందే కాంగ్రెస్ పార్టీ. ప్రజల మద్దతు మాకే ఉంది' అని జానారెడ్డి అన్నారు.

## ఎన్నికల వేళ కీలక నేతల ఫోన్ల ట్యాప్

### ఇసికి ఫిర్యాదు చేసిన డిఎంకె

న్యూఢిల్లీ,ఏప్రిల్17(వెలుతురు): లోక్‌సభ ఎన్నికల వేళ కేంద్ర ఏజెన్సీలు తమ అభ్యర్థులు, కీలక నేతలు, మిత్రులు, సన్నిహిత బంధువుల ఫోన్లను ట్యాప్ చేస్తున్నట్టు డీఎంకే సంచలన ఆరోపణలు చేసింది. ఈ మేరకు ఎన్నికల సంఘానికి తమిళనాడు డీఎంకే నేత ఆర్‌ఎస్ భారతి ఒక లేఖలో ఫిర్యాదు చేశారు. 'కేంద్రం అధీనంలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), సీబీఐ, ఐటీ (ఇన్‌కమ్ టాక్స్), ఇతర ఏజెన్సీలు అక్రమంగా తమ అభ్యర్థులు, కీలక నేతలు, మిత్రులు, సన్నిహితుల ఫోన్లను ట్యాప్ చేస్తున్నాయి. రాజకీయ ప్రత్యర్థులపై ఈ ఏజెన్సీలు పెగాసస్ వంటి అధునాతన నిఘా సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగిస్తున్నట్టు తెలుస్తోందని ఆ లేఖలో భారతి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ చర్య అప్రజాస్వామికమని, స్వేచ్ఛగా, సజావుగా ఎన్నికలు జరిగేందుకు ఎన్నికల కమిషన్ తక్షణం జోక్యం చేసుకోవాలని ఆయన కోరారు. కాగా, అక్రమంగా తమ పార్టీ నేతల ఫోన్లను రాష్ట్ర ప్రభుత్వం ట్యాప్ చేస్తోందని తమిళనాడు విపక్ష పార్టీ అన్నాడీఎంకే ఆరోపిస్తోంది.

## చేపటవేటకు వెళ్లి వ్యక్తి మృతి

మెదక్,ఏప్రిల్17(వెలుతురు): చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన సంఘటన మెదక్ జిల్లా నిజాంపేట మండలం నస్కల్‌లో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వెంకటయ్య (48) నస్కల్ గ్రామ శివారులోని వాగులో చేపలు పట్టడానికి వెళ్లాడు. చేపలు పడుతున్న క్రమంలో వెంకటయ్య వాగులో ఉన్న లోతైన గుంతలోకి కాలు జారడంతో నీళ్లలో మునిగి ఊపిరి ఆడక అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుని భార్య కళావతి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. వెంకటయ్య మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## గ్రానైట్ కూలీలకు అండగా ఉంటా: ఆర్‌ఎస్పీ

నాగర్‌కర్నూల్,ఏప్రిల్17(వెలుతురు): నాగర్‌కర్నూల్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. బుధవారం ఉదయం నాగర్‌కర్నూల్‌లో గ్రానైట్ హమాలీలను ఆర్‌ఎస్పీ కలిశారు. ఈ సందర్భంగా హమాలీ లతో కలిసి ఆర్‌ఎస్పీ గ్రానైట్ బండలను మోశారు. అనంతరం ఆర్‌ఎస్పీ మాట్లాడుతూ.. గ్రానైట్ బండలు మోయడం నిజంగా చాలా కష్టమైన పని అని పేర్కొన్నారు. గ్రానైట్ బండలు మోసే హమాలీల సమస్యలను తెలుసుకున్నానని చెప్పారు. అత్యంత ప్రమాదంలో హమాలీల జీవితాలు ఉన్నాయని, వారి చేతులపై గాయాలను చూస్తే భయమేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఎంపీగా గెలిచిన వెంటనే గ్రానైట్ హమాలీల కోసం స్థానిక నాయకుల సహకారంతో ఒక ప్రత్యేక కో ఆపరేటివ్ సొసైటీ ఏర్పాటు చేసి, వాళ్లను గ్రానైట్ యజమానులుగా మార్చే ప్రయత్నం చేస్తానని ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ హామీ ఇచ్చారు.

## రాయి దెబ్బకే అల్లాడుతున్నావే..

### వివేకా హత్య కేసులో ఆధారాలు ఉన్నా స్పందించవే

### సిఎం జగన్‌కు ఆదినారాయణ రెడ్డి సవాల్

కడప,ఏప్రిల్17(వెలుతురు): ఏపీ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం ఉద్ధృతమయ్యింది. పార్టీలకు అతీతంగా సీట్లు పొందిన అభ్యర్థులు అందరూ ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో మాజీమంత్రి, జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆది నారాయణ రెడ్డి సీఎం జగన్ మోహన్ రెడ్డి దంపతులపై సంచలన వాఖ్యలు చేశారు. కంటికి రాయిదెబ్బ తగిలితే రాయి చూపరంటూ జగన్ విమర్శలు గుప్పించారు. సీఎం జగన్, ఆయన సతీమణి భారతీలకు వైఎస్ వివేకా హత్యకు సంబంధించిన అన్నివిషయాలు ముందే తెలుసునని అన్నారు. సీబీఐ వద్ద అన్ని రికార్డులు వున్నాయని, అప్పట్లో ప్రతిరోజూ తనను ఇబ్బందులు పెట్టారని ఆది నారాయణ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వివేకా కేసులో నాకు సంబంధించి ఒక్క పాయింట్ ఉన్నా.. నా పాత్ర ఉన్నా నన్ను బహిరంగంగా ఉరి తీయండి అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆఖరికి కోడికత్తి కేసు కూడా తన మీద పెట్టాలని చూశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ప్లలెలో ఏయే సహజ వన రులున్నాయో తెలుసుకోవడానికి ఎమ్మెల్యే సుధీర్ గ్రామాల్లో తిరుగుచున్నాడని మండిపడ్డారు. జమ్మలమడుగు నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభివృద్ధి చేయలేదని, ఎమ్మెల్యే సుధీర్ చిత్తుచిత్తుగా ఓడిపోతారని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే కన్నా మా ఊరిలో దొంగ కోళ్లు పట్టుకునే బీమన్న మేలు.. వ్యంగ్యస్త్రాలు సంధించారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకో... అతిగా మాట్లాడితే చెప్పు తెగుతుందని తీవ్ర హెచ్చరిక చేశారు.

## రాష్ట్రం గొంతెండుతోంది: హరీష్ రావు

హైదరాబాద్,ఏప్రిల్17(వెలుతురు): రాష్ట్రం గొంతెండిపోతోందని, నీళ్ల కోసం ప్రజలు రోడ్లెక్కుతున్నారని బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ హరీష్ రావు విమర్శించారు. ఖాళీ బిందెలతో ధర్నాలు, ట్యాంకర్ల కోసం ఎదురు చూపులు ఉన్నాయని, పదేళ్ల కెసిఆర్ ప్రభుత్వంలో ఇలాంటి దృశ్యాలు ఎప్పుడు కనిపించలేదన్నారు. కాంగ్రెస్ పాలనలో నీటి కష్టాలు మళ్లీ మొదలయ్యాయని, బిఆర్‌ఎస్ హయాంలో తండాల్లోనూ మిషన్ భగీరథ జలధార వచ్చేదని, కాంగ్రెస్ ప్రభుత్వం పంటకు సాగు నీళ్లు ఎలాగూ ఇవ్వలేదని, కనీసం ప్రజలకు మంచినీళ్లైనా ఇవ్వాలని కోరుతున్నామని హరీష్ రావు విజ్ఞప్తి చేశారు.

## గులకరాయి డ్రామాలో బీసీ బిడ్డ బలి

### అచ్చన్నాయుడు తీవ్ర ఆగ్రహం

అమరావతి,ఏప్రిల్17(వెలుతురు): సానుభూతి కోసం చేసిన గులకరాయి డ్రామాలో బీసీ బిడ్డను బలిచ్చేందుకు జగన్ రెడ్డి కుట్ర చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ... గతంలో కోడికత్తి డ్రామాలో ఒక దళిత బిడ్డను ఐదేళ్ల పాటు జైలుపాలు చేశారని.. ఇప్పుడు బీసీ వర్గానికి చెందిన సతీష్ అనే అమాయకపు యువకుడిని ఇరికిస్తున్నారని ఆరోపించారు.

# రాజకీయాల్లో అంతా నటిస్తున్నారు

### అందుకే నటులు రాజకీయాల్లోకి వస్తున్నారు

### జగన్ నాయకత్వం అంటే ఇష్టమన్న నటుడు విశాల్

హైదరాబాద్,ఏప్రిల్17(వెలుతురు): తెలుగు రాష్ట్రాల్లోనే కాదు.. ప్రస్తుతం దేశమంతా రాజకీయ వేడి బాగా నడుస్తుంది. దాంతో ఎవరు ఎప్పుడు ఎలాంటి కామెంట్స్ చేసినా వెంటనే వైరల్ అవుతున్నాయి. తాజాగా విశాల్ కూడా తాజా రాజకీయాలపై తనదైన శైలిలో స్పందించాడు. రత్నం సినిమా ప్రమోషన్స్ లో భాగంగా హైదరాబాద్ వచ్చిన విశాల్.. తెలుగు రాష్ట్రాల్లో ఉన్న రాజకీయ పరిస్థితులపై స్పందించడమే కాకుండా.. ఏపీలో ఎవరు ముఖ్యమంత్రి కాబోతున్నారో కూడా క్లారిటీగా చెప్పేశాడు. పైగా తన రాజకీయ భవిష్యత్తుపై కూడా క్లారిటీ ఇచ్చాడు ఈ హీరో. తాను ఆల్రెడీ రాజకీయాల్లోకి వచ్చాను అని.. వాళ్లే నామినేషన్ రిజెక్ట్ చేశారు. 2026 ఎన్నికల్లో పోటీ చేస్తాను.. వాళ్ళు ఏం చేయలేదు కాబట్టే విశాల్ వచ్చాడు.. వాళ్ళు చెప్పింది చేస్తే విశాల్ మళ్లీ సినిమా యాక్టర్ గానే ఉండిపోతాడు అంటూ గట్టిగానే కౌంటర్ వేశాడు ఈ హీరో. జనాలకు మంచి చేయాలి అనుకున్నప్పుడు ఎందుకు ఇన్ని రాజకీయ పార్టీలు.. అందరూ కలిసి మంచి చేయొచ్చు కదా అని కొత్త వాదనకు తెర తీశాడు విశాల్. అన్ని పార్టీలు అందరూ కలిసి పనిచేస్తే ఒక్క సంవత్సరంలోనే మంచి చేయొచ్చు.. 5 సంవత్సరాలు ఎందుకు అనేది ఈయన వాదన. రాజకీయ నాయకులు నటులుగా మారుతున్నారు.. అందుకే నటులు రాజకీయాల్లోకి వస్తున్నారు అంటూ సెన్సేషనల్ కామెంట్స్ చేశాడు విశాల్. ఇక సినిమాలు రాజకీయాలు బ్యాలెన్స్



చేయలేము.. ఎక్కడో ఏసి రూమ్ లో కూర్చొని చేసే పని కాదు ఇది.. రాజకీయాలకు రావాలంటే కొన్ని విషయాలు పూర్తిగా మర్చిపోవాలి అని చెప్పుకొచ్చాడు ఈయన. ఇన్ డైరెక్ట్‌గా పవన్ కల్యాన్‌ను ఈయన టార్గెట్ చేశాడు అంటూ ఫ్యాన్స్ అప్పుడే ట్రోలింగ్ కూడా మొదలుపెట్టారు. ఈ సమాజంలో డబ్బులు పెట్టి కొనాల్సినవి ఉచితంగా ఇస్తున్నారని.. ఉచితంగా రావాల్సిన విద్యను, మెడికల్, నీళ్లు అమ్మేస్తున్నారు అంటూ ఆవేదన వ్యక్తం చేశాడు విశాల్. అందరికీ ఫ్రీ ఎడ్యుకేషన్ ఇవ్వాలి.. అప్పుడే సమాజం బాగుపడుతుంది అంటూ చెప్పాడు ఈ నటుడు. ఈ పరిస్థితులు మార్చే రాజకీయ నాయకుడికి తాను జీవితాంతం ఓటు వేస్తాను అంటూ చెప్పుకొచ్చాడు. ముఖ్యంగా కొత్త ఓటర్లు కచ్చితంగా ఓటు వేయాలి.. 5 సంవత్సరాలకు ఒకసారి వచ్చే ఈ అవకాశాన్ని వాళ్ళు వదులుకోకూడదు అని చెప్పాడు విశాల్.ఏపీ రాజకీయాలపై స్పందిస్తూ.. తాను ఏ పార్టీ సపోర్టర్ కాదు.. కానీ ఐ లైక్ జగన్.. ఈసారి కూడా ఆయనే మళ్లీ సీఎంగా వస్తారు అంటూ ఆశాభావం వ్యక్తం చేశాడు. దాంతో పాటు ఈ మధ్య జగన్ పై జరిగిన దాడి గురించి కూడా స్పందించాడు విశాల్. ఒక రాజకీయ నాయకుడిగా ప్రజలకు మంచి చేయాలని బయటకు వచ్చినప్పుడు ఇలాంటివన్నీ జరుగుతూ ఉంటాయి.. ఈ అటాక్స్ మొదటిసారి కాదు.. గతంలోనూ జరిగాయి.. ఇక మీద జాగ్రత్తగా ఉండాలి ఇదంతా పార్ట్ ఆఫ్ పొలిటికల్ లీడర్స్ లైఫ్ అని చెప్పుకొచ్చాడు ఈయన. మొత్తానికి జగన్ సీఎం అవుతాడు అంటూ విశాల్ చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# నిజామాబాద్‌లో వేడెక్కిన రాజకీయం

### పోటాపోటీగా ముగ్గురు అభ్యర్థుల ప్రచారం

### 19న నామినేషన్ వేయనున్న అర్వింద్

### 22న జీవన్ రెడ్డి నామినేషన్ కార్యక్రమం

నిజామాబాద్,ఏప్రిల్17(వెలుతురు): లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ ఈ నెల 18న విడుదల కానుండడంతో నిజామాబాద్ పరిధిలో రాజకీయం వేడెక్కింది. ఎన్నికల తేదీ సమీపిస్తున్న కొద్దీ రాజకీయాలు వేడెక్కుతు న్నాయి. అభ్యర్థులు ప్రత్యర్థులపై ఘాటైన విమర్శలు చేస్తున్నారు. ప్రత్యర్థి పార్టీ విధానాలను ప్రశ్నిస్తూ సవాళ్లు విసురుతున్నారు. ఇందుకు పార్టీ సమావేశాలే కాకుండా విలేకర్ల సమావేశాలు, ప్రసార మాధ్యమాల్లో ఇంటర్వ్యూలను వేదికగా చేసుకుంటున్నారు. సామాజిక మాధ్యమాల్లోనూ ప్రత్యర్థుల వైఫల్యాలు, తమకు అవకాశం ఇస్తే ఏం చేస్తామనే విషయాలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. మూడు పార్టీలు వ్యూహాత్మకంగా ప్రచారం సాగిస్తు న్నాయి. ప్రధానంగా పార్టీ శ్రేణులను సమాయత్తం చేయటంపైనే దృష్టిసారించాయి. ఇకపై జనంలోకి వెళ్లే విధంగా ప్రచార కార్యాచరణ అమలు చేయనున్నాయి. ఇందుకోసం పార్టీలు పార్లమెంటు నియోజకవర్గంలోని అసెంబ్లీ సెగ్మెంట్లకు సమన్వయ కమిటీలను వేస్తున్నాయి. ఆయా కమిటీలు మండలాల వారీగా ఉన్న కమిటీలతో సమన్వయం చేసుకుంటూ ప్రచార పర్వాన్ని ఉధృతం చేయనున్నట్లు తెలుస్తోంది. నామపత్రాల దాఖలు తర్వాత ప్రచార సామగ్రి మండలాల వారీగా పంపిణీ చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేశారు. పోటీ చేస్తున్న ముగ్గురు అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారంలో దూసుకు పోతున్నారు. బిజెపి నుంచి ప్రస్తుత ఎంపి ధర్మపురి అర్వింద్, కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, బిఆర్‌ఎస్ నుంచి బాజిరెడ్డి గోవర్ధన్ పోటీలో ఉన్నారు. నోటిఫకేసన్ విడుదలతో గురువారం నుంచే నామినేషన్ల దాఖలు పక్రియ ప్రారంభమవుతుంది. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి మూడు ప్రధాన పార్టీల తరపున బరిలోకి దిగుతున్న ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని సమాచారం. భారాస అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ కూడా 19వ తేదీనే నామినేషన్ దాఖలు చేయనున్నారు. భారాస నేత, మాజీ మంత్రి



అభ్యర్థులు ఇప్పటికే ఓట్ల సమరానికి సన్నద్ధమయ్యారు. నిత్యం పార్టీ శ్రేణులతో సమావేశమవుతూ అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నారు. భాజపా, భారాస అభ్యర్థులు 19వ తేదీన, కాంగ్రెస్ అభ్యర్థి 22న నామినేషన్ దాఖలు చేసేందుకు నిర్ణయించుకున్నారు. ఇందుకు ఆయా పార్టీల నాయకత్వం ఏర్పాట్లు చేస్తోంది. భాజపా అభ్యర్థి ధర్మపురి అర్వింద్ ఈ నెల 19న పేరు, బలం ఆధారంగా నామినేషన్ దాఖలు చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమం సాదాసీదాగా ఉండనుంది. ఈ నెల 25న మరోమారు ర్యాలీగా వెళ్లి నామపత్రాలు దాఖలు చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఆ రోజు ర్యాలీ, సభ ఉండనుందని సమాచారం. మహారాష్ట్ర ఉప తన్నీరు హరీశ్‌రావు హాజరవుతారని చెబుతున్నారు. 22న కాంగ్రెస్ అభ్యర్థి తాటిపర్తి జీవన్‌రెడ్డి నామినేషన్ వేయనున్నారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, కాంగ్రెస్ పెద్దలు హాజరవుతారని తెలుస్తోంది. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో రెండు బహిరంగ సభలు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇందులో ఒకటి అభ్యర్థి నామినేషన్ రోజునే నిజామాబాద్ నగరంలో నిర్వహించాలనే ఆలోచన జిల్లా పార్టీ చేస్తోంది.

ఆ రోజు వీలుకాకుంటే సభ తేదీ మారే అవకాశం ఉంది.

# గులకరాయి ఘటనలో దర్యాప్తు ముమ్మరం

అమరావతి,ఏప్రిల్17(వెలుతురు): ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిపై జరిగిన గులకరాయి దాడి ఘటనలో పలువురు అనుమానితులను పోలీసులు అరెస్ట్ చేస్తున్నారు. ఇప్పటికే ఐదుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు తాజాగా మరో వ్యక్తిని అరెస్ట్ చేశారు. టీడీపీ నాయకుడు, వ్డెర సంఘం నేత వేముల దుర్గారావును మంగళవారంరాత్రి పోలీసులు అరెస్ట్ చేశారు. సింగ్‌నగర్ వంతెన వద్ద ఉండగా దుర్గారావును పోలీసులు తీసుకెళ్లారు. అయితే దుర్గారావు అరెస్ట్‌పై కుటుంబీకులు, వ్డెర కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అమాయకులను బలిచేస్తున్నారంటూ ఆందోళనకు దిగారు. గులకరాయి దాడి ఘటనలో నిన్న ఐదుగురు మైనర్లను పోలీసులు తీసుకెళ్లడంతో సింగ్ నగర్ వ్డెర కాలనీ వాసుల ఆందోళనకు దిగారు. అమాయకులను బలి చేస్తున్నారంటూ ఆక్రోశం వెల్లగక్కారు. వేముల దుర్గారావు కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. 'మేము ప్రతి రోజూ పనులు చేసుకుని కుటుంబం పోషించుకుంటాం. మాకు ఏ పార్టీ తో సంబంధం లేదు. ఎవరు డబ్బులు ఇచ్చినా ర్యాలీలకు వెళతాం. జగన్ సభకు రెండు వందలు అంటే మా ఆడోళ్లు వెళ్లారు. మగాళ్లకు మూడు వందలు ఇచ్చారు. నిన్న దుర్గారావు ఎవరు అని పోలీసులు ఇంటికి వచ్చారు. వివరాలు ఏమీ చెప్పకుండా తీసుకెళ్లారు. ఇప్పుడు జగన్ పై రాయి వేశారని చెబుతున్నారు. సీఎంపై దాడి చేసే అంత ధైర్యం మా వాడికి లేదు. దుర్గారావుకు చిన్న పిల్లలు, భార్య ఉన్నారు. మా కాయ కష్టంతో బతకడమే మాకు తెలుసు. దుర్గారావుతో సహా మేమంతా వైసీపీ మీటింగ్‌లకు కూడా వెళ్లాం. ఎమ్మెల్సీ రుహుల్లాకు కూడా మేమేంటో తెలుసు. మొన్న ఇఫ్తార్ విందుకు కూడా మాకు డబ్బులు ఇచ్చి తీసుకెళ్లారు. దుర్గారావుకు ఏమైనా జరిగితే పోలీసులదే బాధ్యత. అమాయకులను బలి చేయవద్దని విజ్ఞప్తి చేశారు.

మరోవైపు రాయి దాడి ఘటనలో అరెస్ట్ అయిన దుర్గారావు ద్వారా సెంట్రల్ నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి బోండా ఉమను ఈ కేసులో అక్రమంగా ఇరికించేందుకు ప్రయత్నిస్తున్నారని టీడీపీ ఫిర్యాదు చేసింది. బోండా ఉమాపై నెపం మోపేందుకు రాజకీయ కుట్ర జరుగుతుందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ఆరోపించారు. ఈ మేరకు రాష్ట్ర సీఈఓ, డీజీపీకి వర్ల రామయ్య ఫిర్యాదు చేశారు. దర్యాప్తు నిష్పక్షపాతంగా జరిగే విధంగా చూడాలని టీడీపీ నేత కోరారు.

## దొంగే దొంగ అన్నట్లుగా బాబు పరిస్థితి

### జగన్‌పై రాయిదాడి ఖచ్చింతంగా బాబు పనే

### వైఎస్సార్సీపీ అధికార ప్రతినిధి రవిచంద్రారెడ్డి

అమరావతి,ఏప్రిల్17(వెలుతురు): చంద్రబాబు నాయుడు ప్రవర్తన చూస్తుంటే ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డిపై దాడిచేయించిన అసలు దొంగ ఆయనే అనిపిస్తుందని వైఎస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కనుమూరి రవిచంద్రారెడ్డి అన్నారు. ముందు జాగ్రత్త కోసం దొంగే..దొంగా..దొంగా అని అరుస్తున్నాడేమోనని అన్నారు. నీ వరకూ వస్తుందని భుజాలు తడుముకుంటున్నావా బాబు అంటూ ప్రశ్నించారు. ఇప్పటికే టీడీపీ అంటే టోటల్‌గా దివాళా తీసే పార్టీ అయిందని, జూన్ 4 నాటికి టీడీపీ అంటే తూర్పు తిరిగి దండం పెట్టే పార్టీగా మిగలనుందని విమర్శించారు. టీడీపీ విజయవాడ సెంట్రల్ అభ్యర్థి బోండా ఉమని సీఎం జగన్‌పై జరిగిన దాడి కేసులో ఇరికించేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు చంద్రబాబు ఆందోళన చేందుతున్నారు. పోలీసు అధికారులు వైఎస్సార్సీపీ ప్రమేయంతో పనిచేస్తున్నారని దుర్మార్గమైన స్టేట్ మెంట్ ఒకటి ఇచ్చాడు. చంద్రబాబూ...ఇంత వరకూ పోలీసులు ఎటువంటి స్టేట్‌మెంట్ ఇవ్వలేదు. వారి దర్యాప్తు గురించి కానీ, ఎవరిని విచారిస్తున్నారన్న విషయం కానీ, ఎవరి పేర్లు అందులో ఉన్నాయన్నది ఏదీ పోలీసులు ఇంకా చెప్పలేదు. అలాంటప్పుడు మీకు ఏం సమాచారం ఉండి ఇలాంటి ప్రెస్ రిలీజ్ ఇచ్చారో సమాధానం చెప్పాలని అన్నారు. అధికారికంగా చంద్రబాబు ఇలాంటి ప్రెస్‌నోట్ ఇస్తున్నారంటే మీరు భుజాలు తడుముకుంటున్నట్లు అర్ధం కావడంలేదా అని అన్నారు. కచ్చితంగా మీరు దొరికిపోయారని, మీరే ఈ దాడి చేయించారని చెప్పకనే చెప్తున్నారని అన్నారు. మీరు గుంటూరు దాటిన తర్వాత జగన్ బస్సు యాత్రకు క్రేజ్ తగ్గుతుందని భావించారు. కానీ గుంటూరు నుంచి విజయవాడ వచ్చే సరికి కృష్ణా వారధి పోటెత్తడంతో పాటు విజయవాడ జనసంద్రంగా మారింది. ఆ జన ప్రవాహాన్ని చూసి ఓర్చుకోలేక మీరే ముఖ్యమంత్రి జగన్‌పై దాడి చేశారని ఖచ్చితంగా అర్థం అవడం లేదా అని ప్రశ్నించారు. మీరే చెప్తున్నట్లు, ఈ దాడి వెనక బోండా ఉమ ఉన్నట్టు మీరు చెప్తున్నారంటే... చివరకు ఈ కేసు మీ వరకూ వస్తుందని భయపడుతున్నారా చంద్రబాబు అని నిలదీశారు. వాళ్ల స్పందన చూస్తే అసలు దొంగ చంద్రబాబేనా అనే అనుమానాలు కలుగుతున్నాయన్నారు. తన పేరు ఎక్కడ బయటకు వస్తుందోనని బాబు భయపడుతున్నాడా అనే సందేహం కలుగుతోంది. అసలు చంద్రబాబుకు ఈ సమాచారం ఎక్కడి నుంచి వచ్చింది? ఖచ్చితంగా ఈ దాడి చేయించింది చంద్రబాబే అనేది వారి స్పందన చూస్తే తెలుస్తోందని అన్నారు.

## దుబాయ్‌ను కుదిపిన భారీ వర్షం

### ప్రవాస భారతీయుడు మృతి

దుబాయ్,ఏప్రిల్17(వెలుతురు): 75 ఏళ్ల చరిత్రలో కనివీని ఎరుగని విధంగా కురిసిన అకాల వర్షాలు.. దుబాయ్‌ను అతలాకుతలం చేశాయి. ఈ వరద బీభత్సానికి



ఓ ప్రవాస భారతీయుడు మృతి చెందాడు. రాజన్నసిరిసిల్లా ఇల్లంతకుంట మండలానికి చెందిన భాస్కర్ అనే ఓ ప్రవాసీయుడు.. జలప్రళయానికి భయపడి కారులోనే గుండె ఆగి చనిపోయాడు. నీటి ప్రవాహంలో కారు కొట్టుకోపోవడం వల్ల మరణించాడా లేక.. నీళ్లను చూసి గుండేపోటుతో మరణించాడా అనేది ఇంకా తెలియాల్సి ఉందని దుబాయిలోని తెలంగాణ కాంగ్రెస్ ఎన్నారై విభాగం అధ్యక్షుడు యస్వీరెడ్డి తెలిపారు. మరోవైపు వరదల కారణంగా జలప్రళయానికి అతలాకుతలమైన దుబాయ్ నగర పౌర జీవనం ఇప్పుడిప్పుడే కోలుకొంటోంది. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు బుధవారం కూడా మూసి ఉన్నాయి. అలాగే పాఠశాలలన్నీ శుక్రవారం వరకు ఆన్‌లైన్ విధానంలో పని చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. శేఖ్ జాయద్ రోడ్డుతో సహా అనేక ట్యూనళ్ళ నుంచి నీళ్ళను యుద్ధ ప్రతిపాదికన తొలగించడంతో స్తంభించిన రోడ్డు రవాణా వ్యవస్థను తిరిగి పునరుద్ధరించారు. అనేక భవనాల్లోని సెల్లార్లు నీటితో నిండిపోవడంతో కార్లను బయటకు తీయలేని పరిస్థితి ఉందని కర్నూలు నగరానికి చెందిన సామాజిక కార్యకర్త శేఖ్ అబ్దుల్లా తెలిపారు. సోనాపూర్, జబల్ అలీ, అల్ ఖోజ్ ప్రాంతాలోని లేబర్ క్యాంపుల్లోకి వచ్చిన వరద నీటిను తోడేసినా దుర్గంధం పోవడానికి మరికొన్ని రోజులు పడుతుందని, అప్పటి వరకు ఇబ్బందులు తప్పవని అబ్దుల్లా చెప్పారు. కార్లు చెడిపోవడంతో తెలుగు ప్రవాసీయులకు పెద్ద నష్టం జరిగిందని మరో సామాజిక కార్యకర్త ప్రసన్న సోమిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. దుబాయ్ నుండి హైదరాబాద్ సహా ప్రపంచవ్యాప్తంగా వెళ్లాల్సిన అనేక విమానాలను బుధవారం కూడా వాయిదా వేశారు. ఈ మేరకు ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్ ప్రకటన విడుదల చేసింది. ల దుబాయ్, ఎయిర్ అరేబియా విమానాల రాకపోకలకు కూడా అంతరాయం కలిగింది. షార్జా, రాస్ అల్ ఖైమా ఎమిరేట్స్‌తో పాటూ పొరుగున ఉన్న ఒమాన్‌లో కూడా వర్షాల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at **SRI SHANTHI PUBLICCATIONS** H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. **EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609.** Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com